
# శ్రీరమణ పేరడీలు

సరికొత్త చేర్పులతో
బాపు బొమ్మలతో



# శ్రీరమణ పేరడీలు

*సరికొత్త చేర్పులతో*

*బాపు బొమ్మలతో*

**నవోదయ పబ్లిషర్స్**

**విజయవాడ**

SRIRAMANA PERADEELU

SRIRAMANA

© SRIRAMANA

# 27 Omnagar Colony,

Lungar House

Hyderabad-500 008,

Phone: 040- 2351 4358

Fax ; 040- 2351 5461

Cover Design and Caricatures

Bapu

Combined Edition

Second Print

September 2007

Published by

NOVODAYA PUBLISHERS

Karl Marx Road, VJAYAWADA -520 002.

This book is digitized and brought to you by Kinige

# మళ్లీ పాతికేళ్ళకు...

శ్రీరమణ పేరడీలు 1980లో, అంటే పాతికేళ్ళ క్రితం మొదటి ముద్రణ వెలువడింది. తెలుగులో పేరడీలు ఒక సంపుటిగా రావడం అదే ప్రధమం. ప్రముఖులవచనశైలిని అనుకరించి ఔననిపించుకున్నవి కూడా యివే. ఈ పాతికేళ్ల వ్యవధిలో అన్ని రంగాలతో పాటు సాహిత్యరంగంలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి. ఇది మొదటగా ఆంధ్రజ్యోతి డైలీలో శ్రీరమణ రాస్తున్న రోజులలో జీవించి వున్నరచయితలలో కొందరు యిప్పుడు లేరు. పేరడీ ప్రక్రియ లిటరరీ మిమిక్రీలాంటిది. అసలు గొంతుతో పరిచయం వుంటే తప్ప అనుకరణను ఆనందించలేరు. పాతికేళ్ల క్రితం యిందులో అనుకరించిన ప్రముఖుల శైలిలో పూర్తిగా పరిచయం వున్న పాఠకులు బాగా ఆనందించారు. ఇప్పుడు ఆ తరం తరిగిపోయింది. కొత్తతరంలో కొందరైనా తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన ఆ మహానుభావులను చదివేవుంటారు. వారంతా ఆమోదించి, ఆనందించి, ఆనందించగలరనుకుంటున్నాం. లేదా, యివి చదివాక మాతృక చదవాలని వుత్సాహం కలిగితే అది మాకు తో సంతోషం.

శతాబ్దం మారింది. వచ్చే శతాబ్దంలో కవితారీతులపై సాహితీ జోస్యం చెబుతూ 1978లో శ్రీరమణ రాసిన వ్యాసం యిందులో వుంది. ఆయన చెప్పిన జోస్యంలో కొన్నైనా నిజాలు అయినాయేమో టేరీజు వేసుకోవచ్చు. ఇందులో కొత్తగా 'రైలుబండిలో వైతాళికులు' అనే ప్రహసనాన్ని చేర్చాము. అది యిప్పటికే పలుచోట్ల ప్రచురితమై, రేడియో రూపకమై తెలుగు పాఠక శ్రోతల అభిమానాన్ని పొందింది. అయితే, అందులోని కవుల జీవనసరళి, కవితాశైలి తెలిసిన వారికి

మరింత వినోదాన్ని పంచిపెడుతుంది. నాడు నేడు కూడా యీ పుస్తకానికి బాపు కారికేచర్స్ నిత్యనూతన పరిమళాలను సమకూర్చాయి. అనేక చేర్పులతో మీ ముందుకు వచ్చిన యీ కొత్త కూర్పును మీరు సమాదరిస్తారని ఆశిస్తున్నాం.

విజయవాడ -ప్రచురణకర్తలు

1-4-2004

ఇదీ వరస


| | |
|---|---|
| ఇన్ట్రో | 6 |
| సుప్రసిద్ధుల వచన పచనం | 10 |
| మహానుభావుల పదవల్లరి | 20 |
| నవకవనంలో నానారకాలు | 34 |
| పీఠికా పాటవం | 46 |
| గులాబీ వర్ణన | 56 |
| అనువాద మోదం | 68 |
| ఫీచర్ వ్యాసవ్యాసులు | 78 |
| ప్రముఖుల ప్రేమలేఖలు | 91 |
| సాహితీ జోస్యం | 129 |
| సినిమా సమీక్షలు | 145 |
| బాపుకు విశ్వనాథ అభినందన | 155 |
| ఆరుద్రకు విశ్వనాథ అభినందన | 158 |
| హైకూలూ, స్మయికూలూ | 161 |
| మధురవాణి ఇంటర్వ్యూలు | 163 |
| రైలుబండిలో వైతాళికులు | 172 |
| స్వ పరిచయం | 194 |

# ఇన్ట్రో

సీరియస్‌గా, పాయింట్ తరువాత పాయింట్‌గా విమర్శించేవారి కంటే, వ్యంగ్యంగా, కనబడని దెబ్బ కొట్టేవారిని చూసి ఎక్కువ భయపడాలి. ఏమాత్రం సందు దొరికినా, వీరు మనల్ని వేళాకోళం చేసి నవ్వులపాలు చేస్తారు.

అందుకే శ్రీ రమణ పేరడీలకి పీఠిక వ్రాయాలంటే ఓ పక్కన జంకుగానూ వుంది. వ్రాసి, ఆయన్ని మనసారా అభినందించే అవకాశం దొరికినందుకు సంతోషంగానూ వుంది.

"వాసి గల ప్రతి రచయితకు స్వీయశైలి తప్పక వుంటుంది. ఇలా స్వీయశైలి లేని రచయితను అనుకరించడం అసాధ్యం." అని శ్రీరమణ మొదటే నిర్వచించారు. పైగా ఈ పుస్తకంలో పాత్రికేయులతో సహా కొందరు ప్రముఖ రచయితల పీఠికలను కూడా ఆయన పేరడీ చేశారు.

అందుకే ఈ పుస్తకం మలి ముద్రణకు వచ్చినపుడు ఈ పీఠికని కూడా పేరడీ చేస్తారేమోనన్న జంకూ వుంది: చేస్తే నన్ను కూడా ప్రముఖ రచయితల జాబితాలో చేర్చినట్టు అవుతుందన్న ఆశా వుంది.

శ్రీరమణ తెలుగు వచనోద్యానవనంలో ఈ మధ్యనే విరిసిన నవ్వులపువ్వు. విరిసీవిరియగానే హాస్యపరిమళాల హాయితో, పేరడీల గారడీతో అందర్నీ సమ్మోహనపరచిన రచయిత.

నిజానికి శ్రీరమణను పోల్చవలసింది పువ్వుతో కాదేమో, నాలుగైదేళ్ళనాడు ఎవరితోనూ చెప్పా పెట్టకుండా తెలుగు సాహిత్య రంగంలోకి దూసుకువచ్చారు. అంతకుముందు ఆయన ఏమి వ్రాశారో నాకు తెలియదు కాని, వున్నట్టుండి ఒకే ఒక పేరడీతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఎవరీ 'కొత్తతార' ఏమీ రచన అని అందరూ ఆశ్చర్యపోయేటట్టు చేశారు.

పేరడీలు తెలుగు వారికి కొత్తకాదు. ఈప్రక్రియను జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి పాప్యులర్ చేశాడు. సంస్కృతాంధ్రాలలో పండితుడుగా, భావుకుడుగా ఆయన ఎన్నో మంచి రచనలు చేయకపోలేదు. కాని, ఆయన ప్రతిభ ఎక్కువగా ప్రసిద్ధ రచయితలను అనుకరించి వెక్కిరించడంలోనే వికసించింది. జలసూత్రం పేరు చెప్పగానే విశ్వనాథ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీవంటి కవులకు ఆయన పేరడీలే జ్ఞాపకం వస్తాయి. పేరడీ కవితకు జలసూత్రం ఆద్యుడు, ఆరాధ్యుడు కూడా.

చీమల మెల్లగ నడుచును.
దోమలు సంగీత మధురధోరణి నుండున్
సామజయానలె శోభా
సీమ లటన్నారు ఋషులు శ్రేయాగురువుల్

అనే పేరడీ పద్యం చదవగానే అది రాయప్రోలు వారి కవితాశైలికి అనుకరణ అని తెలియకపోతే జలసూత్రం గురించి చెప్పుకోవలసిన పనే లేదు.

అలాగే-

భావుకత, సూక్ష్మ పరిశీలన కలిగి వుండాలి. అన్నిటికంటే ముఖ్యంగా హాస్య చాతుర్యం వుండాలి.

సాధారణంగా ఒక రచయిత రచనలు చదువుతున్నప్పుడు ఆ రచయిత మేనరిజమ్స్ మనం గుర్తించము. వాటిని పేరడీయిస్టు పట్టుకోగలగాలి. ఒక రచయిత ఎప్పుడూ ఒక రకంగానే ఆలోచిస్తాడు. అతడి ఆలోచనలన్నీ ఒక మూసలోకే ప్రవహిస్తాయి. ఆ మూసను పేరడీయిస్టు పట్టుకోవాలి, అప్పుడు మంచి పేరడీ వస్తుంది.

ఈ సంపుటంలో శ్రీరమణ ఎందరో ప్రముఖ రచయితలను జయప్రదంగా పేరడీ చేశారు. గులాబీ పువ్వు, జాతీయ విహంగం, పుష్కరాలు - ఇలాగ ఒక్కొక్క వస్తువును తీసుకుని దానిపై ఏ రచయిత ఎలా వ్రాస్తాడో ఊహించి వ్రాయడం ఈయన ఎంచుకున్న పద్ధతి. దీనిలో ఆయన పూర్తిగా కృతకృత్యుడయ్యారు.

ఇంకొక్క మాట యిక్కడ చెప్పాలి. ఆయా రచయితలను పేరడీ చేసినంత మాత్రాన వారిపై పేరడీయిస్టుకు గౌరవం లేదని కాదు. గౌరవ భాజనులైన వారినే - తమదంటూ ఒక ప్రత్యేక శైలి, వ్యక్తిత్వం కలవారినే - అతడు అనుకరిస్తాడు. ఉదాహరణకు శ్రీరమణ ఈ సంపుటంలో పేరడీ చేసిన వారుండరు తెలుగు సాహిత్యంలో ఉద్దండులు. కనుకనే వారినే ఆయన అనుకరించడానికి ఎంచుకున్నారు.

ఆంధ్రజ్యోతిలో వెలువడిన ఈ పేరడీలన్నీ ఇప్పుడు పుస్తకరూపంలో వస్తూ తెలుగు సాహిత్యంలో ఒక గౌరవస్థానాన్ని అలంకరిస్తున్నాయి. శ్రీ బాపు వేసిన రేఖా చిత్రాలు వీటికి మరింత వన్నె తెస్తున్నాయి. బాపు గీతలలో కార్టూనిస్టు. శ్రీరమణ మాటలలో కార్టూనిస్టు. ఆఖరుగా నేను చెప్పగలిగింది-

"**సెటైరుకి రెడీ రెడీ – స్వత్రైరుకి ఫెడీ ఫెడీ**
**శ్రీరమణ ప్రతీ పేరడీ చిత్రోక్తుల గారడీ.**"



విజయవాడ,

20-4-1980

-నండూరి రామమోహనరావు

# సుప్రసిద్ధుల వచన పచనం

హాస్య స్ఫోరకమైన అనుకరణ ధ్వని సంబంధం అయితే అది మిమిక్రీ.

ఒక రచయిత పద్య లేదా గద్యశైలిని హాస్యస్ఫోరకంగా అనుకరిస్తే అది పేరడీ. మిమిక్రీ కళాకారుడు ప్రసిద్ధ వ్యక్తుల గళాలను. ఎంపిక చేసుకున్నట్లే - పేరడీ ప్రయోగానికి కూడా ప్రముఖ రచయితల శైలిని మాత్రమే ఒరవడిగా తీసుకోవడం జరుగుతుంది. ఇది ఒక రకం స్తుతి వ్యాపారం కనుక అనుకర్త తన అభిమాన రచయితనే ఎంపిక చేసుకుంటాడు.

వాసిగల ప్రతి రచయితకు స్వీయశైలి తప్పక ఉంటుంది. ఇలా స్వీయశైలి లేని రచయితను అనుకరించడం అసాధ్యం, ఇప్పుడు కొందరి గద్యశైలిని అనుకరించి చూపుతాను. వారి రచనలపట్ల నాకు గల గౌరవభావం వల్లనే ఈపనికి పూనుకున్నాను కనుక, అపార్థం చేసుకోవడం జరగదనే ఆశిస్తున్నాను.

**"వెడుతున్న రైలు - ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో**
**అతడేదో ఆలోచిస్తూ ప్రయాణం చేయడం"**
ఇదీ యిచ్చట ఎన్నుకున్న సన్నివేశం.

**రెండు మూడు పదాలతో వాక్య నిర్మాణం చేయడం, భాషాశైలిలో, ఆలోచనా పైఖరిలో ప్రాచీనతపై మోజు విశ్వనాథవారి రచనలో కన్పిస్తుంది. సందర్భాన్ని వదలి ప్రక్కకు వెళ్లడం వీరికి పరిపాటి. పై సన్నివేశాన్ని విశ్వనాథ వారు ఇలా వ్రాస్తారు.**

"అది ధూమశకటము, అభిముఖముగ బోవుచున్నది. అతడు మొదటి తరగతి పెట్టెలో నాసీనుడయ్యెను. ప్రథమశ్రేణి మంజూషము సువిశాలముగా నున్నది. పదియారు చక్రములు గలవు, గాలిపంకాలమర్పబడినవి. ద్వాఃకవాటముల కద్దములు కూర్చబడినవి. ప్రాచీన కాలమున గూడ నిట్టి బిసలు గలవు, ధూమశకటము లేమి? పుష్పక విమానములే గలవు గదా? అతడు గంభీరముద్ర దాల్చి బాహ్య ప్రకృతిని వీక్షించును. అతడేదియో నాలోచించుచున్నట్లగపడును.





ఆలోచన యనగా నేమి? అది యొక మానసిక వ్యాపారము. అతీంద్రియము, తాత్వికుడు ఆలోచన సేయును. అది

లోకమున కుపకరించును. అయిన ఆలోచన చేయనిదెవరు? మానిసి అయిన ప్రతివాడును ఆ కార్యము సలుపగలడు. కాని తారతమ్యములు గలవు. కొందరివి మంచిపై వుండును కొందరివి కాదు. ఇంతకూ నాతని మనమందేమి గలదు? మనకు తెలియదు, తెలియును... ఇదియొక చమత్కారము.

ఇట్లా సాగిపోతుంది వారి వచన స్రవంతి.

## *సంజీవనీశైలి*

**సంజీవదేవ్ గారు గద్యరచనలో కొత్త పోకడలను ప్రవేశపెట్టారు. తర్కమూ, గంభీరమైన సంస్కృతపదాలను సామాన్యవాక్యాల్లో పొదగడమూ వీరి ప్రత్యేకత.ఇదే సంఘటనను సంజీవ్‌దేవ్ గారయితే!**



"రైలు జడమే అయినా అది కదుల్తుంది. చెట్టు చేతనమే అయినా అది కదలదు. కదలే అచేతనాలు, కదలని సచేతనాలు; కదలే సచేతనాలు, కదలని అచేతనాలు కూడా తారసపడతాయి. నిత్యజీవితంలో కదలిక సజీవమైన ప్రాణస్పందనకు గతిశీల చిహ్నం. రైలు చేస్తున్న శబ్దం లయాత్మకంగా తట్టసాగింది ఫస్ట్‌క్లాస్‌లో కూర్చున్న అతనికి. కిటికీ గుండా బాహ్యజగత్తును అనుశీలన చేయసాగేడు. అభివ్యక్తపరచబడని భావాలేవో అతని మానసాకాశంలో వుండి వున్నాయి.

దూరాన ఛాయారూపంలో అస్పష్టంగా అగపడే పర్వత పంక్తులు ముక్తాకాశం క్రింద రమ్యంగా గోచరిస్తున్నవి. అతను వివాహితుడా? అవివాహితుడా? అని ఆలోచన చేయసాగేను. కొందరు వివాహితులు అవివాహితుల్లాగాను కొందరు అవివాహితులు వివాహితుల్లాగాను వుంటారు. అతను వివాహితుడేననే నిర్ణయానికి వచ్చాను. కాని, నా నిర్ణయం భ్రమయేమోననే సందేహం కూడా కలిగింది."

పాహిమామ్

---

**బుచ్చిబాబుగారి కథా కథనం, శిల్పం పైతరగతి పాఠకుని ఆకట్టుకుంటాయి. వీరి కథా శీర్షికలు కూడా ప్రత్యేక పంథాలో వుంటాయి. ఇదే సంఘటన బుచ్చిబాబు గారి ధోరణిలో-**



"ప్లాట్‌ఫారం మీద రైలు ఆగ్గానే మనసు కుదుటపడింది. రైలు లేటవడం, దానికోసం వెయిట్ చేయడం- నాకు మహా చిరాకు.

పోర్టరు సామాను ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులో పెట్టాడు. వాడికి ఎంతిచ్చానో గుర్తులేదు కాని వాడు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. మళ్ళీ వాడు కన్పించినా పోల్చుకోలేను. షిఫాన్ చీర కుచ్చెళ్ళలో బిగించిన బొమ్మలా వుంది మూల సీట్లో అమ్మాయి. నేను కొంచెం బెరుగ్గా ఎదురు సీట్లో కూర్చున్నా,

ఆమెతో మాట్లాడాలని అన్పించలేదుగాని 'అచ్చం పంకజంలా లేదూ' అనుకున్నా మనసులో.

ఇప్పటి పంకజం కాదు. పుష్కరం క్రిందటి పంకజం. అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు! మల్లెపూలు, మెడచుట్టూ రక్తనాళాల నీలినృత్యం, నడుం క్రింద వొంపు, మనసులో తెల్లచార, ఆ పంకజాన్ని చూడగలనా? ఇప్పుడు పంకజం పిల్లలకోడి... రైలు కూతతో తెగినదారంలా ఆలోచనా చయనిక తెగిపోయింది. మామ్ అన్నట్లు అనుభవంలో కన్నా ఆలోచనలోనే మాధుర్యం యెక్కువ...

*ఉపమారాచకొండస్య*


---

**సామాజిక స్పృహ, అట్టడుగుమనిషి రాచకొండ విశ్వనాథశాస్త్రి గారి కథలకు పెట్టుబడులు, వీరి ప్రతి వాక్యమూ రసాత్మకమైన కావ్యమే! వీరి శైలిని సొంతం చేసుకుని ఔనన్పించుకున్నవారు బీనాదేవిగారు. రా.వి.శాస్త్రి గారి కథాకథనం:**



రైలు పాకుతున్న కొండచిలువలా వుంది. ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటు ఖరీదైన సబ్బు పెట్టె లాగుంది. కూపేలు పెద్దసైజు ఎ.సి.యూనిట్లలాగున్నై. వాటిముందు కారిడార్ చీకటి గుహలా వుంది. ప్రక్కన వాష్‌బేసిన్ విధేయుడైన నిరుద్యోగిలావుంది. బెర్తుమీద కూర్చున్నతను ప్యాంటు తొడుక్కున్న పెద్దపులి లాగున్నాడు. నోట్లో సిగరెట్ బయటకు వచ్చిన కోరలా వుంది. రైలు కూత నల్లధనం దాచిన ఆసామీ నవ్వులా వుంది. వెనక్కు పరుగెత్తే చెట్లూ, పుట్టలూ

అలుక్కుపోయి పికాసో చిత్రంలా కన్పిస్తున్నాయి. రైలు వుయ్యాలలా ఊగుతోంది. అది చేసే చప్పుడు జోలపాటలా వుంది.'




ఇలా వుంటుంది ఆ ధోరణి.

## మైథాలజీ సీత

**పురాణం సీతగారి ప్రత్యేకత ఇంగ్లీషు మాటల్ని తెలుగైజు చేయడం. సాదా విషయమై అసాధారణంగానూ, అనర్గళంగాను చర్చించడమూ.**

'పిల్లికి పులి మేనమామ'ట. అలాగే నా వొపీనియన్‌లో రైలు బస్సుకి మేనమామ. అదే విషయంలో రైల్లో ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లో మా గురూగారితో అన్నాను. గురూగారంటే మా ప్రియతమ హజ్‌బెండ్. అసలీ హబ్బీలు రైలు డబ్బీల్లా రెండు రకాలు. బాడ్ హబ్బీలు, వరస్ట్ హబ్బీలు అని. కమింగ్ టు ది లెక్చర్



రైలుకూతలో వొక తమాషా వుంది. అది ప్రగతిశీల శక్తికి, సామాజిక స్పృహకి,

సాంఘిక దృక్పథానికి సంకేతం. శ్రీవారు ఫస్ట్‌క్లాస్‌లో ఆవకాయ జాడీ తీసికెళ్ళడం మర్యాదకాదన్నారు. విమానాల్లో ఉల్లిపాయలు తీసుకెళ్ళడం లేదా అని ఒక ప్రశ్నార్థకంతో వారి నోరు మూశాను. ఏమంటారు... నేను అవాక్స్ అండ్ చవాక్స్ పేలుతున్నానంటారా? అయితే సరే మీకు... రైలు ప్రయాణపు ముచ్చట్లకు ఎగ్ బై: ఎగ్ అంటే గుడ్డు లెండి.

## *కొడవటిగంటీయం*

**మధ్య తరగతి జీవితాలకు అద్దం పట్టాయి కొడవటిగంటి కుటుంబరావు గారి కథలు. కథ చదివేటప్పుడు ఆ సంఘటన కళ్లముందు జరుగుతున్నట్టుగా ఫీల్ అవుతాం. వారి పోకడ చూడండి.**

'రైలు ఆగడం, సుదరం ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్‌లో కూర్చోవడం- ఏది ముందా అన్నంతగా జరిగి పోయాయి. సుందరం మొదట ప్రెస్ బాయ్‌గా చేరి, కంపోజిటర్రై, ట్రెడిల్ మన్ అయి అలా అలా పైకొచ్చి ప్రెస్ ఓనరైపోయాడు. ఫస్ట్‌క్లాస్‌లో తప్ప ప్రయాణం చెయ్యడు. అయితే



సుందరానికి కొన్ని వింత అలవాట్లున్నాయ్. ఇంత గొప్పవాడైనా తన పాత జీవితాన్ని మర్చిపోకూడదని ఖరీదైన డ్రెస్ మాత్రం వేసుకోడు. సుందరాన్ని చూసి వో సిల్క్ లాల్చీ ఆసామీ "అబ్బాయ్! ఇది పరువుల పెట్టి" అన్నాడు. "తెలుసు"

అన్నాడు గంభీరంగా సుందరం. అప్పర్‌క్లాస్ మెంటాలిటీ అంటే ఇదే. తాము తప్ప ఇంకెవరూ పై తరగతి పెట్టెలో ప్రయాణం చేయకూడదనివారి అభిప్రాయం.

## *వార్తా శైలి*

**పాత్రికేయుని శైలికి, కథారచయిత శైలికి తేడా వుంటుంది. పాత్రికేయుడు భోగట్టా మాత్రమే ఇస్తాడు. క్లుప్తత అతనికి ముఖ్యం. చూడండి. ఇదే సన్నివేశాన్ని పాత్రికేయుడు ఎలా చిత్రిస్తాడో;**

నిర్ణీతవేళకు నిర్దేశించబడిన ప్లాట్‌ఫారంపైకి రైలు రాగానే ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లో తన రిజర్వుడు బెర్త్‌పై కూర్చున్న అతని వయసు 35 సంవత్సరాలు వుండచ్చు. అతను ఆలోచిస్తున్న మాట నిజమే కావచ్చు. కాగా, ఏమిఆలోచిస్తున్నదీ తెలియరాలేదు. పోతే పద్నాలుగు బోగీలు, ఒక ఇంజను గల ఈరైలు బయలుదేరే ముందు కూత వేసింది.

## *చుక్కానిచుక్కలు*

**వాకాటి పాండురంగారావుగారు చెప్పే తీరు సింబాలిక్‌గా వుంటుంది. వీరి కథల్లో అక్షరాల కన్నా చుక్కలే ఎక్కువగా వుంటాయని ఒక విమర్శ-**

పాథాలజిస్టు... మైక్రోస్కోపు... లో... ఎర్రటి కణాలు, ఒకటి... దాని వెనుక... ఇంకటోటి... ఎర్రకణాల్లాంటి రైలు పెట్టెలు, చుక్కలు చుక్కలుగా... సెలైన్... బొట్లు... టప్...టప్...ధన్...ధన్... నేను ఎక్కడికో... ప్రయాణం? స్మారకానికి...




అపస్మారకానికి మధ్యన... యమభటుల్లాంటి ఇంజన్ డ్రైవరు ఫైర్‌మెన్... అశ్వనీ దేవతల్లాంటి నర్సులు, ఇది హాస్పిటలా, రైలా? రోగంతో నేను ప్రయాణం చేస్తున్నాను. ఇంజక్షన్ గుచ్చినట్లు రైలు కూత... మగత... అయోమయంగా... నీలంగా... ఎర్రగా... రక్తకణాలు... ఒకటి... రెండు... అ... యి...దు...'

*ఊహాగాయని*

---

**'లత సాహిత్యం' తెలుగునాట మంచి ప్రాచుర్యాన్ని పొందింది. సొంత శైలిని సంతరించుకున్న కొద్దిమంది రచయిత్రులలో లత గారు ఒకరు.**

'నేనంటే ఎవరికీ గిట్టదు. దూరంగా వెళ్ళి పోవాలనుకున్నాను. రైలాగ్గానే ఫస్ట్‌క్లాస్‌లో ఎక్కి కూర్చున్నాను. ఈ పరిసరాలు దాటి వెళ్ళి పోవాలి. నా జీవన స్రవంతిలో ఇదొక అనుభవతరంగం. ఆకాశవాణిలో ప్రయోక్తగా పని



చేస్తున్నపుడు ముసలయ్య అనోక డ్రైవర్ ఉండేవాడు. అతను చనిపోయాక తెలిసింది వానికో ప్రేమించే మనసుందని. నేను చనిపోయాక. నాసంగతి

తెలుస్తుంది. ట్రైమ్ అయింది కాబోలు. రైలు కూత ఎంత మధురంగా వుంది? వంశీ మోహనుని మురళీ రవంలో ఆ తన్మయత్వంలో ఆ పరవశత్వంలో దూరంగా ఎక్కడికో, అనంత తీరాలకు వెళ్ళిపోవాలి.'

*ఖరీదైన భావాలు*

---

**సగటు పాఠకుణ్ణి ఊహాలోకాల్లో విహరింప చేసే నవలలూ, కథలూ మనకు కోకొల్లలు. హైదరాబాదులో బీచి, వైర్‌లెస్ తీగెల మీద పక్షులు - ఇలాంటివి కూడా వీరు తమ రచనల్లో పఠితలకు చూపగలరు. వీరి నవలా నాయకుడు వచ్చి పల్లెటూళ్ళో వుంటున్నా - ఆ కుగ్రామంలో ఎంత లావు ఎక్స్‌ప్రెస్ రైలైనా ఆగడం మనం చూడవచ్చు. సరే మత్తుమందులా వుండే వారి శైలి చూడండి.**

'రైలు రాజహంసలా వచ్చి ఆగింది. ఫస్ట్‌క్లాస్ కూపేలో తన బెర్త్‌పై కూర్చున్నాడు కిరణ్. "మే ఐ టేక్ దిస్" అన్నాడు ప్రక్కన వున్న ఫెమినా తీసుకుంటూ -"బై ఆల్ మీన్స్" అన్నది ఆమె క్లుప్తంగా, ఆ మాటలు కోటి వీణలు మీటినట్లు విన్పించినై కిరణ్‌కి. తల యెత్తి చూసింది ఆమె. ఆరడుగుల యెత్తు, గ్వాలియర్ సూటూ. ఎంబాసిడర్ బూటూ, చూపరులను ఇట్టే ఆకట్టే ముఖం - ఆమె అనిర్వచనీయమైన అనుభూతికి లోనైంది. కొద్ది క్షణాలు నిశబ్దం రాజ్యం చేసింది. కిరణ్ నుదిటిపై పడిన వుంగరాల జుత్తు రైలు కుదుపుకు అనుగుణంగా కదుల్తోంది. చేతినున్న వొమేగావాచీలో టైం చూసుకుని, నాప్‌కిన్‌తో నుదురు తుడుచుకున్నాడు, రైలుకూతకు ఆమె వులిక్కిపడింది. అతను కొంటెగా చూసి చిన్నగా నవ్వాడు...

# మరో సందర్భంలో మహానుభావుల పదవల్లరి

కలం పట్టిన ప్రతివాడూ కవి కాదు. భావనలో, ఉక్తిలో తమదంటూ ఒక ప్రత్యేక శైలిని సంతరించుకున్నవారు మాత్రమే పఠితల జ్ఞాపకాలలో పది కాలాలపాటు జీవించగలరు. అలాంటి ప్రతిభామూర్తుల పదవల్లరికి అనువల్లరిని సమకూర్చే ఈ కార్యక్రమానికి ముందుగా అందరికీ వందనాలు!

**"ఒక భవనం - జరిగే కథ మొత్తానికి ఆ భవనం వేదిక –**

**కనుక దానికి కథలో ప్రాముఖ్యత వుంది"-**

ఇదీ ఈ పేరడీకి యెన్నుకున్న అంశం.


*అడవిగోల*

**అడవి బాపిరాజు గారు సాహిత్యంలో, చిత్రకళలో సిద్ధహస్తులు. వీరి సాంఘిక నవలలు ఆరోజులలో యింటింటి గ్రంథాలైనాయి. వీరి నవలలలో కథాబలం కంటె విజ్ఞానబోధ అధికంగా వుంటుంది సంఖ్యా వివరాలు, తేదీలు, ఇంటిపేర్లు వీరి రచనలలో కనిపిస్తాయి కనుక అవి ఒక వ్యక్తి జీవితకథ లాగా అతి సహజంగా స్ఫురిస్తాయి. సమస్త విషయాలపైన సాధికారంగా చర్చించగల ప్రతిభామూర్తి. పై సందర్భంలో బాపిరాజు గారైతే యిలా వ్రాస్తారు;**



రాజమహేంద్రవరములో శ్రీ సర్వోత్తమరావుగారు తమ నివాస భవనమును కట్టించిరి. అది పవిత్ర గౌతమీ నదిని అందిపుచ్చుకున్నట్లుండును. వేయి గజముల నివేశన స్థలములో భవన నిర్మాణము జరిగినది.

తొమ్మిది గజముల మువ్వీసము నిడివియు. వులి లోపల మూడు గజముల ఆరంగుళముల వెడల్పునూ ఆయము కలిగిన డబుల్ హాల్సు గలవు. వంటశాల, భోజనముల గది ప్రత్యేకముగానున్నవి. వారి మారిసు మైనరు కారు నిల్చుటకు వీలుగా పోర్టికో



నేర్పాటు చేసిరి. గోడలకు ఏడడుగుల బునాదియు, మూడు జానల మందమునూ వుంచినారు. సింహద్వారము నల్లమాను కొయ్యతో చెక్కిరి. మిగిలిన వురువు లన్నియు బ్రశస్తమైన రంగూను టేకుతో తయారుచేసినారు. గోడ బీర్వా లారింటికి బిళ్లోరి అద్దములను బిగింపించిరి.

యింటికి యీశాన్యమున నలుబది గజముల ఖాళీస్తలమును వదలిరి. ఈశాన్యము దైవస్థానమని వాస్తు చెప్పుచున్నది. ధవళేశ్వర వాసియు, వాస్తు శిల్పమున దిట్టయునైన శ్రీ రావిపూడి నరసింహ సిద్ధాంతిగారి పర్యవేక్షణమున గృహనిర్మాణం జరిగినది. ఆనందనామ సంవత్సర చైత్ర బహుళ పంచమిన శ్రీ

సర్వోత్తమరావు గారు నూతన గృహప్రవేశ మహోత్సవం గావించుచు శ్రీ నరసింహ సిద్ధాంతిగారిని జత పెద్దాపురం జరీ ధోవతులుతోనూ నూటపదార్లు రొఖ్ఖంతోను సత్కరించిరి.

*చలం కలం*



**ఒక మహాకవికి యోగ్యతా పత్రం ఇవ్వగలిగిన చలం ఫ్రాయిడ్‌ని తల్లక్రిందుగా అధ్యయనం చేసి యముడికీ, సావిత్రికీ సంబంధ సంపర్కాలు అంటగట్టి తెలివిని వృధా చేసుకున్న చలం, భావ ప్రచారం కోసం తన రచనలకు లేనిపోని అలంకారాలు మాత్రం తగిలించలేదు. చెప్పాలనుకున్నది నగ్నంగా చెప్పేసే చలం శైలిలో ఒక 'తూగు' అప్రయత్నంగానే వచ్చిపడింది. చలంగారి కలం.**


'సిటీకి చాలా దూరంగా క్రిస్టాఫర్ బంగళా వుంది. నిజానిజాలు తెలియవు కాని తాను ఒంటరిగా వుంటున్నాననే వాదిస్తాడు. బైబిలు, భగవద్గీత చదువుతాడు.

"అంత పెద్ద హవేలీలో ఒంటరిగా ఎలా వుంటున్నావు భాయ్?" అని అడిగితే -"ఒంటరితనం శరీరానికేగాని మనసుకేమి వుంటుంది? అదెప్పుడూ భావాలతో సందడి గానే వుంటుందిగా" అంటాడు క్రిస్టాఫర్.

అయినా నాకు క్రిస్టాఫర్ మీద యెందుకో అనుమానం. అతను బ్రహ్మచర్యం పాటిస్తున్నాడా? లేదా? అనేది కాదు నా సందేహం. నిజం చెప్తున్నాడా? లేదా? అనేది నాకు కావాలి.

అయినా సృష్టి సహజమైన విషయాలను వీళ్ళంతా యెందుకింత సీరియస్‌గా తీసుకుంటారో, దాన్ని కప్పిపుంచుకోవాలని నానా అవస్థలు యెందుకు పడ్తారో నాకు అర్థంకాని విషయాలు.

ఒక ఆదివారం సాయంత్రం క్లబ్ నుంచి సడన్‌గా క్రిస్టాఫర్ ఇంటికి వెళ్ళాను. పరచుకున్న నల్లని మైదానం, సమాంతరంగా పైన నీలాకాశం, రెంటినీ కలుపుతున్న రేఖల్లాగా పచ్చని దేవదారు చెట్లు - చెట్ల మధ్య వొదిగిపోయిన బంగళా - నిజంగా ఒక వరం అది. నాలో యీర్ష్య రగిలేంతలో క్రిస్టాఫర్ మెట్లమీద నుంచి ఆప్యాయంగా ఆహ్వానించాడు. అతన్ని అనుసరించి లోనికి వెళ్ళాను.



అప్పటికే మసక చీకటి ఆవరించింది. బయట చెట్లమీద పిట్టల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దం.

క్యాండిల్స్ వెలిగించి స్టాండ్స్ నింపుతున్నాడు క్రిస్టాఫర్

"కరెంటు దీపాలు వున్నాయిగా - ఇవి దేనికి?" అన్నాడు.

"నాకు క్యాండిల్స్ ఇచ్చే వెలుతురంటే చాలా ఇష్టం. ఆ కాంతిలోని మైల్డ్‌నెస్‌ని నేను ఆరాధిస్తాను." అన్నాడు క్రిస్టాఫర్ గోడమీద మా యిద్దరి నీడల్నీ చూస్తూ.

**జోకులాష్టమినాడు పుట్టాట్ట ముళ్లపూరి వెంకటరమణ గారు. నవ్వుల పువ్వుల వెనుక మనసుని కుదిపే మాంసపు ముడులున్నాయి గనుకనే 'ముళ్ళపూడి' హాస్య రచనలలో మొగలి పొత్తుల స్పర్శ వుంటుంది. వేలాది సొంతమాటల్ని జాతీయం చేసిన అభ్యుదయవాది కొత్తటానిక్కు వంటబట్టక 'సాక్షి' గల్లా తన్నేసినా - స్క్రిప్టు వదలని విక్రమార్కుడిలా నిలిచి, నేడు -ముగ్గులో ముత్యాలేరుతూ ఎంచక్కా వడ్డీతో సహా జమ వేసుకుంటున్నారు.**




'పౌరాణిక పిక్చర్లా ఎంతకీ తరగని అప్పాపురం హైవే దాటి అసుంటా వెళ్ళంగానే - తెలుగు సిన్మాలో క్యారెక్టరాక్టర్లా అప్పులు తీర్చేయాలనుకున్న ఆసామీలా, దేశవాళీ టెలివిజన్ సెట్‌లా, కళ్ళద్దాల '...క్షీ' (కామా-క్షి)లా గంభీరంగా వున్న వో మేడ కంటికి తగిలింది.

దీని తాలూకు ఆసామీ ఎవరై వుంటారు చెప్మా? 'అన్చేప్పన్చెప్పన్చేసి... తటపటాయిస్తుండగా శ్రీమాన్ అప్పాల్నాయుడు గారు క్లోజప్‌లో తారసపడి మనదే అన్నారు సిసలైన మదీయవాదిలా.

మనదే అనేమాట నా చెవులలో గిరికీలుకొట్టగా వీరిది చాటంత హృదయం స్మీ అని మనంబున తలబోసి చాలా యిదిగా కట్టించారు అనేశాను కుంచెం చొరవ తీసుకుని.

'దానికి శానా కతా కమామీషూ వుందోయ్ చెప్పాలంటే' కత్తిలాంటి చుట్టపొగతో డైలాగ్‌ని కట్‌చేసి -మళ్ళీ అందుకున్నారు.

'కాంతారావ్ ష్టంటుబొమ్మలంటే జనం గోడలు దూకొచ్చేసే రోజులవి. వారానికి నాలుగు డబ్బీలాడేవాళ్లం. రెండాట్లకీ రెండేలు మిగిలేవి అలకంగా. ఎన్నెల రోజుల్లో ఆటే లేదనుకో అప్పట్లో మనకో టూరింగాలుండేదిలే.'



లంక పువాకు చుట్టుకొస కొరికి కిర్రున ఖాండ్రించి డిష్యుం అని వుమ్మేసి- ''అవో పిచ్చిరోజులు. తరాత్తరాత అదంతా కత్తెర మీద సామైపోయింది. టూరింగాలుని గొడ్లసావిడికింద ఫిరాయించేసి, మనం కాన్టాక్టుల్లో పడిపోయాం. ఇందుట్లో నాలుగురాళ్ళు మిగిల్తే అవీ ఇవీ యెట్టి ఈ అప్పుస్టెయిరు లాగించేశాం. ఏకటాకీన వువాచించిన అప్పల్నాయుడుగారు అలవాటుకొద్దీ ఎడమచేతి బొటనవేలు తలకి రాసుకుంటూ వుండిపోయారు.

"మీ అనుభవం... బహుదొడ్డదిస్మండి! బంగళా చూస్తుంటేనే తెలిసొస్తోంది!" వో ముక్క స్తుతిగా అన్నాను. అందుకాయన మొట్టికాయ తిన్నవాడిలా మొహం పెట్టి శేరు యిసక్కి సిటికెడు సిమెంటేసేవోడివి నువ్వొద్దని మన లేడీసు అంటే - వాళ్ళక్కాయ్ మాటమీద నిలబడి చిట్టెంలా కట్టించేసేశాడు మనబామ్మరది" అనేసి టెన్సింగ్ నార్కేలా పోజెట్టారు ఆ నాయుడుగారు.

గబుక్కున వెయ్యి హార్మనీ పెట్టెలు ఒఖ్ఖపెట్టున వాగించినట్లు - 'పొద్దుట్నుంచి ఎక్కడ తగలడ్డా...?' -లేడీషాట్‌లో లాంగ్ వాయిస్‌తో వులిక్కి ప....డ్డా....ను..

మన ఆబిడ...పని కుర్రాడ్ని... హి ...హ్హి... నాకు ధైర్యం చెప్పాలని శ్రీవారి ప్రయత్నం. తర్వాత నేను నాయుడుగారిగ్గాని, నాయుడు గారు నాగ్గాని కనిపిస్తే ఆ మేడమీద వొట్టు.

## *మధ్య మార్క్సిజం*

**ఒకనాడు చక్కని ఇతివృత్తాల రచయిత్రి రంగనాయకమ్మగారు. 'సజీవతకు మార్పు చిహ్నం' అనే ఆర్యోక్తిని అక్షరాలా నిజం చేశారు. 'వైరి మార్గంలో అయితే త్వరగా ముక్తి లభిస్తుందని వీరు విషవృక్షం వ్రాసిరని ' కల్పవృక్ష కవి వ్యాఖ్య. పాపం పుణ్యం ఆ శ్రీరామచంద్రుడికి తెలియాలి. ఇదుగో యిప్పటి వారి శైలి మాత్రం యిలా వుండవచ్చు.**

"కాలం యెంత విచిత్రంగానైన మారిపోతుందనేది అనుభవంలో గాని తేలని విషయం. కాలంతోబాటు మనుష్యులంతా మారక పోయినా మనుష్యులతోబాటు విలువలు మారడం ఖాయం. మనిషి మడికట్టుకు కూర్చొంటే - వేసిన చోటే వుంటుంది గొంగళి. ఈ సత్యాన్ని గ్రహించి మడివదలి, ఆత్మ(వుంటే) చంపేసుకుని ప్రవర్తిస్తే గుడిసెల్లో వాళ్ళంతా బంగాళాలోకి రావడం ఏమంత కష్టంకాదు.



స్టేషన్‌లో దిగి "చలపతిరావుగారి బంగళాకి" అని చెబితేచాలు ఏ రిక్షావాడయినా బేరం చేయకుండానే తెచ్చేస్తాడు సరాసరి. బేరం చేయక పోవడం చలపతిరావు మీద అభిమానం చేతకాదు - భయం వలన మాత్రమే. చలపతిరావుగారు మడి కట్టుకు కూర్చుంటే పూర్వం లాగా 'చలపాయ్' గానే వుండేవాడు.

ఇవ్వాళ చలపతిరావుకి పలుకుబడి, హోదా, అంతస్థూ అన్నీ వున్నాయి. నల్లడబ్బుతో కట్టిన ఆ బంగ్లాకు వాడిన సిమెంటు బ్లాకులో కొన్నారు. ఎటొచ్చీ రాళ్ళు మోసిన కూలీలకు మాత్రం పూటా రూపాయి వంతున తెలుపులో ఇచ్చారు.

ఇదంతా చూస్తుంటే మనం సోషలిస్టు వ్యవస్థ పూర్వపాదశలోనైనా వున్నామా? పెట్టుబడిదారీ వ్యవస్థ వటవృక్షపుచిగుళ్ళనైనా తెంపగలిగామా? ఈ బంగళాలు, దర్పాలు, గొప్పవాళ్ళ పిల్లల ఖర్చులు యివన్నీ ఏ వ్యవస్థకు ప్రతీకలు...

## *అయస్కాంతం కథలు*

---

**మునిమాణిక్యం నరసింహారావు గారు 'కాంతం కథల్ని" రచించి వుండకపోతే తెలుసు సాహిత్యంలో వారు కవిగా గుర్తింపబడే ఆస్కారమే లేదు. పెళ్ళికాగానే ఖుషీ నశిస్తుందనే అపప్రధని తొలగిస్తూ, మధ్యతరగతి సంసారాల్లోని సరసాలను, ప్రణయకలహాలను, సున్నితమైన హాస్యధోరణిలో చిత్రించారు. తెలుగుదనం వుట్టిపడే కాంతం కథా విధానం-**



"బందరు గొడుగుపేటలో వొక యిల్లు అద్దెకు వున్నదంటే సతీసమేతంగా వెళ్ళాను, కొంచెం పాతదన్నమాటేగాని యిల్లు చాలా నచ్చింది."

వంటయింటి ప్రక్కనే గిలకబావి, తులశికోట, తలుపు వున్న స్నానాలగది కాంతానికి యిల్లు నచ్చడానికి ముఖ్యకారణాలు. ఆమెగారిని అమితంగా ఆకర్షించిన వాటిలో 'రుబ్బురోలు' కూడా వొకటి. 'ఏమండీ! కుదిమట్టసంగా, కుంకుమబరిణెలా వుంది కదండీ' అంటూ దానిని చంటివాడిని నిమిరినట్లు నిమురుతూ యెంతగానో మురిసిపోయింది కాంతం. ఆ డాబా



యింటికి వొంపులు తిరిగిన మేడ మెట్లుండడం వల్ల నన్ను ఆ యిల్లు యెంతగానో ఆకట్టుకున్నది. నాలో అనాదిగా నిద్రాణమైవున్న కోరికలు జాగృతాలై గిలిగింతలు పెట్టసాగినవి. సౌధోపరి భాగాన, పున్నమి వెన్నెలలో తరుణి సరసన జేరి యెన్ని వూసులైనా ఆడవచ్చు. మోవిని మోవిజేర్చి... సుధాస్రవంతిలో తేలియాడవచ్చు. మునుపటి కొంపలో వలె వేయి కనుల తడికలు ఇచట లేనందుకు సంతసించాను.

కాంతం తలకు నీళ్లోసుకు కురులారవోసుకుంటూ మేడమెట్ల మీద నిలబడినట్లు, జడ పాయల జంట జారిన తుషార తుంపరలు నాపై వర్షిస్తున్నట్లు... ఎన్నెన్నో మధురోహలు కలిగినవి.

"మేడ చూశావుటోయ్ యెంతబాగుందో?" కాంతాన్ని వుల్లాసంగా పృచ్ఛించాను.

"మేడకేమండీ! నిక్షేపంలా వుంది. అడ్డెడు పప్పురుబ్బిన వడియాలైనా అర్థగంటలో కాగితాల్లా యెండుతాయి. పైగా మేడ కనుక కుక్కలు, కోళ్ళు వస్తాయనే బెంగ కూడా వుండదు." అనిన కాంతం మాటలకు, నా మధురోహలు

దూది పింజల వలె యెగిరి పోగా... "గృహిణులకు రస హృదయ మించుక-లోపము" అని వాపోయాను.

## గుర్రపుబగ్గీ




**గొల్లపూడి మారుతీరావుగారి కథ చదువుతుంటే మాంఛి వొడుపుగల గుర్రబ్బగ్గీలో ప్రయాణం చేస్తున్నట్లుంటుంది. ఉపమానాలు, అంగాంగ వర్ణనలు అట్టే వుండవు కనుక పఠితకు కథ మీద మనసు నిలిపే అవకాశం ఎక్కువగా వుంటుంది. పాత్ర చిత్రణలో నైపుణ్యం గల కొద్దిమందిలో మారుతీరావు వొకరు (మీరు చివరంటా చదివి గుర్రబ్బగ్గీలో వెళ్తున్నట్లు లేదని ఫిర్యాదు చేస్తే దానికి బాధ్యుణ్ని నేనే గాని గొల్లపూడి మాత్రం కాదు).**

"రింగురోడ్డులో ఆ మేడ లేకపోతే నిజానికి ఈ కథే లేదు. పదేళ్ళ క్రితం సీతాపతికి ఆ మేడ సంక్రమించి వుండకపోతే ఇవ్వాళ ఆయన వార్డు కౌన్సిలర్గా వుండేవాడు కాదు. సీతాపతి కౌన్సిలర్ కాకపోతే ఆ పేటకు మంచినీళ్ళ కుళాయిలు వచ్చేవి కావనీ, అపర భగీరథుడనీ ఒక సన్మానసభలో పలువురు అభిభాషించారు.

"ప్రజాధనంతో చేయించాడు" అనే లోకుల మాటల్లోని నిజానిజాలు మనకు తెలియవుగాని పదవిలోకి వచ్చాకనే ఆ మేడ రూపురేఖలు మారిపోవడం జరిగింది. మొజాయిక్ ఫ్లోరింగూ ఫౌంటెన్లూ సీతాపతి కళాహృదయానికి ప్రతీకలని వాళ్ళింటికి వచ్చే ఒకరిద్దరు కాంట్రాక్టర్ల అభిప్రాయం, చుట్టూ పెరిగిన కొబ్బరి

మొక్కలు పెన్నెల్లో ఆ మేడకు మేలిముసుగులు అవడం మాత్రం నిజమే, దాన్నిప్పుడు మనం బంగళా అని పిలవడమే మర్యాదగా వుంటుంది.

సీతాపతి స్థితిగతుల్ని బట్టి చూస్తే ప్రైవాటా అద్దెకు ఇవ్వాల్సిన అగత్యం లేదు. ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగారు కావాలని ముచ్చటపడితే కాదనలేక ఔనన్నాడు సీతాపతి. ఆఫీసరుగారి రెండో అమ్మాయి రుక్మిణి ముక్కు కాస్త పొడుగన్న మాటేగాని చూపరి. బాల్కనీలో నిలబడితే కొబ్బరి మువ్వులో కలసిపోగలదు.




*నవీనత*

**నవీన్ గారి నవలల్ని 'కొని' చదివిన కొందరు గుడ్లనీళ్ళు గుడ్డ నొత్తుకొనడం నేనెరుగుదును. అధివాస్తవికతా శిల్పం అలవాటు పడేదాకా అంపశయ్యలే అవుతాయి వీరి రచనలు, ప్రయోగాత్మక ప్రయోజనాత్మక నవలలు వ్రాశారని నవీన్ గురించి పెద్దల అభిప్రాయం.**

నల్ల రిబ్బన్ ముక్కలాంటి తార్రోడ్డుమీద నడుస్తున్నాడు జీవన్. టక్... టక్... బూట్ల శబ్దం. చఫ్... ఛప్...చఫ్... తన అరికాలు చప్పుడు, తనకు జోళ్ళు లేవు నడుస్తున్నాడు. కాదు తూల్తున్నాడు కాదు తూల్తూ నడుస్తున్నాడు.

రోడ్డు ప్రక్కన ప్రథమ రజస్వలానంతరం భయపడ్డ పిల్లలా మేడ, బజ్‌జ్‌జ్‌జ్ గేటవతల బజ్జర్ చేస్తున్న మోత భౌ...భౌ...భౌ... ఆగి ఆగి స్పానియల్ అరుపు బాల్కనీలోంచి,



మేడ మీద ఎర్రటి లైటు.... రెడ్...రెడ్... హు క్రియేటెడ్ దిస్ బ్లడీ రెడ్? ఎరుపు... ఎరుపు పుచ్చె పగిలితే ఎర్రటి రక్తం. ఆకలిమంట రెడిష్ బ్లూ. వీధి దీపం కాంతిలో - నేడే చూడండి- ఎబార్షన్ లీగలైజ్డ్- దడిగాడు వానసిరా - లూప్ ఈజ్ ది ఓన్లీ హోప్ - కాంపౌండ్ వాల్ మీద నినాదాలు, టంగ్... టంగ్.... గోడ గడియారం ఇంకో గంట చచ్చినందుకు ఎక్కిళ్ళుపెట్టి ఏడుస్తోంది. ఆకలి... ఆకలి... పల్స్ జారిపోతోందా? నో నో ఇటీజ్ గోయింగ్ అప్ క్లిక్... ఫ్లాష్... మేడమీద అద్దాల గదిలో నగ్నంగా ఫోటో దిగుతోంది ఇరవై ఏళ్ళ తొలుబొమ్మ. కల్చర్... కలరా... కల్చర్ ఆల్‌రెడీ డెడ్ - సోల్ రిమెయిన్డ్ యిన్ మై పూర్ కన్ట్రీ. చఫ్... చఫ్... చఫ్...

## *శవసాహిత్యం*

---

**డిటెక్టివ్ సాహిత్యాన్ని కొందరు శవసాహిత్యం అని పిలుస్తారు. ఈ రంగంలో కృషి చేస్తున్న వారు అనేకులు. ఆ పరిధిలోనే నడుస్తున్న పత్రికలు అనేకం. అపరాధాలు - పరిశోధనలు వీళ్ళ బ్రెయిన్‌డెస్‌లో హమేషా జరుగుతూ ఉంటాయి.**

**టెంపో, సస్పెన్స్ ఈ సాహిత్యానికి అలంకారాలు, మరుక్షణంలో ఏం జరిగేది చచ్చినా చదువరికి తెలియదు, భాష, కథాకథనం అందరిదీ దాదాపు వొకలాగే వుంటుంది - శవసాహిత్యశైలి:**

"ఆలివ్ గ్రీన్ కాడిలాక్ బులెట్‌లా దూసుకువచ్చి 'కీచ్' మని శబ్దం చేస్తూ గేటు ముందు ఆగింది. డాష్‌బోర్డు లోంచి పెన్‌గన్ తీసుకుని గేటు దగ్గరకు నడిచాడు డిటెక్టివ్ సుధీర్. అసిస్టెంట్ వర్మ పాకెట్ కెమేరాలో మైక్రో ఫిలిమ్ లోడ్ చేసుకుని సుధీర్‌ని ఫాలో అయాడు.

"చాలా కాలంగా మనుష్యసంచారం లేనట్లుంది కదూ?" అన్నాడు బంగళాని కలియచూస్తూ సుధీర్. 'అవును బాస్! నాకూ అలాగే అనిపిస్తోంది." అన్నాడు వర్మ. వర్మ మాట పూర్తికాకుండానే బంగళాలోంచి మనిషి మూలుగు అస్పష్టంగా విన్పించసాగింది.

అంతా చీకటి, కన్ను పొడుచుకున్నా కన్పించనంత చీకటి, దూరాన్నుంచి నక్కల అరుపులు. టక్... టక్... నాలుగు అడుగులు ముందుకు వేసి ఆగిపోయాడు సుధీర్. మనిషి మూలుగు ఆగిపోయింది సడెన్‌గా.



పెన్‌టార్చితో బంగళా మెయిన్ రోడ్ వైపుకు నడిచారు ఇద్దరూ. 'మిస్టర్ వర్మా, బంగళా వెనుక పెద్ద వేపచెట్టు ఉంది గమనించావా?"



‘అవును సార్! దానికో పెద్ద తొర్ర కూడా వుంది’

'ఎస్.' తల పంకించాడు సుధీర్- 'మిస్టరీ అంతా అందులోనే వుందని నా గట్టి నమ్మకం' అరబ్ సెవెన్ సిగరెట్ వెలిగించాడు డిటెక్టివ్ సుధీర్.'

(ఆ మూలుగు ఎవరిది? క్లూ దొరికిందా? హంతకుల జాడ తెలిసిందా? జవాబు కావాలంటే ఈ నవల ద్వితీయ భాగం చదవండి).

## నవకవనంలో నానారకాలు

స్వీయశైలిగల ప్రముఖ కవుల కవితలననుకరించే ఈ కార్యక్రమంలో నా అభిమాన కవులనే ఎంపిక చేసుకున్నాను. వారి కవితా వైభవాలకు ఇది నేనిచ్చే నివాళి. ఒక వస్తువుని చూపినపుడు ఒక్కో కవి ఒక్కొక్క విధంగా అనుభూతి చెంది, ఒక్కొక్క కోణం నుంచి పరిశీలించి తమ శైలిని అనుసరించి కవితను రచిస్తాడు.

నెమలికి జాతీయ విహంగంగా నిర్ణయించిన సందర్భాన కవి సమ్మేళనం జరిగితే వారి వారి కవితలు ఎలా ఉంటాయి అనే ఊహకు రూపకల్పనే ఈ పేరడీ.

## కృష్ణశాస్త్రీయం

గంధర్వ లోకంలో కవితా విపంచిపై వియోగగీతాలు ఆలపించే కవి దేవులపల్లి



వేంకటకృష్ణశాస్త్రిగారు. అయిదు దశాబ్దాల క్రితం భావ కవికి నిర్వచనంగా నిలిచారు. ఆంగ్లేయుల కాల్పనికవాదం, తెలుగువారి మెళుకువలు, లలిత లలితమైన పదజాలము శాస్త్రి గారి స్వార్జితాలు. వారి గీతిక ఇలా విన్పిస్తుంది.

"శిశిర శిశిర బందు
మధుర వేదన రగిలి
సోలియున్నది మనసు
చూపకే నీ వింత సొగసు
ఏలనే నీ కంత అలుసు?



కరిమబ్బు మేనితో
            స్వామి వచ్చే వేళ
చివురాకు జొంపాల
        పురివిప్పి యాడేవు
భ్రమసి పోతివో యేమొ
        అలసి పోదువొ యేమొ?
బృందావనమ్మెల్ల
        నీ మాటె, నీ ఆటె
ఏనాటిపుణ్యమో
        ఏనోము ఫలమొ?

*కవికుల తిలకుడు*

---

**దేవరకొండ బాలగంగాధర తిలక్ గారిది అనుభూతి వాదంలో నిండిన రమణీయశైలి. నిడిపైన సమాసాలు, అభివ్యక్తిలో గ్రాంధిక ఛాయలూ, సంస్కృతాంగ్ల శబ్దాల వాడుక - ప్రాచీన కావ్య కవితాశిల్పానికి దగ్గరగా వుండే రీతి. తిలక్ పలుకు:**


"నీ రెక్కల సవ్వడికి సప్తతంత్రుల విపంచి
తూరుపు ఆకాశం నుండి మహాభి
నిష్క్రమణం చేసినపుడు,
నీ కనురెప్పల నీలి నీడల్లో
ఒక అజంతా వెలవెల బోయినపుడు
నీ మేని - దిగంత పరివ్యాప్త అరూప
సుప్తసౌందర్యాంబుధి
తరంగంతో ఆప్లావితమైనపుడు
నీ నడల గని నాక లోక నర్తకి
అందియలు
మూగవోయినపుడు.
నేను కాంక్షించాను - నువ్వు జాతీయ
విహంగం కావాలని
జాతి అంతా పునర్ జాగృతం కావాలని-



శ్రీరంగ కవితలు

**ఆవేదనకి, ఆవేశానికి శ్రీకారం శ్రీశ్రీ. మాటల పొదుపు, ఉక్తిలో నవ్యత, బిగింపుగల భాష ఈయనకు మహాకవి యోగ్యత పట్టడానికి గల అర్హతలు. "అనితర సాధ్యం నా మార్గం" అని చెప్పుకున్న శ్రీరంగం శ్రీనివాసరావ్ గారి వెంట నాలుగు అడుగులు...**

"నట్టడవి లోంచి
నయాదిల్లీకి
మహాప్రస్థానం
మర్చిపోకు నేస్తం
నీ వాణ్ణి నేను
జాతీయ జంతువుని
మనిషిని



అక్బర్ నామా
పీకాక్ త్రోన్
బ్రిటీష్ రాణి
గతం గతః
పక్షులు
అక్షులు
కుక్కలు
రుక్కులు
అన్నీ వొకటే రష్యాలో
ఇక్కడ మాత్రం వొకటొకటే!



**స్వాతంత్ర్యానంతర తెలుగు కవితా రంగంలో - అధునాతన భావాలు గల సనాతనుడు కుందుర్తి. నిశితమైన పరిశీలన, విశృంఖలమైన భాష వీరి సొత్తు. ఆధునికుల్లో చాలా మందికి వీరి కవిత ఒరవడి అయింది. కుందుర్తి కృతి:**

అంబరాన పోయే బోయింగ్ విమానాన్ని చూసి
మేఘమనే భ్రాంతిలో పురివిప్పింది నెమలి.
యూనిఫారాలతో వెళ్ళే కాన్వెంట్ పిల్లల్ని చూసి
సజాతి జాలం అనుకుని చూపు సారించింది.
ఆకాశవాణి నిలయం ముందు పారేసిన శ్రోతల అభిప్రాయాల
లేఖల్ని విరిపాన్పుగా భ్రమసి ఒకసారి ఒళ్ళు విరుచుకుంది.
శిథిల సౌధాలను, కూలిన ఖిల్లాలను ఆత్రంగా చూసే
గత వైభవ జాడ లేదు. స్మృతులన్నీ విషాద శ్రుతులే
హైకో ప్రాబ్రిక్స్ ముందు అరనిముషం ఆగింది.
లేపాక్షి ఎంపోరియం దగ్గర అదీ లేదు,
కళాభవన్ దగ్గర కాసేపు కూర్చుంది నిట్టూరుస్తూ



**నవకవనానికి నాడి**

**కైతల రాణికి సాంబ్రాణి**

**నారాయణరెడ్డి బాణి**

**పాపం ! ఒక్కొక్కసారి**

**ప్రాసక్రీడలో భావం బలి.**

అయన గారి కవిత ఇలా వుంటుంది-



"జాతీయ విహంగం

సౌందర్య తరంగం

కాళిదాస కావ్య మరందం

పురివిప్పిన విపిన మయూరం

వనమాలి మౌళిపై

ఎలమావి కొమ్మపై

నర్తించే మయూరి

నందనవని వొయారి

.... .... ....

.... .... ....

జనతా మబ్బుల మాటున

సత్యమనే పురివిప్పి

నువ్ చేసే నృత్యం

కోరలున్న విషనాగుల

కోరాడే కోలాటం"

## మోహనప్రసాదం

**ఆధునికుల్లో ఆధునికుడు వేగుంట మోహన్‌ప్రసాద్ గారు. అనుభూతి వాదానికి పరాకాష్ఠ వీరి వచన కవిత. ఒంటరిగా స్వీయశైలీ విన్యాసం చేస్తున్న ఏకాకి కవి. వేగుంట అయితే ఇలా:**



వొలికిన విస్కీ సీసాలోంచి
రెండు పెగ్గుల వూదారంగు పరిమళం-
మొహమల్ రగ్గు కప్పుకుని
పల్లకీలో వెళ్తోంది మాంసపు ముద్ద.
కీట్స్ కలం బొదిలైర్ బ్రెయిను.
దాలీ కుంచె
పారిస్ ఆర్టిస్టు పాలెట్ నైఫూ
అర్ధరాత్రి తినేసింది నెమలి.
టెలివిజన్ తెర ఆత్మహత్య చేసుకున్నపుడు
మెరీనా అంచున మెరిసే ఇసుకలో
తన కళ్ళను వెదుక్కుంటోంది నెమలి.

## దాశరథీయం



**సంస్కృతాంధ్ర కావ్యాల్ని, గాలిబ్, మీర్, జఫర్, ఇక్బాల్ లాంటి ఉరుదూ కవులను కలగూరగంపగా జీర్ణం చేసుకొని, చివరకు "బహుచ్ఛత్రధారి" అయి,**

**అభ్యుదయ కవితా రంగంలో మహారధి అయినాడు దాశరధి- ఈ 'ముషాయిరా'లో దాశరధి గారి గజల్ ఇలావిన్పిస్తుంది:**

నీవు పురివిప్పి నపుడీ మామూలు నేల
సంకీర్ణ చిత్రమై తోచునేల?
నీ చక్కని చిక్కని రూపం
ఇలకు దిగివచ్చిన ఇంద్రచాపం
స్వామి శిఖిపింఛ మకుటంబకట!
రాధ సిగలోన పూవుగా అందగించె.
సొగసు కా మేను యిరుకైన చొప్పుతోచు
నెమలి నేత్రాలనుండి జాల్వారుచుండె.

## *శేషేంద్రజాలం*

---

**సింబాలిజాన్ని సంస్కృత పదాలతో రంగరిస్తే శేషేంద్రశర్మ గారి కవితా శైలి ఆవిర్భవిస్తుంది. "పద్యమా లేక ఫ్రెంచి మద్యమా" అన్నాడు రెంటి రుచీ తెలిసిన శ్రీశ్రీ వీరి కావ్య శిల్పాన్ని ప్రశంసిస్తూ - శేషేంద్రవాణి:**

ఏ కవితాత్మ రాల్చిన అక్షరానివి?
ద్రాక్షారస అనులేపంతో
విశ్వసౌందర్యాన్ని నీ మేనికి నలుగు
పెట్టిందెవరు?
హృదయాన్ని చీల్చే తూణీరాలను

కప్పుకొని

కోటి ఇంద్రధనుస్సులను జీర్ణం

చేసుకున్నావ్.


నా కనుల వేదికపై నిర్దయగా

నువ్ నృత్యం చేసినప్పుడు

యూకలిప్టస్ ఛాయల్లో

మంచు దారాలతో అల్లిన సెల్లా

కొంగు సాచి



పిడికెడు సౌందర్యపు భిక్షకోసం

స్రవించే క్షణాలను ఆపలేక

నిస్సహాయంగా నిల్చున్న రక్తరేఖని...

## ఆరోరుద్రుడు

**ఆరుద్ర గారిని ఆరుద్రుడని కొందరంటే కాదు ఆరో రుద్రుడని చాలా మంది అన్నారు. వ్యంగ్యం. చక్కని ధ్వని వీరి కవితలకు అలంకారాలు. పేరడీలు, లిమరిక్కులు వీరి కవితల్లో ఎక్కువగా కన్పించే ఋక్కులు. అక్షరశిల్పి ఆరుద్ర కవిత:**



ఒళ్ళంతా కళ్లైనప్పుడు

ఇంద్ర పదవి దక్కదా మరి?

దేముడికే శిరోధార్యమైనపుడు

మన సంగతి చెప్పాలా మరి:

చెప్పాలంటే నీ సొంపు
అదో టెక్నికలర్ లాంపు
నీ సెక్ దగ్గరి వొంపు
లక్షవిస్కీ సీసాల దిగతుడుపు
నీ పేరిట పోస్టల్ స్టాంపు
ఇదే నీకు దక్కు మెప్పు."



*నగ్న కవిత*

---

**అంబరం నుంచి దిగంబరానికి దిగి వచ్చింది కవిత. దిగంబర కవులు ఆవిర్భవించారు. వీళ్ళవి వచనకవితలు కావు (ట). వీరి కవితల్ని దిక్కులుగా వ్యవహరిస్తారు. సమాజానికి క్రొత్తరక్తం ఇంజెక్టు చెయ్యాలనుకున్నవాళ్ళు. ప్రస్తుతం ప్రాక్టీసు లేని డాక్టర్లు. వీరి నుండి దూసుకు వచ్చే కేకలు.**

(వీరిలో మళ్ళీ ఎవరి శైలి వారిదే అయినా జనరలైజ్ చేసి ఒక శాంపిల్ మాత్రమే యిస్తున్నా)

కళ్ళతోనే వ్యభిచరించే కొజ్జావాళ్ళ
కళ్ళకి నెమలితప్ప యింకెవరు కనిపిస్తారు?
జాతీయత పక్షుల పరం చేసేసి
మీరంతా పక్షుల్లా వూరేగండి.
చరిత్ర పునరావృతమౌతుంది.

తెల్లవాడు నల్లవాణ్ణి,
వున్నవాడు లేనివాణ్ణి
దోపిడీ! దోపిడీ ! దోపిడీ
మీరు పెద్దలకేసే పిండాలను
ప్రేతాత్మల తృప్తి కై తినే కాకి,
కుళ్ళును, కల్మశాన్ని పాయసంలా
తిని ప్రజాసేవచేసే వాయసం
కాదు ఎందుకో జాతీయవిహంగం?
చీరచూసి పీటలు వేసే
పుండాకోర్లు! దగాకోర్లు.
..............



*భావకవిత్వం*

---

**"అంత్య ప్రాస చాలు కవిత్వానికి" అని సిన్సియర్‌గా నమ్మి రచనలు చేసే భావుకులు వీధికొకరు వున్నారు. వాళ్ళ రచనకంటే వారు చదివే తీరు ఉత్సాహంగా వుంటుంది-**

"జాతీయ విహంగం
జాతికే కురంగం
ఆహా! ఏమి నీ అందం
జోహారు అంటోంది నా డెందం
నిన్ను గద్దె ఎక్కించే సమయం.
మధురం మధురం"

**ఇలాగే రబ్బర్‌లా సాగిపోతుంది.**

# పీఠికా పాటవం

ఆదికవి నన్నయతోనే 'అవతారిక' ఆవిర్భవించింది. అచ్చుయంత్రం వచ్చాక పరిష్కర్తలు, ప్రచురణకర్తలు వచ్చారు. కొన్నాళ్ళ వరకు పీఠికలు వ్రాయించే బాధ్యత ప్రచురణకర్తలే వహించారు. ప్రాచీన గ్రంథాలలో చాలావాటికి తంజవరం తేవప్పెరుమాళ్ళయ్య, నాగపూడి కుప్పుసామయ్యగారు ఆలోకనలను అందించారు. తర్వాత కాలంలో ఎవరి గ్రంథాలకు వారే పీఠికలు వ్రాసుకోవడం, లేదా వారికి ఇష్టమైన వారిచేత వ్రాయించుకోవడం ఆనవాయితీ అయింది. గ్రంథాన్ని అనుసరించి ఆయా రంగాలలో ప్రసిద్ధులైన వారిని సహజంగా ఈ పీఠిక వ్రాయడానికి నియమించడం జరుగుతూ వుంటుంది. ఇందులో మొగమాటాలు, ముఖపరిచయాలు వగైరా వున్నా వుండవచ్చు -

కొందరు ప్రముఖ రచయితల పీఠికల బాణీలు ఎలా వుంటాయో చూద్దాం:

**సర్వశ్రీ అనే అభ్యుదయ కవి తన వచన కవితా సంపుటికి**

**పీఠిక వ్రాయండని కోరినపుడు**

**ఆయా ప్రముఖుల ఆముఖాలు ఎలా వుంటాయి**

అనేది ఈ పేరడీకి వస్తువు.

**తనకు ఇష్టమైతే విపరీతంగా పొగడడం. కానపుడు నిష్కర్షగా తెగడడం విశ్వనాథ గారు తన పీఠికలలో చేస్తారు. తనకు, రచయితకు గల సంబంధ బాంధవ్యాలను వారు అందులో ఉటంకించకుండా వుండరు. వారి ఆలోచనా క్రమం:**

సర్వశ్రీ గారి గ్రంథమును జూచితిని. చదివితిని. నా వద్దకు బరిచయ వాక్యముల నర్థించుచువచ్చెడి వారి సంఖ్య యధికము. బహుశః నేడాంధ్ర దేశమున నాకు గల పేరు ప్రతిష్ఠలు అందుకు కారణము గావచ్చును.

వెలనాటి బ్రాహ్మణులలో కొందరు మంచికవులే వున్నారు. వీరి తండ్రిగారిని నే నెరుగుదును. ఆ మొగమాటము చేతనే కాదనలేకపోతిని. ఆయన అవధానములు చేసెడివాడు. మంచి ధారాశుద్ధి యున్నది. కనుక వీరు బండిత పుత్రులు.



సర్వశ్రీ అనునది వీరి అజ్ఞాత నామము, జ్ఞాత నామము వేరుగా యున్నది. దానితో మనకు బని లేదు. వీరి గ్రంథములో ఛందోబద్ధమైన పద్యములు కానుపించవు. పద్యమనగా నేమి? అది గణ యతి ప్రాసల చేత

నిబద్ధమైన యొక ఛందఃఖండము, అందు భావము నిక్షిప్తము కావలె. అందుకొన్ని వాక్యము లుండును. వాక్యమునందు శబ్దములుండును. అచ్చులయు, హల్లులయు కూడిక శబ్దము. మేము నిబద్ధులము కాము, అనబద్ధులమని కొందరల్ప ప్రతిభావంతులు ప్రేలుచున్నారు. ఇట్టివారికి బరితల సంఖ్య నేడధికముగనే యున్నది. కావుననే దేశమున కీ దుర్యోగము పట్టినది.

వీరికి రాదగిన కీర్తి పరమేశ్వరుడు తెచ్చును గాక!

## ఆత్మస్తుతి



**"అతిక్రమించి మామూలు మర్యాదల్ని అభినందించుకుంటాను నన్ను నేను" అని స్వయంగా చెప్పుకున్న కుందుర్తి గారి పీఠికలలో నోత్కర్ష వున్నదని యెవరైనా అంటే అదేమీ గొప్ప అన్వేషణ కాబోదు. వారి పీఠికా పాటవం:**

'కొన్నాళ్ళ క్రితం వీర్రాజుగారి 'కొడిగట్టిన సూర్యుడు'కి ఆముఖం వ్రాస్తూ నేను యిలా అన్నాను-" తీసిన కొద్దీ అర్థాలు రావడం కవిత్వానికి సహజ లక్షణం. అయినా కావ్యంలో సందేశం కొంతలో కొంత స్పష్టంగా

వుండాలనే నా మతం... అభ్యుదయోద్యమం విజృంభించిన రోజులలో ఆదర్శమనే దానికి అధిక ప్రాధాన్యం వచ్చి కవిత్వపు విలువలను నిర్లక్ష్యం చేయడం జరిగింది.

ఇప్పుడు నేను అదేమాట అంటున్నాను. వచనకవిత్వంపై సాధికారంగా చర్చించగల వొకరిద్దరిలో నేనొకడినని నమ్మేవారిలో నేనూ వొకణ్ణి. ఫ్రీవర్స్ ఫ్రంట్‌ని స్థాపించి వుండకపోతే నేడు తెలంగాణాలో వచనకవితకు ఇంత ప్రాచుర్యం వుండేది కాదనేది సర్వజనాంగీకారం. ఇలాంటి అర్హతలు కొన్ని వుండబట్టే నేను 'కవిత్వాన్ని జాతీయం చేశాం.' అనే గుత్తాధికారం తీసుకుని ప్రకటించడం జరిగింది.

సర్వశ్రీ గారిని ప్రత్యేకం నేడు తెలుగువారికి పరిచయం చేయాల్సిన అగత్యం లేదని నాకు తెలుసు. అయినా ఈ పీఠికా ప్రక్రియను అభ్యుదయ కవితా సిద్ధాంతాల ప్రచారానికి పదునైన సాధనంగా మలుచుకున్నాను కనుక స్వార్థంతోనే దీనికి అంగీకరించాను...'

## *జీడిగింజలు*



**జీడిమామిడికాయలో విత్తనం వేరుగా వున్నట్టే - సంజీవదేవ్ గారి పీఠికలు అసలు గ్రంథవిషయంతో సంబంధం లేకుండా వేరుగా వుంటాయి. విడిగా చదువుకున్నా అట్టే ఇబ్బంది వుండదు. పీఠికలకు వీరిచ్చే ప్రత్యేక శీర్షికలు వొక ఆకర్షణ-**

కవిత విన్పిస్తుంది చెవికి
కవిత కన్పిస్తుంది కంటికి
గద్యంలో వుంటవి కొన్ని రచనలు
వుంటాయి కొన్ని రచనలు పద్యంలో-

కవిత గాని గద్యం వున్నట్టే కవిత కాని పద్యం కూడా వుంటుంది. కవితగల గద్యం వున్నట్టే కవిత గల పద్యం కూడా వుంటుంది. ఉన్మీలనచేసే స్రష్టయొక్క అనుభూతికి, రసమయ అభివ్యక్తికి భారసామ్యం కుదిరినపుడు రసాత్మకమైన కావ్యంగా రూపాంతరం చెందుతుంది. అందుకే ప్రసిద్ధ చైనీయ దార్శనికుడు లోఫ్ - చే అంటాడు "రసాత్మక కావ్యంలో భాషని భావాన్ని వేరుచేయజాలం. అవి రెండూ అవిభక్తమైనంత సమ్మిళితంగా వుంటవి" అని.

కవిత పద్యమా, గద్యమా: నిబద్ధమా, అనిబద్ధమా అనేది అముఖ్యం. నిబద్ధరీతి గొప్పదే. సందేహం లేదు. అయితే అనిబద్ధరీతి అంత కంటే తక్కువ గొప్పదేమీకాదు. నిబద్ధరీతిలో అనిబద్ధత, అనిబద్ధరీతిలో నిబద్ధత అంతర్లీనంగా వుండి వుంటాయి.

కొందరి కవితల్లో పార్థివానుభూతులకు అధిక్యత వుంటే మరి కొందరి కవితల్లో అధిక్యత వుంటుంది. అపార్థివానుభూతులకు సర్వశ్రీగారి కవితల్లో ఆధిక్యత వుంటుంది రెంటికీ!

***



**పుస్తకాలకు, ముఖ్యంగా సూవెనీర్లకు రాజకీయ నాయకుల సందేశాలు, అభిప్రాయాలు తెప్పించడం ఒక ఆనవాయితీ అయింది. వారు పంపే అభిప్రాయాలను ఏ పుస్తకాలకైనా ఆముఖంగా వుండవచ్చు. తారతమ్యం లేని సామ్యవాద సరళి.**

'సర్వశ్రీ గారి రచనలను ప్రచురిస్తున్నందుకు సంతోషం.

మహాత్మగాంధి, సుభాష్ బాబు లాంటి మహనీయుల ఆదర్శాలను ప్రజలలో ప్రచారం చేయాల్సిన అవసరం నేడు యెంతైనా వున్నది. సదవగాహన, సుహృద్భావం పెంపొందించే ఉత్తమ సాహిత్యం నేడు రావాల్సి వున్నది. గాంధేయ సిద్ధాంతాలకు, జాతి పునర్నిర్మాణానికి మనమంతా పునరంకితం కావల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికే తెలుగు భాషను తాలూకా స్థాయిలో ప్రవేశపెట్టడం జరిగింది. త్వరలో ఫిర్కాస్థాయికి, గ్రామస్థాయికి తీసుకురావాలని అనుకుంటున్నాం - ఇలాంటి తరుణంలో సర్వశ్రీ లాంటి అభ్యుదయవాదుల రచనలను ప్రచురించడం ముదావహం.

**శ్రీశ్రీ గారికి కుదురు తక్కువ. అసలే మెలిక "శ" దానిపైన గుడి, దానికి పొల్లు - అడుగున కొయ్యగుర్రం పీఠంలా క్రావడి, పోనీ ప్రక్కనైనా వ్యాట్ సీసాలా పొట్టిగా గట్టిగా నిలబడగల అక్షరం వుందా అంటే అదికూడా శ్రీయే- ఇక శ్రీశ్రీకి కుదురు ఎలా వుంటుంది? అయినా యుగకలం ఆయన చేతిలో వుంది - మరి ఆ కలం కదలినా, కక్కినా కూడా అందమే-**



'ఓ నాలుగు పుష్కరాలక్రితం - ప్రజోత్పత్తి నామ సంవత్సరం కావచ్చు అది. సమాజ శ్రేయస్సు దృష్ట్యా సాహితీ యజ్ఞం చేయాల్సి వచ్చింది. శ్లిష్ఠ్ల, పఠాభి, నారాయణ బాబు, జరుక్‌శాస్త్రి ఋత్విక్కులైనారు. నేనేమో సోమయాజిని, ఛందస్సు బలిపశువు అయింది. గురజాడనీ, వేమననీ ఆవాహన చేశాం. యజ్ఞానంతరం తెలుగు మాగాణం ముక్కాకు పంటలతో సశ్యశ్యామలమైంది. ఇంకో రివల్యూషన్‌కి నాంది పలికింది.

ఛాందసులు ఫ్యాక్టరీ గొట్టానికి, పొయిట్రీకి సంబంధం ఏమిటని సైరన్లలా కూశారు. కవితాకన్యకు ఘోషా లేకపోతే అనర్థకమన్నారు.



సర్వశ్రీగారి కవితా సంపుటి ఈ శతాబ్దపు క్లాసిక్ అని చెప్పడం ఆత్మవంచన అవుతుంది. అయితే వచనకవిత్వపు ఆనూపానూ తెలిసిన రచయిత అని మాత్రం చెప్పగలను.

## *పరిశుద్ధ రచన*

**ఒక క్రైస్తవ మతాచార్యుడిని పీఠిక వ్రాయండని కోరినపుడు వారి శైలి యిలా సాగుతుంది.-**

'సహోదరుడైన సర్వశ్రీ గ్రంథము మిక్కిలి కొనియాడతగినదై యున్నది. పాపుల యొక్కయు, జీవితము యొక్కయు, దేశము యొక్కయు నిజమైన విషయములు యిందు వ్రాయబడియున్నవి. ఈలాగున వుత్తమ గ్రంథములను రచించుటవలన సహచరులకు మిక్కిలిగా మేలు చేసినవాడు అగుచున్నాడు. మనుష్యుడు తన వివేకము కొలది పొగడబడును. నీతిని విత్తువాడు శాశ్వతమైన బహుమానము నొందును. ఇట్టి వ్రాతలు వ్రాయువాని తల మీదికి దీవెనలు వచ్చును.

ఈలాగున యీ యొక్క గ్రంథమును ప్రకటించుట మిక్కిలి వుత్తమమై యున్నది.

**(బైబిల్ శైలిని అనుకరించడానికే యిది వ్రాయబడింది.)**



**మూడు ప్రాంతాల మాండలికాలు, విప్లవ భావాలు, స్వీయప్రతిభ యీ అయిదూ కలసిన పంచకోల కషాయం కె.వి.రమణారెడ్డి గారి గద్యశైలి. కషాయం ఆరోగ్యానికి మంచిది కాదా అంటే మంచిదే. ఎటొచ్చీ గొంతు దిగే దాకానే ఇబ్బంది, వైద్యో నారయణో హరి:-**

'అభ్యుదయ కవి తెలుగు మీరి వచనకవితని ఇష్టాధీనంగా పలికించగల శక్తిని సముపార్జించాడు. బూర్జువా భ్రమలలోపడి నేటి ఆర్థిక, సాంఘిక తార తమ్యాల వైపు దృష్టి సారించకుండా 'కూపస్థ భల్లూకా' ల్లాగా వున్న వాళ్ళు యెందరైనా వున్నారు. ఇక్కడ వాళ్ళను గురించి చర్చించడం అంత లాభసాటి పని కాదు.

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మార్క్సిస్టు చింతనకు లోబడని రచయితలు అరుదుగా వున్నారు. వస్తువును విశ్లేషించడం భౌతికవాదానికి మూలమైన మార్క్సిస్టు దృక్పథం-

వాస్తవ విషయపరమైన వాటిని ఆదర్శీకరించదు భాష. సామాజికస్పృహ కవి మనస్సుతోటి సంధానించుకుంటే తప్పక ఆ కవితకు ఉత్తమత్వం ఆపాదించవచ్చు. తన సొంత యిష్టాయిష్టాలను అతిక్రమించిన స్వవర్గ హద్దులు దాటి వాస్తవాలను కవి చూడగలగడం సబబు.

గణాలు కట్టించుకుంటూ పద్యం రాయడం మాత్రమే కవిత్వం అని త్రికరణశుద్ధిగా నమ్మే సాంప్రదాయికులు ఆనాళ్ళలోనూ యీనాళ్ళలోనూ లేకుండా పోలేదు. పదకవితల్ని నాడు "ముది విటులు, విధవ లంజెలు..." అని స్తోత్రీయులు చెండుకున్నారు...

సర్వశ్రీ గారి కవితల్లో నాకు స్పష్టంగా రెండు కొరతలు కన్పిస్తున్నాయి...

## స్థాళీ పులాక న్యాయం

**కొందరు మరీ పెద్ద పండితులు వుంటారు. వారు కూడా ఏ గ్రంథానికైనా ఇమిడిపోయే పీఠిక వ్రాయగలరు. వారికి సమయాభావం, అనారోగ్యం ఎప్పుడూ వుండేవే! వీళ్ళు మనం వ్రాసే లేఖల్ని కూడా స్థాళీ పులాక న్యాయంగానే చదువుతారు.**

సర్వశ్రీ విరచితంబైన గ్రంథరాజము మాకు ముట్టినది. సమయాభావముచే స్థాళీ పులాక న్యాయముగా చదివియుంటిమి. ఇందు గవి నేటి సాంఘిక విషయములను తన గవితలో జొప్పించి రక్తి కట్టించినాడు. వీరి కల్పనా చతురత మిక్కిలి ప్రశంసనీయము. ఆధాపి సులలితము ఆపాత మధురమై యొప్పుచున్నది.

బుధవరులు గుణ గ్రహణ పారీణులై దీని నాస్వాదింతురు గాక. సర్వశ్రీ చిరంజీవియై నిట్టి సత్కృతులు వేలాదిగా వెలయింతురని ఆసింతును. ఆస్తు!"

# గులాబీ వర్ణన



వచన కవితా ప్రక్రియ ఇంత వటువు అంతైనట్లు, అర్ధశతాబ్ది కాలంలో దేశం పట్టనంతగా ఎదిగిపోయింది. ప్రాచీన కావ్యాలను, కవితారీతిని కౌలుకు పుచ్చుకునే వారి సంఖ్య పడిపోయి, మౌలిక రచనలుచేసే నవ్యుల సంఖ్య పెరిగింది. వీరిలో కొందరు మాత్రమే వచన కవితలలో తమ సొంతముద్రలను బలంగా వేసుకోగలిగారు. అలాంటి కొందరిలో కొందరిని అనుకరిస్తున్నాను-

**గులాబి పువ్వు కవితా వస్తువైతే ఆయా**

**రచయితల**

**వచన కవితా రచన ఎలా సాగుతుంది?**


- అనేది పేరడీఅంశం.

*పఠాభి ఫన్ చాన్ గమ్*

**అచ్ఛందంగా కవిత్వం వ్రాస్తే ఆయుక్షీణమని నమ్ముతున్న రోజులలో నిర్భయంగా పద్యాల నడుములు విరగదన్నినవాడు తిక్కవరపు పఠాభిరామిరెడ్డి గారు. మంచి పనివాడు మాత్రమే కాదు, వచన కవితలలో అనేకానేక సర్కస్ ఫీట్లు చేసి చూపిన జోకర్.**

వారి శైలి:

"లాబీలో వుదయాన విర్సిన గులాబీ
ఈవినింగ్ మెరీనాలో మెర్సిన రోజీ లిప్ దోయివలె తోచున్
రోజా వుషోదయంబున ఫ్రెష్‌గా వుంటే
రోజీ సైట్వేళ ట్రిమ్‌గా వున్డును,
డ్రీమ్‌గరల్ పేర్లల్‌గా చూచు జనం కేసి
డీమ్ ఫ్లవర్
ని
ట్ట
ని
లు
వు
గా
చూస్తుంది.




స్కైలోకి రోజాని పల్కరించన్ గాని
నేను రోజీని మాత్రం "కుచలప్రశ్నల్"
అడుగుతాన్రోజు
లతాంగి కోరికల్
సాయింత్రానికి వాడిపోవున్
రోజా పూ-
రోజీ వాడును వుదయానికి
మొగాడి వాడికలో

**కాల్పనిక సాహిత్యపు వలయం నుంచి బయటపడి చాలా దూరం పరిగెత్తి ఫ్రాయిడ్‌ని, మార్క్స్‌ని ఒకే గ్రుక్కలో తాగేసి దప్పిక తీర్చుకున్నాడు నారాయణబాబు గారు. ఇమేజిజం సామాజిక స్పృహ ఆయన వెలిగించిన రుధిరజ్యోతికి చమురూ, వత్తి. నారాయణబాబు కవితాతంత్రం:**



శిధిలమైన
గోరీ వెనుక
తుమ్మలో
పొద్దు క్రుంకిన
విధాన
విచ్చుకున్న
గులాబి
కుష్ఠురోగి
కురుపు
జలధిపైన
కుంభవృష్టి
శ్మశానంలో
సంతర్పణ
అందాలను



చిమ్ముతోంది
ముళ్లగులాబి
బలి ఇచ్చిన
మేకపోతు
కార్శ్యం
బూర్జువా
గుండె మీద
బూజల్లే
రోజా!

### కాళోజీ గొడవ

---

**కాళోజీ గారు ప్రజాకవి, "చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చూడలేవు" అంటారాయన. వారి రసార్ద్ర హృదయమే వారి కవితల్లో అంతర్లీనంగా స్పందిస్తుంది. సమాజంలోని అసమానతలు తొలగించాలనే కాళోజీ గొడవ -గులాబిని చూచి ఆయన పెట్టే గొడవ:**



"లెక్కకు మించిన రెక్కలు వున్నా
గులాబి పువ్వొకటేనన్నా:
మన దేశం ఒకటే అయినా
కులమత భేదాలెన్నో? ఎన్నో?

వికసించిన పువ్వుకు రెక్కలు
విహరించే పక్షికి రెక్కలు
ప్రతిమనిషికి వున్నవి రెక్కలు
రెక్కలు కలిపిన వుండవు చిక్కులు
రెక్క లాడినా డొక్కలు పూడవు కొందరికి
డొక్కలునిండీ రెక్కలాడవు కొందరికి
వికసించిన గులాబిరేకులు
చైతన్యపు సంకేతాలు
అటపొంచిన గులాబిముళ్లు
గురిపెట్టిన తుపాకి గుళ్ళు

## సోమరాజు రంధి

**రా.వి. శాస్త్రి గారి నవలలలో, పాత్రో గారి నాటికలలో ప్రవేశ పెట్టిన శైలిని వీరి కవితలలో జొప్పించారు. విశాఖ ప్రాంతపు మాండలీకాలలో తొలిగా కవితలల్లిన ఘనత రంధి సోమరాజు గారికి దక్కుతుంది. అన్నీ అవే అయితే వెగటించే ప్రమాదం వుంది. అక్కడక్కడ అప్పుడప్పుడైతేనే ఆ టెక్నిక్ అందగిస్తుంది.**

సందెమబ్బుల్ని
తునకలుగా తురిమి
ఇంద్ర ధనుసు

తొడిమ సేసి
దొంతర్లల్లే
పేర్చినట్టుంది
యిచ్చిన గులాబి.
పొద్దుటేల
గులాబి మీన
తొంగున్న
మంచు సుక్క

అమ్మవొడిలో
జోగిన
సిట్టి పాపాయి నాగుంది
బుల్లి సిగలో
గులాబి యెట్టుకుంటే
సిమ్మ సీకటిలో
గోరంత దీపం
యెట్టి నట్టుంటాది.
బుల్లి పెదాలు ఇప్పితే
గులాబి ఇరిసినట్టుంటాది
సొట్టలడిన బుగ్గలు
రేపు ఇచ్చే గులాబి

మొగ్గల్నా గుంటాయ్
బారెడు పొద్దేళ
మాంసపు ముక్కని
ముక్కెట్టి
యెనక్కి తగ్గింది
మాయదారి
వూర కాకి



## *విశ్వం గీస్తున్న గీతలు*


**అనుభవాన్ని అనుభూతిలోకి, అనుభూతిని అక్షరంలోకి అందంగా అనువదించగల అనుభవశాలి అరిపిరాల విశ్వం గారు. భాషలో ప్రాచీనత తొంగి చూచినా భావనలో నవ్యత పొంగులు వారుతుంది. వీరి వచనకవితలలో రవీంద్రుని గీతాంజలి ఛాయామాత్రంగా కనిపిస్తుంది-**



ఏ అచ్చర కన్నె మధురాధరాల నుండి
తొణికిన హసిత తరంగానివి?
ఏ సంకల్ప సిద్ధుని ఫలించిన
కోరికవో నువ్వు?
నా గుండె అంచున కరడుగట్టిన
వాంఛలు చెమ్మగిలిసై, నీరాకతో

నా యౌవనపు మైకపు జీరల్ని
సిరలుగా, అనురాగ ప్రస్తారం చేసే
నువ్వు
చీలిన పారిజాతపు గుండెవా?
గులాబివా?
ముగ్ధమై స్నిగ్ధమై
జాలినీ కాంక్షనూ
ఎదలోపలి పొరల్లో రేపే
నులివెచ్చని వసంత జాగృతిలా
అపూర్వ మధుజ్వాలా కీలికలా
విరిసిన తరుణారుణ లతాంతమా!
ఏ ప్రకృతి శిల్పి కుంచెకొసవో చెప్పు
................
......................
సంజె మబ్బు నీడలో
గులాబీ విచ్చుకున్నప్పుడు
అసంఖ్యాక రక్తాశ్రులు
ఘనీభవించిన చప్పుడు

**ఆంధ్ర కవితాకుమారికి ఊరూరా జరిగిన ఊరేగింపులో యధాశక్తి పల్లకీ మోసిన బోయీ భీమన్న గారు. వీరి 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటికి అకాడమీ బహుమతి లభించింది.**



గులాబీలు పూస్తున్నై!
ఒహో! పూస్తున్నై!
ఎవరికోసమో? పాపం!
కలవారికే అయివుంటై!
రోజాలు రాజాలకు కాక
మరెవరి కోసం?

ఒకసారి కోసిన గులాబీలు
మరి మళ్ళీ కోయడానికి
ఎక్కడ నుంచి వస్తుంటై!

అవును నిజమే!
ఎక్కడి నుంచి వస్తుంటై?

అదే మన సృష్టిలోని రహస్యం
వున్నవారి వినోదార్థం
ఈ గులాబీలు
మళ్ళీమళ్ళీ అవతరిస్తుంటై!
పోతుంటై పుట్టుకొస్తుంటై!

ఈ విషవలయం సాగడం

ఎంతవరకు?

ఆ మొక్కను వేళ్ళతో సహా

పెకిలించేంతవరకు!

## *అద్దేపల్లి ఆమోదం*

**విశ్వనాథ నుంచి నీరసపు పొలిమేరల దాకా ప్రస్థావించిన వాడు. భాష మీద అధికారం వున్నవాడు. ఆవేశం వరదపాలు కాకుండా కవితలో ప్రిజర్వ్ చేయగలవాడు, నినాదంతో పాటు నిజాయితీ కూడా వున్నవాడు, అద్దేపల్లి రామమోహనరావు గారి ఆలోచనా జ్వాల**



"తూరుపు ఆకాశపు గుండెల్ని చీల్చుకుని

దూసుకువచ్చే అరుణ కిరణంలా-

చీకటి గుహలో నర్తిస్తున్న దీపశిఖలా

నిరుపేద గుండెలో మెదిలిన ఆశా

జ్యోతిలా-

తోట నడుమ విచ్చుకొందొక ఎర్ర

గులాబి

గతరాత్రి చలినీ. చీకటినీ కలుపుకు

తిని

మంచెమీద సోలిన తోటమాలి

కోసం

తలపై రాలిన మంచుబిందువులను

రక్తాశ్రువులుగా మార్చి రాల్చింది

గులాబి.

రుధిర జ్యోత్స్నను కురిపించే

ఆర్క బింబంలా

పురోగమిస్తూ ప్రజాకోటి

ముక్తంగా ఆలపించు విప్లవ గీతంగా-

నెత్తుటి మడుగులోంచి హఠాత్తుగా

అవతరించిన విస్ఫులింగమై

ఘనీభవించిన ఎర్రదనంతో

తోటంతా తానే ఐ శిరసెత్తింది ఎర్ర

గులాబి

**తెలుగులో బాల సాహిత్యం సృష్టిస్తున్న కవులు చాలామంది వున్నారు. అగ్రశ్రేణికి చెందిన స్రష్టల్లో మరల ఎవరిశైలివారిదే! ఇక్కడ జనరలైజ్ చేసి ఒక వుదాహరణ మాత్రం యిస్తున్నా!**

"పాపల్లారా! రారండి!
గులాబి బాల విచ్చింది
బడి తోటకు దిగివచ్చింది
పాపల్లారా! రారండి!
రంగుల రంగుల
రేకులు రేకులు
హంగుల పొంగులు
సోకుల వెనుక



వున్నవి ములుకులు
జాగ్రత్తరా! జాగ్రత్త!
జవహర్‌లాల్‌కు
బాలలన్న బలె ప్రీతి
చూచారా మరి
చాచా నెహ్రూ ఎదమీద
కిచ కిచ నవ్వే గులాబి బాల.

# అనువాద మోదం

జాతీయ పుస్తక సంస్థవారి ఆదానప్రదాన కార్యక్రమంలో అనేక యితర ప్రాంతీయ భాషల్లోని కథలు తెలుగులోకి వచ్చాయి. హిందీ, బెంగాలీ భాషల్లోని కథలు కొన్ని ఇదివరకే తెలుగులోకి వచ్చినా, అన్ని ప్రాంతాల కథలూ విరివిగా ఇప్పుడిప్పుడే తెలుగులోకి వస్తున్నాయి.

**ఏ భాషలోనుంచి వచ్చినా ప్రాంతీయ వాసనలు, వాతావరణం కన్పిస్తూనే వుంటుంది. వేర్వేరు భాషల నుంచి అనువదింప బడినప్పుడు కథల నడకలు ఎలా వుంటాయి**

అనేది యీ పేరడీ అంశం.

*ఆంధ్ర మహాకృష్ణుడు*

పదహారణాల తెలుగు రచయిత. మల్లాది రామకృష్ణశాస్త్రి గారి శైలిలో ప్రారంభిస్తున్నాను.

"స్వామిశాస్త్రీ! యింకా తావళం దగ్గరే వున్నావుషోయ్?" తాంబూలం నవుల్తూ చేసంచీతో వంటింటి గుమ్మంలో ఆగాడు అవధాని.



"మాపాలేరు గుమ్మడిపండుని గుమ్మంలో దొర్లించి వెళ్ళాడేమో ననుకున్నాను. నువ్వుటోయ్ అవధానీ లోపలికి రా!" అరసున్నాలాగా వోరగా చూశాడు స్వామిశాస్త్రి.

"నువ్వు లేవూ- ఊడగొట్టిన నాగటిదుంపలాగా. ఈ చమత్కారాలకేం గాని తొందరగా అవుపోసన పడుదూ"

"కూర్చో అన్నయ్యా" అంటూ కామేశ్వరమ్మ గోడవార పీటతీసి వాల్చింది. తావళం బొట్టుపెట్టి - హరివేణం వుద్దరిణ సర్దుబాటు చేశాడు. ధోవళీముడి వొదులుచేసి అసనశుద్ధిగా కూర్చొన్నాడు స్వామిశాస్త్రి.

"ఇవాళ మీ చెల్లెలు మెట్ట గోంగూర పుఠం పెట్టింది పప్పులో కలగలిపి. రవ్వంత వెన్న నాలిక్కి రాసుకుంటే మాంఛి వనరుగా వుంటుంది. ఓపట్టు పట్టరాదూ?"

"ఆ అదొక్కటే తక్కువ. శాస్త్రులూ! కోర్టు వ్యవహారమంటే గోంగూర కాదు. ఆబ్దికాలన్నా అగుతాయేమోగాని కచ్చేరీలో వాయిదాలు ఆగవు."

"జడ్జిగారైతే మాత్రం చెయ్యి తిప్పకుండా యెట్లా జరుగుతుందిష? మీరు నిదానంగానే కూర్చోండి" అంటూ కామేశ్వరమ్మ వుసిరికాయంత

వెన్న మారువడ్డించి నాలుగు అన్నం మెతుకులు కప్పి మరీ వెళ్ళింది లౌక్యంగా.

"అయినా నిన్నని ఫాయిదా యేముందిలే. భోజనం మీద నీకింత ప్రీతే లేకపోతే ఆనాడు చివుకుల వారింటో వారమూ నిలిచేది. పది పన్నాల వేదమూ అబ్బేది!" నిట్టూర్పుగా అన్నాడు అవధాని.

"ఇప్పుడేం పోయింది లెద్దూ!"

"ముష్టి అగ్రహారం పోయింది అంతేగా"

"కాలం వస్తే యేదీ ఆగదనుకో, తెల్లవాడికి రాజ్యం పోలా? అవధానీ! ఈ పోచుకోలు కబుర్లకేంగాని గోంగూరలో నాలుగు ఆనపకాయ ముక్కలు పడేస్తే దాని రుచి దానిదే! గోగాకులో కాకరకాయ కూడా బాగానే పొసుగుతుంది గుర్తుంచుకో!"

"ఇవన్నీ నా కెందుకు... ఆనక బోనెక్కి ఈ ముక్కలే జడ్జీగారికి చెప్పు"

*హిందీ చందర్*

---

హిందీ మూలం: కిషన్ చందర్

తెలుగుసేత: ఆరిగిపూడి రమేష్ చౌదరి



"గంగారామ్?" గట్టిగా పిలిచాడు రమణీలాల్.

"లోపలికి వచ్చి చదర మీద కూర్చో అన్నయ్యా, గంగారామ్ రోటీ తింటున్నాడు" అంది మోతీ ఘూంఘట్ సవరించుకుంటూ.

రమణీలాల్ లోపలికి వచ్చి పద్మాసనం వేసుక్కూర్చున్నాడు. గంగారామ్ సూకారోటీలో ఉల్లిపాయ నంజుకుని తింటున్నాడు. గంగారామ్ కళ్ళలోని సంతృప్తి రమణీలాల్‌కి ఆశ్చర్యం కలిగించింది. ఏం లాభం. తనకీ ఖజానా వుంది...! ఇల్లుంది...! ఆ మాటకొస్తే తనకి లేనిదేముంది? మోతీలాగా సూకారొట్టెలు కాల్చి లోటాలో లస్సీ కలిపి యిచ్చే మనిషి యేది? నిజానికి యిల్లాలు లేని ఇల్లు దేముడు లేని దేవళంలాగే వెల వెలబోతుంది. రమణీలాల్ ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ -" మనం కచ్చేరీ వేళకు వెళ్ళగలమా" అన్నాడు గంగారామ్.

"ఓ! నిక్షేపంగా, మన టాంగా గుర్రం కుంటిదికాదు భాయ్. అబలక్...రిక్కవేస్తే అరక్షణంలో కచ్చేరీముందు అగదూ" అన్నాడు రమణీలాల్.

తమిళ మూలం: అఖిలన్

తెలుగుసేత: డాక్టర్ చల్లారాధాకృష్ణశర్మ.



ఏళుమలైకి సోమరిపోతులంటే మహా చెడ్డ కోపం. ఏళుమలై తేనిటీగలా ఎప్పుడూ హడావిడిగా వుంటాడు. కుంచితపాదం బద్ధకస్తుడే కాదు సరికదా తిండిపోతు కూడా, కుంచిత పాదానికి పాటుమీద కంటే సాపాటు మీద శ్రద్ధ ఎక్కువ. పచ్చని అరిటాకులో దండిగా తెల్లని అన్నం రాసిగా పెట్టించుకుని మధ్యలో సాంబారు పోయించుకోవాలి. అన్నంతో కట్టిన గురుగు నిండితే అప్పుడు యింక జుర్రుకోవడమే.

"ఈ తిండి మీద చూపించే శ్రద్ధ వ్యాపారం మీద నిలిపితే ఈపాటికి కోటికి పడగెత్తేవాడివి" అన్నాడు ఏళుమలై వెండిపెట్టెలోంచి తమలపాకులు తీసి సున్నంరాస్తూ

"నీవు ఆ తంబ నవలడం మానేస్తే ఈ పాటికి పెద్దదైన యిల్లు కట్టేవాడివి" అని గట్టిగా నవ్వాడు కుంచితపాదం.

వాళ్ళిద్దరూ సుగంధ ద్రవ్యాలు విదేశాలకు పంపే కంపెనీలకు భాగస్వాములు. అయితే వాళ్లిద్దరికీ వ్యాపారంలోనే గాక యింకో వ్యవహారంలో కూడా వాటా వుంది. అది అందరికీ తెలియదనుకోండి. ఆ రహస్యాన్ని రహస్యంగానే వుంచిన ఖ్యాతి మాణిక్యమ్మాళ్‌కే చెందుతుంది.

కన్నడమూలం: త్రివేణి

తెలుగు అనువాదం: శర్వాణి



కాఫీ తోటలు వచ్చాయంటే చిక్కమగుళూరు వచ్చినట్లే గుర్తు. గణ గణ మని మెళ్ళో గంటల చప్పుడు చేసుకుంటూ వడివడిగా పరుగు తీస్తున్నాయి ఎర్రబసప్ప, నల్లబసప్ప, ఆ మైసూరు ఎద్దుల జత నంజుండయ్యకి కుడి కన్నూ, ఎడమకన్నూ లాంటివి, వాటిని యింకొకరు తోలడానికి అంగీకరించడు నంజుండయ్య. వాటిని కొరడాతో కొడ్తారేమోనని భయం, స్వయంగా తోలాలి, అవీ అంతే. అతని కనుసైగలో నడుచుకుంటాయి.

సూర్యభగవానుడు నడినెత్తికి చేరుకుంటున్నాడు. బండిని రోడ్డు పక్కకు తీసి చెట్టు నీడన ఆపాడు.

"అప్పుడే మన హళ్ళి వచ్చిందా?" అంటూ బండిలో కునుకు తీస్తున్న శివదేవయ్య ఆవలిస్తూ అడిగాడు.

"హళ్ళి రాలేదుకాని దాణాకి వేళ అయింది దిగు... దిగు" అని శివదేవయ్యని హెచ్చరించాడు. బండి జల్లలోంచి వులవ గుగ్గిళ్ళ మూట తీసి రెండు భాగాలు చేసి బసప్పలకు దాణా అందించాడు.

"దేవయ్య! మనం కూడా నాలుగు మెతుకులు నంజుదాం" అన్నాడు నంజుండయ్య.

## *పంజాబీ సింగ్*

---

పంజాబీ మూలం : కర్తార్ సింగ్ దుగ్గళ్.

తెలుగు సేత : ఉషారాణి.



సుందర్ సింగ్ బందిపోటు దొంగ అయినా అతనికి హృదయం వుంది. "తప్పనిసరి అయితే యెవరినైనా వీపుమీదకొట్టు, పొట్టమీద మాత్రం కొట్టకు" తండ్రి మాటలు ఇప్పటికీ సుందర్ సింగ్ చెవుల్లో రింగుమంటూ వుంటాయ్.

మధ్యాహ్నపు యెండ కొండరాళ్ళను సైతం పగలగొట్టేలా వుంది. చేతులు వెనక్కు పెట్టుకుని గంభీరంగా కొండ వైపుకు నడుస్తున్న తన యజమాని సుందర్‌ని చూసి పెద్దగా సకిలించింది రజియా. రజియా

నమ్మకమైన అశ్వం. దానిపై ఎక్కడకు వెళ్ళినా తిరుగు వుండదని డాకూ సుందర్ సింగ్ విశ్వాసం.

మొలసంచీ లోంచి రెండు వుడకబెట్టిన బంగళాదుంపలు తీసి, మిరియప్పొడి జల్లుకుని ఒక్కసారి వేసుకుని కడుపునిండా నీళ్ళు తాగాడు సుందర్.

"గోధుమల్ని గోతాల్లోకి యెక్కించండి. ఎవరక్కడ? ధాన్యలక్ష్మికి నిప్పుపెట్టమని యెవరు చెప్పారు మీకు?" నాలుగు అంగల్లో గోధుమ రాసి దగ్గరకు వచ్చాడు సుందర్ సింగ్. అనుచరులంతా శిలాప్రతిమల్లా నిలబడి పోయారు.

"బలదేవ్, నీకెన్నోసార్లు చెప్పాను. మీరు బతకండి... ఇంకా నలుగుర్ని బ్రతికించండి. కాని యిలా తగలబెట్టకండి." సింహం గర్జించినట్లు, ఐరావతం ఘీంకరించినట్లు వుందా అరుపు.

గోధుమరాసి నల్లని మసికుప్పలా మారింది. బలదేవ్ చెంప చెళ్ళుమంది. తల దించుకున్నాడు సుందర్‌సింగ్. అంతా నిశ్శబ్దం.

*మళయాళ కురుప్*

---

మళయాళం మూలం : శంకర కురుప్.

తెలుగు సేత : నరసింహారావు కె.వి.యస్.



నేలలోంచి పుట్టుకొచ్చిన కుక్క గొడుగుల్లా వున్నాయి ఆ బెస్తవాళ్ళ గుడిసెలు. అంత దూరానికే ఎండు చేపల వాసన కొడ్తుంది. ఎండు చేపల్ని లారీల నిండా కొని పట్నంలో ఎక్కువ ధరకి అమ్ముకోవడం సలావుద్దీన్ వ్యాపారం.

బెస్తవారి కష్టాన్నీ, ప్రాణాలొడ్డి వాళ్ళు సముద్రంతో పోరాడి పట్టిన చేపల్ని సునాయాసంగా లారీలో తీసికెళ్ళి సొమ్ము చేసుకునే సలావుద్దీన్ లాంటి దళారి లంటే కురియకోస్‌కి చంపెయ్యాలన్నంత కోపం. చెనకమ్మ కురియకోస్ భార్య. లారీడ్రైవర్ తోమస్ మంచివాడులా కన్పిస్తాడు. అతను కూడా కురియకోస్ యింట్లోనే వుంటాడు.

అమావాస్య చీకటి. సముద్రం పోటుమీద వుంది. విరిగిన కెరటాల చప్పుళ్ళు బెస్తవాడలో కొలువు జరుగుతున్నట్లు వుంది. తలుపు కొట్టాడు సలావుద్దీన్. చెనకమ్మ తలుపు తీసింది.

"రొయ్యపప్పు వేయించి పెట్టాలి వేగిరం" అన్నాడు సలావుద్దీన్. బాగా తాగిన మైకంలో వున్నాడు. చెనకమ్మ గుమ్మంలోనే నిలబడి వుంది.

"ఆవనూనెలో వేగిస్తే రుచిరుచిగా వుంటాయ్ చెనకమ్మా" అని మైకపు స్వరంతో తూలిపోతూ అంటున్నాడు సలావుద్దీన్.

బెంగాలీ మూలం : ఎస్.ఎన్. చటోపాధ్యాయ

తెలుగు సేత : అమరేంద్ర



చందినీపూర్ సంస్థానంలో ముఖర్జీగారి మాటకు విలువ వుంది. ఆ వూరి సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడే కాళీమాత ఆలయానికి పూజారిగా వుండటం దివాణంలో అనాదిగా వస్తున్న ఆచారం. సురేంద్రుడు వయసులో చిన్నవాడైనా అటు సంస్కృత పాఠాలు చెప్పగలడు, ఇటు పూజారి విధానమూ తెలుసు. దివాణంలో కుదిరిన కొద్దిరోజులకే నలుగురి చేత మంచి అన్పించుకున్నాడు సురేంద్రుడు. యామినీదేవి అతనికి తగిన యిల్లాలు.

రోజు వుదయమే కాళీమాతకు నైవేద్యం తీసుకుని వెళతాడు. వూరి వాళ్ళు తలా వొకరు రోజు వొక భాగం అమ్మవారికి చేయించే ఆనవాయితీ చందినీపూర్‌లో వుంది. ఒకరోజు చక్రపొంగలి, మరోదినం దధ్యోజనం, యింకోరోజు పులగం యిట్లా జరిపిస్తూ వుండడం రివాజు. కోవెలలో పంచిపెట్టాక మిగిలిన ప్రసాదం యింటికి తెచ్చేవాడు సురేంద్రుడు. ఆపూటకి వారిద్దరూ దాన్నే భోజనంగా సరిపెట్టుకునేవారు. ప్రసాదం రోజు దివాణానికి వెండిపాత్రలో పంపేవాడు సురేంద్రుడు.

ఆరోజు ముఖర్జీ గారి మాటలకు సురేంద్రుడు అప్రతిభుడై అలాగే నిలబడిపోయాడు.

(మూల రచయితల పేర్లు అనువాదకుల పేర్లు కేవలం సహజత్వం కోసం మాత్రమే పెట్టడం జరిగింది.)

# ఫీచర్ వ్యాసవ్యాసులు అను కాలమిస్టులు

అణువులో అనంత విశ్వాన్ని దర్శించగలవారు మాత్రమే ఫీచర్ వ్రాసి నెగ్గగలరు. అల్ప విషయంపై అనల్పంగా చర్చించగల చతురత వుండాలి, తెలుగుదేశంలో అలాంటివారు ఎందరో వున్నారు. వారిలో కొందరి ఫీచర్ రచనలను అనుకరిస్తున్నాను యీ పేరడీలో--

**కృష్ణానది పుష్కరాలు వచ్చినప్పుడు - ఒక్కొక్కరి కలం కదలికలు ఎలా వుంటాయో ఊహించి ఈ పేరడీ వ్రాయడం జరిగింది.**

## *కాలక్షేపం బఠానీలు*

**పాతికేళ్ళ క్రితం దాసు వామనరావుగారి 'కాలక్షేపం' శీర్షిక తెలుగు పాఠకులను యెంతగానో అలరించింది. వామనరావుగారి వ్యాసాలు నిడివి యెక్కువగా వున్నా విసుగు కల్గించేవి కావు. పాతికేళ్ళ తర్వాత కూడా ఆ నాటి వారి ప్రాసంగిక వ్యాసాలు నేటికీ పాఠకుల నెమరుకు అందుతాయి.**

పై సందర్భంలో వారి రచన!

దాన కళా కలాప సముదంచిత

సార వివేక సంపదన్

మానిత యాచమాన జన మానస

వృత్త్యభి పూర్తి బుద్ధి యె

వ్వానికి లే దొకింతయును, వాడొక

రుండు భరంబు ధాత్రికిని

గానలుగావు శైలవులుగావు

పయోధులు గావు భారముల్.



"దీనారటంకాల తీర్ధ మాడించితి దక్షణాధీశు ముత్యాలశాల" అని చెప్పుకున్న శ్రీనాధుడు శృంగారనైషధంలో నలునికి చెప్పించిన నీతి వాక్యమిది.

అర్థులకు దానం చెయ్యనివాడు భూమికి బరువుచేటు. నిజంగా పుడమికి అడవులు, కొండలు, సముద్రాలు వానికంటే భారం కాబోవు. మనదేశం కర్మక్షేత్రం కనుక దానధర్మాలు చేయండనే ప్రచారం ఎక్కువ. ఒక సందర్భం సన్నివేశం కల్పిస్తే కాని కొందరు చేయి వదలరు, కనుక తీర్థాలు , శ్రాద్ధాలు కల్పించబడి వారికి మెడమీద కత్తులుగా వుంచబడినవి.

ద్వాదశవర్షాలకొక మారైనా బంధుజనమంతా పవిత్ర నదీ తీరాన పరస్పరం పలకరించుకుంటారనేది కూడా ఈ పుష్కరాల అంతర్యం కావచ్చు.

కర్మణ్య దేశంలో మూఢనమ్మకాలకు అగ్ర సింహాసనం వుండడం సహజం. పుష్కరాల తీర్థానికి వచ్చిన ఒక బ్రాహ్మణుడు నదిలోకి స్నానానికి దిగుతూ తన రాగి చెంబును నది వొడ్డున ఇసుకలో జాగ్రత్తగా నిక్షిప్తం చేశాడు. గుర్తుకోసం పైన తడి ఇసుకతో లింగాకారాన్ని తయారు చేశాడు. ఆయన వీరశైవుడు కూడా!"అయ్యవారు చేశారు - మనమూ చెయ్యాల్సిందే" నని తీర్థానికి వచ్చిన వారంతా తడి ఇసుకతో లింగాకారాలను తయారుచేసి నదిలోకి దిగడం మొదలు పెట్టారు. వీరశైవుడు స్నానం ముగించి ఒడ్డుకు వచ్చేసరికి ఏముంది? వేల సంఖ్యలో శివలింగాలు సాక్షాత్కరించినై, తన రాగి చెంబు ఏ లింగం క్రిందవుందో గుర్తింపలేక పోయాడు. కేవలం ప్రజల వేలంవెర్రి వలన బంగారం లాంటి రాగి పాత్రపోయింది... ...

## ఆషామాషీ వడగళ్ళు

అసలు వడగళ్ళు రావూరివారి వడగళ్ళకి స్వరూప స్వభావాల్లో సారూప్యం లేదు. ఇవి కరిగిపోని రుచిగల వడగళ్ళు.

**ఆనాడు 'కృష్ణాపత్రిక'లో అందిన మసాలా గుగ్గిళ్ళు. తర్వాత అవే 'ఆషామాషీ' లోకి పరకాయ ప్రవేశం చేసినై. రెండు పుష్కరాలకు పైగా**

**వ్రాస్తున్నా రావూరు వెంకట సత్యనారాయణగారి పాళీ నిగ్గు తేలిందేగాని రవ్వంతైనా అరిగిపోలేదు. వారి సున్నిత హాస్యధోరణి చిరులాస్యానికి ప్రాణదాత.**

## *కొంప కొల్లేటిసంత*

"ముందుగా చెప్పి వచ్చేది తిథి. చెప్పకనే దిగితే అతిథి. తిథినీ అతిథినీ కూడా ఆదరించడం గృహస్థ విధి" అని మల్లినాధ సూరిగారు అంటే "తిథులూ విధులూ ఏమోగాని ఈ అకాల పుష్కరం నా పాలిట అధిక మాసమై కూర్చుంది. సరిగంగ స్నానాలకోసం సకుటుంబంగా చుట్ట పక్కాలంతా దిగితే కొంప కొల్లేటిసంత కాక ఏమౌతుంది?" అని వాపోయాడు బంధులోకం ప్రాప్తించిన ఒక పెద్దమనిషి.

ఒక బ్రతక నేర్చినవాడు తీర్థం సాకుతో పిల్లా మేకతోసహా ఒక గృహస్తు యింట తిష్ట వేశాట్ట. పిన్నిగారూ, బాబాయిగారూ వరసలు పెట్టి పిలుస్తుంటే, కాబోలునంటే కాబోలునని చాలా మర్యాద చేశారట విడిది దిగిన దంపతులు. శ్రావణ భాద్రపదాల బాపతని తేలేసరికి కొంప గుండమైందిట. "తీర్థానికి వచ్చిన వారికి యింత ప్రసాదం పెట్టామన్న తృప్తికంటే రుణభారం అధికమైందని" విలవిల్లాడాడు ఆ గేస్తు.

## కూసేవాడు మేసేవాడు

పుష్కర పర్వదినం కదా ప్రేత తృప్తికోసం తర్పణులు విడుద్దామంటే- పురోహితుల గిరాకీ పెరిగిపోగా, వాళ్ళంతా చెట్లెక్కి కూర్చున్నారచట. "కూసేవాడికి పది, మేసేవాడికి అయిదు ఇచ్చుకోవాల్సి వచ్చిం"దని ఒక మిత్రుడంటే నాకు బోధపడిందికాదు. తర్వాత చెప్పాడు భాష్యం. కూసేవాడంటే మంత్రం చెప్పేవాడనీ. మేసేవాడంటే భోక్త అనీ. పోనీ అంత



కష్టంగా వుంటే మానెయ్యకపోయారా అంటే "పితృ దేవతలు నక నక లాడరుటండీ! మళ్ళీ పన్నెండేళ్ళకు కదా! పాపం" అని జాలిని ప్రదర్శించాడు.

## పుష్కరాలు - శుష్కప్రియాలు

ఎన్నడూ ఉత్తరం వ్రాయని మా దూరపు బంధువొకాయన నన్ను తెగపొగిడేస్తూ ఉత్తరం వ్రాస్తే నా మనసు వెల్లువైపోయింది. ముగింపులో "పుష్కరాలలో పుష్కలంగా దొరుకుతాయ్ కనుక అరడజను విబూది పళ్ళు, నాలుగు యజ్ఞోపవీతాలు, ధూపహారతి, కుందుల జత -

దర్భాసనం, గంధపుచెక్క కొని వుంచితే తనకు తీరినపుడు వచ్చి తీసుకు వెళ్తా" ననే ముక్కలు వ్రాశాడు. నా గుండె స్నానఘట్టమైపోయింది.

*అత్తగారూ- భానుమతీ*

---

**శ్రీమతి భానుమతీ రామకృష్ణ గారి అత్తగారి కథలు ఒక ఫీచర్ లాంటివే. వినోదాన్ని కలిగించే ఈ కథలు తెలుగునాట బాగా పాప్యులర్ అయినాయి. వీటి సాహిత్య స్థాయిని కొందరు సాహితీ వేత్తలు ప్రశంసించారు. కథ క్లుప్తంగా ఇలావుంటుంది.**

**అత్తగారూ - పుష్కరాలు**



నిద్రలేచి బాల్కనీలోనుంచి చూసేసరికి పెరట్లో ఒక బక్క చిక్కిన ఆవూ - హారతి పళ్ళెంతో అత్తగారూ కన్పించారు. దిగివచ్చి ఆరా చేస్తే -"పుష్కర తీర్థంనాడు నదివొడ్డున గోదానమిస్తే రేపు దాని తోక పట్టుకుని తేలిగ్గా వైతరణి దాటవచ్చు. అందుకే యీ తతంగమంతా. పాపం మన తంగవేలు వూరంతా తిరిగి కొనుక్కొచ్చాడు. అయిదు వందలు చౌక కదా?" అన్నారు అత్తగారు.

ధర విని అదిరిపడ్డా పైకి "ఔనౌను చాలా చౌక" అన్నాను.

తంగవేలు అతి వినయంగా పెద్దమ్మగారి పక్కన నిలబడి వున్నాడు. ఆవుకి పసుపూ కుంకుమా అలంకారం చెయ్యాలని అత్తగారి ప్రయత్నం. అదేమో బెదురుచూపుల్తో అత్తగారిని కుమ్మడానికి ప్రయత్నిస్తోంది. ఇంతలో మా పనికుర్రాడు రెడ్డి రావడంతో అత్తగారికి ఆ గండం తప్పింది.

"దీనితోపాటు బంగారు కొమ్ము, వెండి గిట్ట కూడా దానం ఇవ్వాలి లేకపోతే ఫలితం వుండదట" అన్నారు అత్తగారు.

"దానికేం భాగ్యం అలాగే చూద్దాం" అన్నాను.

ఈ ఆవుని నది వొడ్డుకి చేర్చడం ఎట్లాగా అనే పెద్ద సమస్య. అసలే పోట్లగొడ్డులా కన్పిస్తోంది. వూరంతా తీర్థ ప్రజతో కిటకిటలాడిపోతోంది. జనం మీద విరుచుకు పడితే పుణ్యం మాట ఎట్లా వున్నా శాపనార్థాలు మాత్రం తప్పవు. ఇంతలో నాకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది, వెంటనే ఫైర్ స్టేషన్‌కి ఫోనుచేసి విషయమంతా చెప్పి హెల్ప్ కావాలని అడిగాను. "అది మా డ్యూటీ కాదండీ" అని ఖచ్చితంగా చెప్పడమే కాకుండా నేను వాళ్ళనేదో న్యూనత పరచడానికి ఫోన్ చేశానని ఫీలై, అనరాని మాటలూ ఫోన్‌లో అనేశారు ఫైర్ స్టేషన్ వాళ్ళు.

ఏమీ పాలుపోక మావారికి సంగతంతా ఫోన్ చేసి చెప్పాను. ఓ గంటకల్లా స్టూడియోలో వున్న అంబులెన్స్ వాన్‌తో సహా హాజరైనారు. నా ప్రాణం కుదుటపడింది.

డ్రైవర్ సింగూ, మేనేజరు, రెడ్డి, తంగవేలూ చాలా హైరానపడి ఆ పోట్ల ఆవుని వాన్ లోకి సెట్టేసి డోర్ లాక్ చేశారు. మేమంతా కాబిన్‌లో కూర్చున్నాం. దారి పొడుగునా హటారి పిక్చర్ చూస్తున్నట్టు ఫీల్ అయ్యాం. కొమ్ము పోట్లకు వాన్ అద్దాలు రెండు పగిలిపోయి పెంకులు రోడ్డంతా పడ్డాయి. వాన్ గోమయంతో పునీతమైంది. దానం పుచ్చుకునే బ్రాహ్మణ్ణి కూడా తంగవేలే మాట్లాడి నది దగ్గరకు తెచ్చాడు. ఎట్లాగో క్రతువు అయిందనిపించాం అతి కష్టం మీద.

నిజంగా వైతరణి దాటినట్లే సంతృప్తి చెందారు అత్తగారు. వెయ్యి రూపాయలు ఖర్చయినా ఆమె తృప్తిని చూసి సంతోషించాం నేనూ, వాళ్ళ అబ్బాయి.

మర్నాడు తెలిసిందేమంటే - వీధుల్లో కాయితాలు సినిమా పోస్టర్లు, ఫిలిమ్ ముక్కలూ తింటూ తిరిగే ఆవుని. తంగవేలు పట్టుకొచ్చి ఈ కథ నడిపాడనీ, దానం పుచ్చుకొన్న సద్బ్రాహ్మణుడు తంగవేలు తమ్ముడేననీ. అయితే యిప్పటికీ ఈ నిజాన్ని మా అత్తగారి చెవిని వెయ్యలేదు నేను. గోదానంలో కలిగిన ఆమె సంతృప్తిని పోగొట్టడం యిష్టం లేక-

**చిత్ర సమీక్షకులు ఎందరున్నా అందరిదీ ఒకే వాణి - ఒకే బాణి. వీరు టాకీల్లోని గుణాలను మాత్రమే స్వీకరించే మాన్యులు. సినీ మానసరోవరంలో యీదులాడే రాయంచలు - వారిసమీక్ష యిలా సాగుతుంది-**

అశేష ప్రజానీకం ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న కృష్ణాపుష్కరాలు ఆంధ్రుల అభిమాన నగరమైన విజయవాడలో భారీయెత్తున ప్రారంభమైనాయ్. ఈ పుష్కరాలు భారతీయ సాంప్రదాయాలకు అద్దం పట్టే తీరులో జరుగుతున్నాయ్. భక్తి, ముక్తి, రక్తి మేళవించుకున్న ఈ సన్నివేశం కృష్ణానది చరిత్రలో ఒక మైలురాయి కాగలదనడంలో సందేహం లేదు. కిక్కిరిసిన యాత్రికులతో నగరం మనోహర దృశ్యకావ్యం వలె వున్నది.

ఆరోగ్య సిబ్బంది, పోలీసుదళాలు, హోంగార్డులు తమ అవధుల మేరకు కృషి చేస్తున్నారు. ఇతర స్వచ్ఛందసంస్థలు కూడా తమ తమ ధ్యేయాలకు న్యాయం చేకూర్చినవి.

పన్నెండేళ్ళ తర్వాత వచ్చిన ఈ తీర్థం అందరూ సకుటుంబంగా సేవించతగింది.

**సుబ్రహ్మణ్యశర్మ గారి ఇంటిపేరు 'పురాణం' అయినా మనం భయపడాల్సిన పని లేదు. రచనలో ఆ ఛాయలేవీ కన్పించక "ఇది కేవలం నేతి బీరకాయలాంటిదేస్మీ" అని హాయిగా గాలి పీల్చుకుంటాడు ఆసాంతం చదివిన పఠిత. తెలుగు జనం "నే నేది వ్రాసినా చదివేస్తారోచ్" అనుకుని వ్రాసినవి బహు కొద్దే అయినా వాటిల్లో కూడా కొసమెరుపు వుండనే వుంటుంది. వీరిశైలి మా చెడ్డ సరదాగా వుంటుంది.**



'అసలు వింటర్‌లో తీర్థాలు, వేసవిలో తిరునాళ్ళు రావడం ఏమీ బాగోదు. తారుమారైతే లబ్జుగా వుంటుందని ఘంటాపథంగా చెప్పగలను. దీనికి కారణాలు తీర్థ ప్రజలలాగా అనేకం. అవన్నీ చెప్పాలంటే పుష్కర కాలం పడ్తుంది.

పుష్కర తీర్థం వల్ల పుణ్యలోక ప్రాప్తి మాట యేమోగాని నా మట్టుకు నాకు కాలమానంలో కొంటెగుర్తుగా వుండి చాలా సర్వీస్ చేస్తోంది. మా నానిగాడు పుట్టి సరిగ్గా పుష్కరం. మా ఇంటాయన వెల్ల వేయించింది క్రిందటి పుష్కరాల్లోనే. పక్కింటి మాస్టారు రిటైరై పుష్కరం (ఇంకా పింఛను

మంజూరు కాలేదు). పుష్కరంగా ట్రై చేస్తున్న ఎదురింటి కామాక్షికి వరుడు దొరికాడు కాదు (పాపం సంగీతం కూడా నేర్చుకుంటోంది). 'అద్యతన భవిష్యత్తులో' అనే పెద్దల నిఘంటువులో పుష్కరం అంటే ఆట్టే దీర్ఘకాలం కాదు గాని సిన్మాతారల పంచాంగంలో పుష్కరం అంటే రెండేళ్ళు(ట). బృహస్పతి రెండో విడత కన్యరాశిలోకి వస్తున్నా సోమయాజిగారి జేష్ఠుడు ఆంధ్రా మెట్రిక్ గట్టెక్కలేదు.

'పుష్కరం నాడు కొన్నారు జత కట్టుడు చీరెలు మహా తెంపుగా' అంటుంది సంసారం చిత్రం సెకండ్‌హాఫ్‌లో వో బెటర్‌హాఫ్, ''ఇంకా నయం జన్మకో శివరాత్రి కాలేదు- సంతోషించు'' అనగలిగిన హీరోలు అరుదుగా లేకపోలేదు. పుష్కరం నాటి వూహలూ, ఆలోచనలూ నైరూప్యంగానే మస్తిష్కంలో పడి వుండడం మామూలు సంగతే! ఓ కార్డుముక్క గుడివాడ నుంచి బెజవాడ రావడానికి పుష్కర కాలం పట్టిందంటే మీరు ముక్కుమీద వేలు వేసుకోవాల్సిన పని లేదు.

బంధువుల తాకిడికితట్టుకోలేని ఓ అల్పప్రాణి ''ఈ నదుల్ని కూడా కంకర రోడ్డులాగా, కరెంటు తీగల్లాగా వాడ వాడలకీ విస్తరింప చేయాలనీ - లేకపోతే నదీతీర వాసులకు తిప్పలు తప్పవనీ చేసిన ప్రతిపాదనకు రెండు పుష్కరాల్లో సాధ్యం కావచ్చునని'' సానుభూతితో కూడిన హామీ ఇచ్చాను.

అసలీ తీర్థాల వెనుక బోలెడు సామాజిక స్పృహ నిండివుందని నా ఐడియా, ఆడా -మగా: కలిమి - లేమి: పండితుడూ - పామరుడూ ఒకే రేవులో స్నానం చేస్తుంటే 'సోషలిజ స్థాపనకు' పుష్కరాలు మాత్రమే ఏకైక మార్గమని నా అంతరాత్మ వుద్ఘోషించింది.

... ... ... .... ...

తీర్థం సందర్భంగా ఓ హస్తం ఖర్చుతో డకోటా విమానం ఎక్కి కుతి తీర్చుకున్నప్పుడు "నీది విమానం ఎక్కాల్సిన జాతకంరా సుబ్బులూ" అంటుండే మా నాయనమ్మ మాట చెల్లినందుకు నా కళ్ళు చెమర్చినై.

*ఊహాలత*

---

**ఒక వార పత్రిక ద్వారా ధారవాహినిగా అయిదేళ్ళపాటు తన ఊహాగానాన్ని విన్పించి పాఠక శ్రోతల్ని మైమరింప చేశారు శ్రీమతి లత. ప్రస్తుతం ఆమె 'తల' తిరగబడిందని కొందరి ఆరోపణ. అయినా 'లతే' అవుతుంది కదా! ఆమె గానం ఇలా వంశీమోహనుని రవంలా సాగిపోతుంది-**

'తలపులు గొల్లలాడి మిగులన్ భ్రమయించి యువ వ్రజంబుచే వెల లధికంబుగా గొనుచు వేడుక నమ్మిరి పువ్వులంగడన్' ఆనాటి కుర్రకారు పూలకై కాదు కందువ మాటలకు, చిరునవ్వులకు, సిగ్గులకు, చిడి ముడి పాట్లకు కూడా ధర చెల్లించే వారట. పుష్కరాల సందర్భంగా వేల సంఖ్యలో

షాపులు వెలిసినై, నాకు నచ్చింది కొండపల్లి బొమ్మలమ్మేషాపు. బొమ్మలమ్మే పిల్ల కొండపల్లి బొమ్మల్లో కలిసి పోయేంత ముచ్చటగా వుంది. కుర్రవాళ్ళకు షాపు వదలి రావడానికి కాళ్ళు ఆడడం లేదంటే విశేషం లేదు - బొమ్మల ధర చాలా యెక్కువ అన్పించింది. వెలదులు వున్నచోట వెలలు అధికంగానే వుంటాయ్ మరి.

అబ్రహం లింకన్ ఒక ఎగ్జిబిషన్‌కు వెళ్ళి వో కప్పు కాఫీ తాగాడట. అక్కడ అమ్మాయిలు నడుపుతున్న క్యాంటిన్‌లో కప్పు కాఫీ వెల చాలా అధికంగా వుందట. అక్కడ నుంచి తిరిగివస్తూ సేల్స్‌గరల్ చేయిని చూసి "ఇది మీ చెయ్యా? కాలేమో అనుకున్నాను. ఇక్కడ అన్ని వస్తువులూ ఆకాశాన్ని చూస్తున్నాయి కదా!" అని తన సహజమైన హాస్య ధోరణిలో చురక వేశాడట లింకన్.



కిక్కిరిసిన జనసందోహంలో నా కళ్ళు యెవరి కోసమో వెదుకుతున్నాయ్. ప్రక్కన నడుస్తున్న మామయ్య హెచ్చరికలు చేయడం, విసుక్కోవడం దాకా వచ్చింది. అయినా, నా చూపులు యెక్కడో యెవరి కోసమో... "సంకలో పిల్లోడు సంబ్రాలు పడుతుంటే" ఎంకి, నాయుడు బావ తీర్థానికి వచ్చారేమో చూడాలని ఆశ - ఆ మాట మామయ్యతో అంటే చాలా యీజీగా తీసుకొని 'ఓసి వెర్రిదానా' అనేస్తాడని నాకు తెలుసు...

# ప్రముఖుల ప్రేమలేఖలు

**ఈ పేరడీలోని ప్రముఖులంతా వారి జీవితాల్లో ప్రేమలేఖలు రాశారో లేదో నాకు తెలియదు. వారి మీద నాకున్న యెనలేని అభిమానం కొద్దీ వొకవేళ వారు రాసి వుంటే యెలా వుండేవి అని వూహించి ఈ పేరడీ రాయడం జరిగింది. ప్రసిద్ధ రచయితల్ని పదే పదే పలువిధాలుగా స్మరించడానికి వారిపట్ల నాకు గల అభిమానమే కారణం. ఈ విషయాన్ని మిగతా అభిమానులు కూడా గమనించగలరని ఆశిస్తున్నాను.**

*గిరికుమారుడు*

ఇది విశ్వనాథ వారి కలం పేరు. వారి రచనా పాటవం వల్ల వారికి గల ఆత్మవిశ్వాసాన్ని స్వోత్కర్షగా అపార్థం చేసుకున్నవారు వున్నారు. విశ్వనాథ ప్రేమలేఖ రాసినా తనని తాను తగ్గించుకోవడం జరగదు.



బాలామణీ!

ఆశీః

నిన్ను జూచితిని తదాది ఆలోచనలన్నియు నీ చుట్టూ పరిభ్రమించును. వదలి వచ్చుటకవి

మొరాయించుచున్నవి. నావంటి వాని మనస్సు సైతము బందీకృతమొనర్చిన నీదగు రూప లావణ్యములు అసామాన్యమే అయి వుండవలె.

మునుపే సరస్వతి నన్ను వరించెననుట లోక విదితము. అందులకై ఎందరు ఈర్ష్యబడిరో, బడుతుండిరో - అది వేరు విషయము. నేటివరకు రసభంగం కలగకుండ నెటో కాలము వెళ్ళదీయుచుంటిని. సరస్వతికి రసభంగము వాటిల్లిన 'సవతి' యగును కదా! సవతిపోరు కొని తెచ్చుకొనుటకు యే పురుషుడు మాత్రము ఇచ్చగించును? నేను వెర్రివాడను కాను. సాహిత్యమున సముద్రుడులాంటి వాడనని లోకము అంగీకరించిననూ లేకున్ననూ నేను భావింతును. ఈవు కిన్నెరసానివి. ఇక నేమి గావలె.

నా మనము నీపై నిడుట నీ యదృష్టము. కుంకుమ శోభితమై నీ నొసట... కుంకుమయనిన జ్ఞప్తికి వచ్చును. కాశ్మీర దేశము కుంకుమ పూలకు బ్రసిద్ధి. పుప్పొడులు తెమ్మెరలపై దేలుచూ అరుణోదయ మేదియో, మధ్యాహ్న మేదియో పసిగట్టనలవి గాకుండ సేయును. కుమ్ యను శబ్దము జేయుచు ఆ మొగ్గలు విచ్చుకొనును. అందుకే యది కుంకుమ యైనది. కాశ్మీర కుంకుమలో పదియారు వన్నెలున్నవి. వన్నెకొక ప్రత్యేకత గలదు..."

**(ఇలా సాగే వీరి ప్రేమలేఖకు జవాబు వస్తుందంటారా?)**

**అడివి బాపిరాజుగారి రచనల్లో ఐశ్వర్యం, ఆదర్శాలు తొంగి చూస్తుంటాయి. ఆ బాణీ వారి ప్రేమలేఖకు మాత్రం వర్తించదని ఎక్కడుంది?**

సౌభాగ్యవతి శశికళకు,

అడివి బాపిరాజు శుభాకాంక్షలతో వ్రాయుట. మా వకీలుగారైన ఆదిభట్ల హరినారాయణమూర్తి గారింటిలో మిమ్ములను చూచియుంటిని. ప్రధమ వీక్షణముననే మీ రూపము నన్నాకట్టుకున్నది. జపాన్ దేశపు సుందరాంగులను చూచియుంటినిగాని వారు స్ఫురద్రూపులు కారు. ఎత్తులో కొంత తగ్గుదురు.

శశికళ యనిన రాజా రవివర్మ చిత్తరువు వలె కమనీయమని నా యూహ. మీరు శాస్త్రీయ సంగీతమును దీక్షితులు గారి శిష్యరికమున సాధన చేసి యుండిరని వకీలుగారు చెప్పిరి. దీక్షితులు గారి గాత్ర సంగీతమనిన నేను చెవి కోసుకొందును. అలాపనమున వారి ప్రత్యేకత కనిపించును. ముఖ్యముగా శ్యామల రాగము మిక్కిలి మనోరంజకముగా నుండును

మీ విషయము మాతల్లిగారితో సంప్రదించవలెనని నిశ్చయించుకొంటిని. ఆమె మన వివాహమునకు తప్పక అంగీకరించునని నా నమ్మిక. రాబోవు కోడలి కోసమై ఆమె ఇరువది నాలుగు క్యారెటుల మేలిమి బంగారముతో వొడ్డాణము చేయించి యుంచినారు. అది తూకమున ముప్పది శౌరీలు తూగును. గజ్జల పతకము గలదు. నడుమేలేని ఈ కోడలు దీనినెట్లు ధరించునాయని అత్తగారు నిరుత్సాహపడవలసియున్ననూ యెట్లో వొప్పింప యత్నింతును. ఇక బులాకీలు, మక్కెరలు మీ నాసికకు బరువుచేటే కదా! ప్రదానపు



టుంగరమునకు మంచి ముత్యము వేయించుట మా ఇంటి రివాజు..."

**(ఇలా సాగి వారి ఆచారాలు, ఆనువాయితీలు చెప్పి ముందే ఆమెని భయపెట్టి విరహ ప్రేమికుడుగా మిగిలిపోయే అవకాశం ఎక్కువగా వుంది.)**

**మునిమాణిక్యం నరసింహారావు గారి కాంతం కథలు సంసారంలోని సరిగమల్ని వినిపిస్తాయి. పెళ్ళికి ముందు ప్రేమలు వీరికి అట్టే తెలియవు. వీరిదంతా సంసారపక్షం-**

ప్రియమైన కాంతానికి.

శుభాశీస్సులతో వ్రాయు లేఖాంశములు, ఉభయకుశలోపరి. నీవు వ్రాయించిన జాబు అందినది. సంగతులు తెలిసినవి. ఎదురింటి మీనాక్షికి మళ్ళీ ఆడపిల్లే! ఈ విషయం నీకు సంతోషం కలిగించగలదని తెలుపడమైనది. మీ జానికమ్మ పిన్ని గారింట్లో అంతా కులాసాగానే వున్నారు. కనకమహాలక్ష్మి నీ రాకకు ఎదురు చూస్తున్నది. వారి పెద్ద అమ్మాయికి సీమంతం చేస్తారట. నువ్వు చెప్పిన ప్రకారం పనిమనిషి దగ్గరున్న పెద్ద దబరాగిన్నె తెప్పించాను. పాత కాగితాలవాడు అమ్మ గారు ఎప్పుడొస్తారని రోజూ వాకబు చేస్తున్నాడు.



నువ్వు మడిగా కాక విడిగా చిన్న జాడీలో తీసి వెళ్ళిన ఆవకాయ అయిపోయింది. నువ్వు వెళ్ళినప్పటినుంచి అదేకదా ఆధరువు? మరి పెద్ద

జాడీలోంచి తీసుకోమంటావా? ఏ సంగతి జాబు వ్రాయించవలెను. వచ్చే తదియా గురువారం దివ్యంగా వుంది. ఒకవేళ నువ్వు బయలుదేరితే ప్రయాణంలో జాగ్రత్త. మన బందరు రైలుస్టేషన్‌లో నువ్వు కాపరానికి వచ్చినప్పటి నుంచి గుర్తుగావున్న రావిచెట్టుని మొన్నీ మధ్య నరికి పోగులు పెట్టారు. మరి నువ్వు స్టేషను ఎట్లా గుర్తుపడతావోనని బెంగగావుంది. నీనోట్లో మాట దాగనట్లే మన పెద్ద బాల్చీలో నీళ్లు ఆగడం లేదు. నువ్వు రాగానే మాటు వేయిద్దాము..."

## *తిలకామృతం*

**అమృతజల్లు లాంటి తిలక్ కవితల్లో సామాజికస్పృహ కంటె సౌందర్య స్పృహ యెక్కువ. కొద్దిపాటి అస్పష్టత వారి కవితారీతికి అదనపు అలంకారం.**

"మానస ప్రియా!

మీ ప్రతి అనువులోను నవ్య శిరీష మృదుత్వం ఏదో వుంది. సముద్రపు టంచున నిశ్శబ్దంగా మిగిలిపోయే కెరటపు నురగలా మీరులేని మీ సన్నిధిలో నేను... నిన్న కలత నిద్రలో మంచి కలగన్నాను. కలనిండా అందెల రవళులు. జూకామల్లె తీగెలు, వెన్నెల మడుగులు, అంగన రమ్య చేలపు కొసలు వెన్నెలలో జీరాడడమూ, వొదగలేని పైట వొత్తిగిలడమూ,

పున్నమి ఆమె అడుగులకు మడుగులొత్తడమూ - కవికి రసవంతంకాక మరేమిటి? ఆ స్వప్నసుందరిని మీరుగా గుర్తించి నిట్టూర్చిన జ్ఞాపకం.




మీ గురించి కలిగే ప్రతి ఊహకు మౌనభాష్యాలు రచించుకుంటూ ఎన్నాళ్ళిలా మధుర వేదనా స్రవంతిలో ఈదులాడాలో? సౌందర్య సహృదయాలు సమ్యక్ స్వరంలా మేళవించి అది మావిచిగుళ్ళను చీల్చుకువచ్చే కోయిల పాటగా నాగుండె కింద సెగ అయినప్పుడు పైకి పెరిగిరాని అవ్యక్త ప్రేలాపన, దాని భావం చెబితే మిగిలేది శూన్యమే సుమా! పోనీ ఈ నిశబ్దఘోషను ఎన్నాళ్ళు ఇలా భరించమంటావో నువ్వే శాసించు దేవీ! అదైనా చాలు కొంత ఊరట. గడచిన సాయం పొద్దులు వాడని జాజిపూలు, కాదనగలరా...?

(తిలక్ సఫలుడు కావచ్చునా...?)

## *పాత్రికేయుని ప్రేమవార్త*

**వృత్తి రీత్యా జర్నలిస్టులు కొన్ని పదాలకు అలవాటుపడి ఆ పరిధిలోనే వుండిపోవడం తప్పనిసరి అవుతుంది. ఏ విషయాన్నైనా తేల్చి**

**చెప్పకపోవడం తమ మీద బాధ్యత పెట్టుకోకుండా జాగ్రత్త పడడం వారి విధి నిర్వహణలో వొక భాగం కనుక ప్రేమలేఖలోనూ అదే ధోరణి...**




ప్రేయసికి ఒక విజ్ఞప్తి

విజయవాడ జులై 1

శ్రీమతి/ కుమారి విజయలక్ష్మి గారికి,

ఇటీవల లబ్బీపేట ప్రాంతంలో సాయంత్రం సుమారు ఆరు గంటల వేళ మిమ్మల్ని చూడడం తటస్థించింది. ఎర్ర చుక్కల తెల్లచీర కట్టుకున్న మీరు ఆరోజు చాలా అందంగా వున్నట్లు నేను భావించలేక పోలేదు. మీరు డాక్టరుగారి రెండో అమ్మాయని అభిజ్ఞవర్గాలద్వారా తెలియవచ్చింది.

కాగా మిమ్మల్ని చూసినప్పటినుంచి మనసు పరిపరి విధాల పోతోంది. ఇది ఒక వేళ ప్రేమభావన అయినా కావచ్చు.

పోతే నా వివాహం చేయాలనే ధృఢ సంకల్పంతో మా తల్లిదండ్రులు వున్నట్లు, అందుకుగాను వారు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు, ఇటీవల

వెల్లడైంది. కనుక, మీకు ఆమోదయోగ్యమైతే అద్యతన భావిలో మన వివాహం జరుగగలదని, ఇది విఫలం కాబోదని ఆశిస్తున్నాను. అన్యధా భావించడానికి ఆస్కారం లేదు కాబట్టి మీరు మీ అభిప్రాయాన్ని నిష్కర్షగా తెలుపగలరని విశ్వసిస్తున్నాను."

(ప్రేమ సఫలమైందా? ఆమె జవాబు రాసిందా? అనే వివరాలకు వచ్చేవారం వార్తల్లో చూడాల్సిందే.)

## *తాపీ వ్రాతలు*

**ఏవిషయాన్నైనా సమగ్రంగా సోదాహరణంగా చర్చిస్తే కాని తాపీ ధర్మారావుగారికి తోచదు - వారిది భౌతికవాదం.**

"సుభద్రా!



నిన్ను చూడగానే హృదయోల్లాసం కలిగినమాట వాస్తవమే అయినా కొన్ని విషయాలను ముందుగా చర్చించడం అవసరం. ఆనూపానూ తెలుసుకోకుండా అమాయకంగా ప్రవర్తించడమనేది నవీన శతాబ్దంలో కూడా జరగడం హాస్యాస్పదం. అందచందాలను వర్ణించుకుంటూ ఊహాలోకాల్లో విహరించడం స్త్రీ పురుషులిద్దరికీ శ్రేయస్కరం కాదు. జీవితాలను పరస్పరం పంచుకోబోయే

ముందు ఇద్దరి మధ్య సరైన అవగాహన అవసరం. ఈ విషయాలను నా 'జొన్నకర్ర' అనే వ్యాసంలో సమగ్రంగా చర్చించాను.

మనుష్యులలోనే కాదు, అన్ని జీవరాసులకు జత గూడడం అనే ఉద్రేక గుణం వుంటుంది. చివరకు సీతాకోకచిలుకల్లో కూడా ఈ జతకట్టడం అనేది వుంది. ధ్రువ ప్రాంతంలో వుండే పెంగ్విన్ పక్షుల వలపు సంకేతాలు ప్రేమ భాషలు విచిత్రంగా వుంటాయి. (చూ: నా పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు.) జీవితం లౌకికపరమైన విషయాలతోనూ లైంగిక పరమైన కోరికలతోనూ ముడిపడి వుంటుంది. నేటి యువతీ యువకులు ప్రేమ అనేది వో అతీంద్రియ లౌకిక అనుభూతి అని భ్రమపడుతున్నారు. కాని, ప్రేమ అనేది పూర్తిగా కామ పరమైంది. కానప్పుడు పురుషుడు స్త్రీనే ఎందుకు ప్రేమించాలి? వివరాలకు నా 'కొత్తిమీర' వ్యాసం చదువు.

మెసపొటేమియాలో యువతీయువకుల కామకలాపాలు చాలా వింతగా వుంటాయి.

*చివరకు మిగిలిన లేఖ*

---

**బుచ్చిబాబుగారి నవలలో తాత్విక చింతన, రసదృష్టి, కథని డామినేట్ చేయడం పరిపాటి. ఏమయినా కాల్పనిక సాహిత్యంలో ఆయన నిధి. వారి శైలి ఇలా వుంటుంది -**

డియర్ కోమలీ!

మనసులో కలిగే భావాలన వూహల్నీ మాటల్లోకి తర్జుమా చేద్దామంటే వోటమి యెదురయ్యే సందర్భాలే యెక్కువ అనుకుంటాను. ఆ రోజు మెరీనాలో లేత పసుపురంగు



బెనారస్ చీరలో నిన్నుచూశాక నా డ్రాయింగ్ రూములో వుండే బంగారు నీరు తీసిన వీనస్ డిమైలో ప్రతిమలో మొదటి సారిగా కొన్ని లోపాలు కనిపించాయి. ఒక్కొక్కప్పుడు స్త్రీలో కనిపించే పసితనపు లాలిత్యం, ఆమె సౌందర్యం కంటే ఆకర్షణీయంగా వుంటుంది.

కాలవ వార గడ్డిపోచ పైరగాలికి సుకుమారంగా వొంగినప్పుడల్లా రోజా రెమ్మ తగిలినట్టు గుండె చివుక్కుమంటుంది. ఆ సుకుమారచేతనలో నీ జ్ఞాపకాలు మెదులుతాయి. సర్వీ చెట్టు గాలి తాకిడికి చేసే శబ్దంలో విషాదం గూడు కట్టినట్లు, భగ్న ప్రేమికుని మూగ వేదనలా ఈ సృష్టి అంతలో తాను వొంటరిగా మిగిలి వోయిన వూహ కలిగిస్తుంది.

'ది కాంక్వెస్ట్ ఆఫ్ హాపీనెస్'లో రసెల్ అంటాడు. 'జీవితంలో విఫలమైన కోరికలు కాలగతిలో మధురస్మృతులు అవుతాయని. ఈ ప్రతిపాదన విచిత్రంగా వుంది కదూ....'

**లలిత లలితంగా వుండే కృష్ణశాస్త్రిగారి వచన శైలిని అనుకరించాలనే చాపల్యమే ఈ ప్రయత్నం.**



వసంతా!

కోరికలు పరుగులెత్తడమూ, బిడియం పగ్గాలు వేయడమూ వీటి మధ్య మనసు నలిగిపోవడమూ అందులోనే ఆనందం వుందేమిటి చెప్మా?

ఆమె అందచందాలను కనులతో ఏతం వేసి యే జామి గుబురు వైపుకో జాలు చేయాలని చూస్తానా - గట్టుతెగిన వాగులాగు తోటంతా అందాల వెల్లువ! గాజుల రవళికీ, నవ్వుల గలగలకీ తేడా వొకందాన తెలియదు. ఆ నవ్వులు అలాగ కదలి ఏటి కెరటాల మీదుగా సాగి, కోటి పారిజాతాల బరువైనా గుండెల రేవు చేరుకోవడం యెలాగ భరించానో?

గాలి పల్లకి మీద సాగిపోయే గోరింట పరిమళం ఆమె వునికిని చెప్పేసి వెళిపోతుంది. బోయీల్లాగ తుమ్మెదల హడావిడి - మాట చెవిని పడనిస్తేనా? అల బృందావనంలో పొగడ నీడన కృష్ణస్వామి కోసం నిరీక్షించే రాధలాగ, పున్నాగలన్నీ గుట్టగా ఒక చోటే రాలినట్టు ఆమె కూర్చుని

వుంటుంది. పైరగాలి కొంటెతనాన్ని పసిగట్టి మావిచిగురుల చిరుగుల మాటునుంచి జారిన వెన్నెల తునక ఆమె పైటచెరగులా అమరినపుడు - నా కనులకు తిరునాళ్ళుకాక మరేమిటి?

ఉప్పాడ జరీపైట మడతల నుంచి కొసరి గుబాళించే వలపు తలపులు - ఒక తీయని చక్కదనం ఆమె కనుల్లోంచి జారి మలయానిలంలాగు వొడలంతా ఆక్రమించడమూ - ఇవేమీ పట్టనట్టు సంజెపొద్దు బద్ధకంగా వొళ్ళు విరుచుకోవడమూ - నన్ను వంటరివాణ్ణి చేసి వేధిస్తాయి. పొదరిల్లు, పున్నమి వెన్నెల కోటి కోర్కెలు నిండిన హృదయభారంతో నేను - ఆమె కూడా వుంటె యెంత బాగుండేది? ఆమె ఎవరో కాదు సుమీ. మీరె!

నాకు అట్టే తెలియదుగాని మా నండూరి, బసవరాజు అయితే ప్రేమ తత్వాలు బాగా పాడగలరు. నా మోజు అంతా గిరిజాల మీదే గాని బసవరాజు కవిత్వం మీద చూపుతాడు. మా నండూరి సరేసరి!

**(దేవులపల్లికి జవాబు రాదు. వారి విరహగీతాలు తర తరాల తెలుగువారికి కావాలి కదా!)**

శ్రీశ్రీ గారి వచన శైలిని అనుకరిస్తూ వారు ప్రేమలేఖ రాస్తే యెలా వుంటుందో వూహిస్తూ-

మధురవాణీ!

ఆరోజు బ్రాడ్వేలో నువ్వు వెళ్తుంటే రేసు గుర్రం రోడ్డున పడ్డట్టు అన్పించింది. అప్పటికప్పుడే నీకు మూడు ముక్కల వుత్తరం కూడా రాసిన జ్ఞాపకం.

నువ్వు నా ద్వంద్వ పైఖరిని నిరసిస్తున్నట్టు యీ మధ్యనే తెలిసింది. నా అదృష్టం కొద్దీ యీ దేశంలో నాకు మిత్రుల కంటే శత్రువులే యెక్కువ. ఆ వర్గంలో మీ నాన్నగారు వున్నా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. అసలు విషయం చెబుతాను విను. శ్రీ శ్రీ బాగున్నదాన్ని దేన్నైనా మెచ్చుకునే సహృదయుడు. అంత మాత్రం చేత మరెవర్నో కూడా ప్రేమిస్తున్నానని, ద్వంద్వ పైఖరి అని నన్ను అనుమానించడం తెలుగుదనం తప్ప మరొకటి కాదు.



నన్ను ప్రేమించనందుకు చింత కొంతే కాని మీరు సందు చివర విశ్వనాథాన్ని అభిమానిస్తున్నారని విని చింతించాను. చిలకముక్కుకి నేరేడుపండులాగ విశ్వనాథాన్ని మిమ్మల్ని పక్క పక్కన వూహించుకుంటే మీమీద జాలి వేస్తోంది. అణా అప్పుచెయ్యడం కూడా చేతగాని విశ్వనాథం నిన్ను వుద్ధరించలేడనేది మాత్రం స్పష్టంగా చెప్పగలను. జాలిపడే నాలాంటి వాళ్ళను మన సమాజం నమ్మదు. ప్రేమలు, రాజకీయాలు, రైళ్ళు, బస్సులు అన్నీ కలుషితమై పోయిన మన దేశంలో నమ్మకానికి చోటు లేదు. అది ఏ హిమాలయ శిఖరాగ్రసానువులోనో నక్కింది. చైనా దేశంలోకి జారిపోయిందేమో నని కూడా నా సందేహం...

**(శ్రీశ్రీకి అసలు జవాబుతో పనిలేదు.)**

మోహనప్రసాద్

---

**సరియలిస్టుకవి వేగుంట మోహన ప్రసాద్ గారు అధివాస్తవికంగా ఆలోచిస్తారు. ప్రేమలేఖ అయినా అలాగే రాసి పారేస్తారు. పేరుగాని సంబోధనగాని వుండదు - సరాసరి సంగతిలోకే-**

"అట్లా అని పెద్ద అందమూ లేదు. కింగ్స్‌వేలో క్లియోపాట్రా లాగా కనుపించి యెక్కడ దాక్కున్నావోగాని నేను మాత్రం టెలిఫోన్ రిసీవర్లన్నీ వెదికాను. టెలివిజన్ తెరలోగానీ, ఫ్లూరసెంటుబార్‌లోగాని వొదిగిపోయావా!



రేపటి సాయంకాలం నా ముక్కుపుటాలు నిన్ను చూసినపుడు నా కళ్ళు సౌందర్యాన్ని ఆఘ్రాణించి ఫోమ్‌బెడ్ మీద మూర్ఛపోయాయి. నువ్ నడిచిన దారినిండా పడిపోయిన ఉదారంగు కలల్ని గుప్పిళ్ళనిండా తీసుకొని జేబులో కుక్కుకొని వాటి బరువుతో నడవలేక రిక్షా యెక్కి వెళ్ళిపోయాను.

నువ్వు కాదన్నా - దమయంతి, ద్రౌపది, కీలర్, హెలెన్... యెవరు కాదన్నా బాధలేదు. జీవన దుఃఖతంత్రుల్ని పూల రెక్కలతో చీల్చేసుకుని ఎయిర్‌పోర్టులో రన్‌వే మీద నా సమాధిని నేనే కట్టుకుంటాను. బోయింగ్ జెట్, ఏవరోన్, ఏదయినా నా మీంచి ఎగరాల్సిందే. ఆఖరికి బోదలైరూ, బ్రెజ్నెవ్ అయినా-

కళ్యాణం తంతు నానేనా... నీ గాజుల గలగలలో డికెన్స్‌కి నిద్రాభంగం తప్పదు. అనుకున్నట్టే నక్షత్రం నన్ను పొడిచేసి పసిపిల్లలా

చేతులు కడుక్కుని వెళ్ళిపోతుంది పాతాళానికో - అనంతాకాశానికో - పొగ మంచు మెట్లమీదుగా పండరి భజన చేసుకుంటూ వెళ్దాం బదరీగాని, పిట్స్‌బర్గ్ కాని, అక్కడ దేవదారు చెట్లమీద యీతలు కొడతాను నేను..."

1 రాజవీధి

2 ట్యూబ్‌లైటు

3 హిందూ వివాహమంత్రం.

**(ప్రేమ భావంతో కాక పోయినా లేఖ అర్థం తెలుసు కోవడానికైనా ఆమె రాక తప్పదు. అప్పుడు చెబితే తెలుస్తుంది. యిది ప్రేమలేఖ అని.)**

*చలం*

**చలంగారు ముక్కుసూటిగా రాస్తారు. వారు ప్రేమలేఖ ఇలా వుండవచ్చు.**



నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసు ఇప్పటికే నీ అందచందాలను అంగాంగసుందరంగా వర్ణిస్తూ చాలామంది ప్రేమలేఖలు రాసేసి వుంటారని. అందమైన ఆడది కనపడగానే కలాలు స్ఖలిస్తాయి. యీ దేశదౌర్భాగ్యం నాకు బాగా తెలుసు. ప్రేమకూ, కామానికీ మధ్య ఇనుపతెర వుందని వాళ్ళు పైకి

చెబుతారు. అదంతా పోజు, వాళ్ళ దృష్టిలో ప్రేమంటే కామమే! ఆడదాన్ని చూడగానే వాళ్ళకు గుర్తొచ్చేది నల్లులు తిరిగే పందిరి మంచం. పిడచలు గట్టిన పాత పరుపూ మాత్రమే. గుర్తుంచుకో.

అందని ద్రాక్షపళ్ళు పుల్లన- అందుకే మన దేశంలో శృంగార కవిత్వం కొండలా పుట్టి పెరిగింది. చలం చెబితే బూతూ, గీత గోవిందం కాదు. మలిన శృంగారం, అమలిన శృంగారం అని సబ్బుల్లోలాగా రక రకాలుగా యేం లేవు. వీళ్ళ హిపోక్రసీ లోంచి తయారైనవే యివన్నీ.

ఎలిజా! జీవితంలో సుఖాలు, వాటి అంచులు చూడాలంటే చలంతో రా, పడకగది బాత్‌రూము తప్ప మరొకటి తెలియని వాళ్ళతో...

**(మరీ యింత సూటిగా రాస్తే ఎలా చలం గారూ!)**

*కరుణశ్రీ లేఖశ్రీ*

---

**కరుణశ్రీ గారి కవితాకన్య అట్టే లోతులకు పోకుండా అలా పూలనావలా, పైపైన తేలుతూ సాగుతుంది. అందరికీ అందుబాటులో వుంటుంది. కరడుగట్టిన కారుణ్యం, భావనలో లలిత లలితమైన భాష వీరి కవిత్వంలో కనిపిస్తాయి.**

ప్రియశ్రీ,

నిన్ను చూచిన ఆ మధురక్షణం - నా యౌవన సీమకొక సువర్ణ సుప్రభాతం. వలపు తలపు తీయని పిలుపుగా నా ఎదతలుపు తట్టింది. కల్యాణ కల్పవల్లిగా ముస్తాబై ముంగిట నిలిచింది. నీ మా సన్నాయి పాట. నీ పలుకు సృష్టికే కులుకు. నీ రూపం నేత్రపర్వం. నా జీవితాన అది ఒక మధుర పర్వం.



ఉదయమే లేచి నీకోసం నిరీక్షిస్తూ పూల తోటలోకి నడిచాను. నీ చెలికత్తెలు - పూలబాలలు నన్ను చెలకట్ట నిస్తేనా!

'ఎవరికోసం?' అని నిగ్గదీసింది జూకామల్లె. 'కుమారి అసలే సుకుమారి. గాఢంగా ఎదురుచూస్తే కందిపోగలదు సుమా!' అని మందలించి కిలకిలా నవ్వింది నందివర్ధనం-

"నీ చెలి చెక్కిలి నొక్కాను నేను" అని వుడికించింది గులాబి. "నేనూ" - అన్నది ముక్తసరిగా ముద్ద మందార. ఆమెకు నాసికగా అమరింది నేనంటూ, సన్నాయి నొక్కులు నొక్కింది పున్నాగ. పెదవుల కెంపుదనం తామే అన్నట్టు మౌనముద్రలు దాల్చాయి మంకెనలు.

ఎంతకూ రాని నీకై చూచి, చూచి నిట్టూర్చి పచ్చగడ్డి తివాచీపై మేను వాల్చాను. "నీ ప్రేయసి పదములకు పారాణి దిద్దింది నేనే" అని గుసగుసలు చెప్పింది చిన్న గరికెపువ్వు. హిమస్నాత మాధవీలత నీవె తానైనట్టు వొక్కసారి వొళ్ళు విరిచింది.

**(ఇలా సాగే కరుణశ్రీ ప్రేమలేఖకు జవాబు వచ్చే సంగతి ఎలాగున్నా - ఆ ప్రియశ్రీ పదేపదే పాఠంలాగా చదువు కోవడం మాత్రం ఖాయం.)**

*సంజీవదేవ్*

---

**సంజీవదేవ్ గారి సొంత శైలి, తార్కిక చింతన ప్రేమలేఖలో కూడా ప్రతిఫలిస్తాయనే అనుకుంటా-**

సుచరితా!

మీ లేఖ అందలేదు.

వాస్తవ జగత్తులో రాసిన లేఖలు మాత్రమే అందుతవి, రాయని లేఖలు సైతం అందుతవి అవాస్తవిక జగత్తులో! వ్రాయబడిన లేఖలు అందడం ఎంత సహజమో, వ్రాయబడని లేఖలు అందక పోవడం కూడా అంతే సహజం.

మిమ్మల్ని చూడాలన్న ఔత్సుక్యం మిమ్మల్ని చూచాక అభివ్యక్త పరచలేని అభీష్టంగా రూపాంతరం చెందింది. అందుకే దూర ప్రాచ్య కవిమార్మికుడు యోన్‌నొ గూచీ అంటాడు.

"దూరంగా వుండే ప్రీతి పాత్రమైన వస్తువులు స్పర్శనీయతను కూడా కలిగి వుంటై" అని - ముక్త గగనం క్రింద మీరు నడిచి వెళ్తున్నప్పుడు నా మానస కాసారంలో ఎన్నో రస రూపాలు కదిలేయి. పృష్ఠ భాగంలోని ప్రాకృతిక దృశ్యం శారదీయ స్వచ్ఛధావళ్యానికి ప్రతీకగా, అమల చిహ్నంగా గోచరించింది. బాహ్య సౌందర్యం రమ్యమైనదే. కాని ఆంతరిక సౌందర్యం రమ్యతరమైనది. అలాగే ప్రేమించడం మధురమైనదే. సందేహం లేదు. ప్రేమించబడడం మధురతరమైంది, ప్రేమించడం గొప్పదా, ప్రేమించబడడం గొప్పదా అంటే నిజానికి రెండూ కూడా గొప్పవే, ప్రేమించేవారు ప్రేమించబడినప్పుడు; ప్రేమించబడేవారు ప్రేమించినప్పుడు మాత్రమే ప్రేమ సఫలత చెందుతుంది. ప్రేమించేవారు ప్రేమించబడకపోయినా, ప్రేమించబడే వారు ప్రేమించకపోయినా కూడా సాఫల్యత శూన్యం - ఆదాన ప్రదానాలు హృదయాల మధ్య..."



**(దీనికి జవాబు రావడం యెంత సహజమో రాకపోవడం కూడా అంతే సహజం.)**

**శేషేంద్ర శర్మ గారిది తెలుగులో కొత్తబాణి. ఆయనదొక ప్రత్యేకవాణి. వారు రాసే లేఖ వచనకవితలాంటి గద్యంలో సాగితే యిలా వుండచ్చు-**

కాదంబరీ!

నాటి ప్రత్యూషంలో క్షణక్షణమూ నీవే అయి పరిస్పందిస్తున్నప్పుడు- నా హృదయ కుహరంలో లార్క్‌పాడిన పాటను మొహమల్ తివాచిగా పరిచాను నీ కోసం.



నీ రూపం సోకి నా మనసు ముక్కలై వడగళ్ళను వర్షిస్తోంది. ఉద్యానంలో రాలిపోతూన్న లిల్లీలు నా గుండెలోకి జారిపడే పిడుగులు! గుప్పెడు గుల్ మొహార్‌లు నీడలు నా తాపాన్ని చల్లార్చలేక ఆవిరులై దిగంతాలకు పారిపోతున్నాయ్-

చిట్లిపోయిన ఊహల్లోంచి స్రవిస్తున్న అశ్రువులు చెంపల్ని జలపాతాలు చేసి, పాదపీఠాన్ని నిర్దాక్షిణ్యంగా కోసేస్తున్నాయి - కోమల విషాదాన్ని భరిస్తూ, నీ సౌమ్యశాసనం కోసం బానిసనై నిలబడ్డాను...

సాగరగర్భంలోంచి చీల్చుకు వస్తున్న ప్రతి కెరటపులయలోనూ నీ రూపాన్ని దర్శిస్తున్నా - విచ్చుకుంటున్న ప్రతి పువ్వు చేసే రెక్కల సవ్వడిలోనూ ఆ సీమ చైతన్యమూర్తిని వీక్షిస్తున్నా -

వేకువలో నీ లావణ్యాన్నిపాటలోకి తర్జుమాచేసి నా కళ్ళకు విన్పిస్తుంది, చిన్న పక్షి ఘోషించే కోటి జలపాతాలను భరిస్తున్న నన్నాపాట సముచ్చకితుణ్ణి చేస్తుంది. నీ పదధ్వనుల్ని దోసిళ్ళలో గ్రోలి, నీ దరహాసాలను చూపుల చెమ్కీదారాలతో దండలల్లి హృదయ గవాక్షానికి తోరణం కట్టాలని వుంది -

కాదంబరీ! నీ రాక ఎప్పుడో? నీకోసం నిరీక్షిస్తూనే వుంటా- మృత్యువుతో కబురంపినా చాలు...

**(లేఖ చదివాక మనసు దూదిపింజలై తేలిపోతుంది - జవాబు మాట యెలా వున్నా)**

## *ఆస్థానకవి ప్రేమలేఖ*

---

**ఉర్దూ పారశీక భాషలు తెలిసిన ఆస్థానకవి దాశరథి. ఆయాభాషల్లోని శృంగార రసాన్ని ఇంకించుకున్న కొద్దిమందిలో దాశరధి ముఖ్యులు. అంగారం, శృంగారం కలసికట్టుగా కవిత చెప్పగల దాశరథి గారి ప్రేమలేఖ వూహామాత్రంగా-**

మంచెమీద నుంచి పరిగపిట్టల్ని కసిరే దానా!

విసిరే వడిసెలలో రాళ్ళు పెట్టావో పూలే తురిమావో తెలియదు కాని దెబ్బతిన్న నా గుండె విలవిల లాడుతోంది. గూపులు వేసే చూపులు అలుపు వచ్చి మంచె మీదే ఆగిపోయాయి. ఏ విసురులో నైనా నీ గుండెను గిరాటు వేస్తావనే ఆశతో మంచె దగ్గరే పొంచి వున్నాను.



నిన్ను చూడగానే అనుకున్నాను - ఏ పారశీక కవో వూహించి రచించిన గజల్‌వి నువ్వే అయివుంటావని. ముషాయిరాలోంచి తప్పించుకు వచ్చిన కవిత పాదపంక్తిపైనా అయివుండాలి. ఒక్కసారి మధుమాసం విలాసంగా నా గుండె గుమ్మంలో పల్లకీ దిగిన అనుభూతి కోటి పారిజాతాలు మానసోద్యానంలో ఘల్లున వెల్లివిరిసిన అనుభవం. అవి ఒంటరిగా మోయలేనంత బరువు.

కవితాగారం గల యీ షరాబు, నేడు నీ మ్రోల గోరంత ప్రేమను అర్థిస్తున్న గరీబు. సఖీ! నీవు సాకివి, నీ కన్నులు మధుపానపు గిన్నెలు, నా ఎద కారవాన్ సరాయి. అయితే యిక నేను నవాబునే సుమీ!


నికుంజం వుంది, ఒత్తిల మెత్తని పూలపాన్పూ వుంది, గుండె నిండుగ ప్రేమ సుధారసమున్నది. నీవు కూడా వుంటే చెలీ! యిక

లేనిదేమున్నది? రూపు రేఖలు పసిగట్టాను గాని నీ విలాసమే తెలియకున్నది రాణీ!

**(ఇంతకీ ఆ విలాసవతి విలాసం తెలియదు యీ కవిగారికి, ఇక జవాబు ప్రసక్తి యేల?)**

*ఫిలిం క్రిటిక్ ప్రేమలేఖ*

**వీరికి కూడా వొక ప్రత్యేక బాణీ వుంది. సినిమా ప్రపంచంలో ఏదైనా కమనీయ దృశ్యకావ్యంగానే కనిపిస్తుంది. ఆ విధమైన తాత్వికచింతన వీరికి వృత్తిలో పెట్టిన విద్య.**



కుమారి చిత్రాంగి.

అభినందనలు.

ఇటీవల థియేటర్‌లో మిమ్మల్ని చూసిన సన్నివేశం మర్చిపోలేనిది. మొహంలో చక్కదనం , అణువణువునా కోమలత్వం కలిగి

ప్రతి ఫ్రేములోనూ కమనీయదృశ్యకావ్యంలా, రంగుల హరివిల్లులా వున్నారనడం అతిశయోక్తి కాదు.

ముఖ్యంగా మీరు రిక్షాటేరం చేసిన సంఘటన నా మనస్సుపై చెరగని ముద్రలు వేసింది. అది ఈ ప్రేక్షకుని హృదయంలో తొలకరి పూలజల్లు. మాటలు సందర్భానికి అనుగుణంగా వున్నాయి. మీరు ధరించిన దుస్తులు మీ రూపానికి తగినట్టు వున్నాయి. మీ అందచందాలు ఆడుగడునా ద్యోతకమైనాయి. అందం, ఆనందం, హుందాతనం సమపాళ్ళలో మేళవించుకున్న మిమ్మల్ని సకుటుంబంగా ప్రేమిస్తున్నాము - మిమ్మల్ని కన్న మీ తల్లిదండ్రులు నిజంగా అభినందనీయులు.

**(లేఖకు కొత్త సినిమా ఫ్రీపాస్ జత చేస్తే ప్రయోజనం వుండవచ్చు.)**

*ప్రేమాయణరెడ్డి*

---

**డాక్టర్ నారాయణరెడ్డి గారి గద్యం కూడా పద్యంలాగే యతిప్రాసలతో సాగుతుంది. వారు ప్రేమలేఖ వ్రాసినా కవిత రూపే ధరిస్తుంది. మరోలా వూహించడం అసాధ్యం. అందుకే యిలా-**


(ప్రేయసికి ప్రేమ లేఖ రాద్దామని అలవోకగా రచించినది)

మధుర రసైక ధారావాహినీ!

నమస్తే! నమస్తే! ప్రియసఖీ! నేనే, నేనే నారాయణరెడ్డిని, కవిని, రవిని -నిను కోరే ప్రియుణ్ణి.

నీచూపులు వలపు సేతువులు

నీ రూపులు రామప్ప శిల్పాలు



అక్షరవసంతరాయల్ని నేను

నీలో లకుమను చూచాను

మన ఇరువురి అనుబంధం

కావాలి నవ నవ్య ప్రణయ ప్రబంధం

మరో హరివిల్లు సృజించాను

విపంచిగా సప్తవర్ణాలు పలికించాను

నారిలేని వెలితి వేధించు నను

వెలదీ! హరి వింటి నారి నీవె!

పొదరింటి... ...

**(ఈ లేఖకు జవాబు రాదని రాయడానికి కలం కదలలేదు)**

**ముళ్ళపూడి వెంకటరమణ గారు పుట్ల కొద్దీ రచనలు వండివార్చ లేదు. వేళ్ళమీద లెక్కించాలన్నా వేళ్ళు మిగిలిపోతాయి. ఆ రాసిన కాసినీ వేళ్ళు పాతుకుని తెలుగు మాగాణంలో ఏటేటా ఎడిషన్ల కాపులు కాస్తూనే వున్నాయి. ఇంకో తరానికి కూడా వాటి రుచులు అందుతూనే వుంటాయి. ముళ్ళపూడి వారు ఆయురారోగ్యాలు గల పాత్రలను సృజిస్తే, అవి స్రష్టను అనుక్షణం గుర్తుంచుకునేలా నేటికీ ప్రవర్తిల్లుతున్నాయి. అందుకే ముళ్ళపూడి వారు కొత్తగా రాయకపోయినా (సినిమా మాట కాదు) ఆయన ఎప్పటికప్పుడు కొత్తగా రాసినట్టే వుంటుంది. వారి ఏ రచన ఎప్పుడు చదివినా ఆయన సృష్టించిన భూమికలన్నీ రోజు రోజూ మనకు కనుపించి మనల్ని పలకరించి వెళుతుంటాయి. ఆయన కలం పట్టుకుని జీవం పోసిన వాటిలో అప్పారావు, గిరీశం(మళ్ళీ పుట్టాడు), రాధ, గోపాలం, బుడుగు ఇవికాక సుబ్బారావు, గుర్నాధం, వీర్రాజు ఇలా ఎందరో...? ఇంకా చక్రవర్తి, జానికమ్మ, నరసమ్మలాంటి జనతా ఎక్స్‌ప్రెస్ ప్రయాకులు కోకొల్లలు.**

తెలుగులో వాడుకభాషను మరోసారి వడగట్టి నిగ్గుతేల్చిన ఘనత వెంకటరమణ గారికే దక్కుతుంది. సాధారణంగా చెయ్యితిరిగిన ప్రతి రచయితకు ఒక స్వంత శైలి అలవడుతుంది. కాని ముళ్ళపూడి వారు పాత్రోచితంగా శైలిని సాగించారు. గిరీశం ధోరణికీ, అప్పారావు మాటతీరుకీ,

బుడుగు భాషకూ, గోపాలం మాటలూ, రాధమ్మ పలుకుకీ సంబంధం వుండదు. ఏనోట పలికించాల్సిన మాటను ఆ తీరులో ఆనోట పలికించి సాహిత్యంలో సరికొత్త అవధానాన్ని చేశారు వారు చెప్పదలుచుకున్నవన్నీ సృష్టించిన పాత్రలచేతనే చెప్పించారు. చెప్పవలసిన అంశాన్నిబట్టి పాత్రను సృజించుకున్నారు.

విభిన్న తత్వాలు, మాటతీరుగల కొన్ని ముళ్ళపూడి వారి భూమికలను ఈ పేరడీకి స్వీకరిస్తున్నాను. సరాసరి వెంకటరమణగారి ప్రేమలేఖ ఎలా వుంటుందో వూహించి రాయడం కష్టసాధ్యం అనిపించింది. అందుకని వారి రచనల్లో తారసపడే కొందరు వ్యక్తుల ప్రేమలేఖలు ఎలా వుంటాయో అనుకరించాలని ప్రయత్నం-

### *హలో! ఓ ప్రేముందా?*

అప్పారావు సర్వాంతర్యామి. గొప్పవేదాంతి. వొడుపుగల రుణవేత్త కూడా. సమస్త విషయాలను అప్పు మీదకు మళ్ళించి మానవుల దగ్గర మాత్రమేగాక పశుపక్ష్యాదుల వద్ద సైతము అప్పు పిండగల వుద్దండ పిండము. అప్పారావుని ముందస్తుగా మనం యిప్పుడు వదిలించు కోపోతే -"హలో! ఓ పైవుందా"? అని మన మీద విరుచుకుపడే ప్రమాదం వుంది.

అ-ఋణగారికి,

ఋణాభినందనలతో-

మిమ్మల్ని చూడగానే అయిదు రూపాయల నోటు మీద జింక బొమ్మ ప్రాణం పోసుకుని అలా గెంతుకుంటూ వచ్చినట్టు అయింది. మీ చూపులు విచ్చు రూపాయలు. మీ ముక్కు బ్లాంకు చెక్కు. మీ మొహం మూడు సింహాల మొహర్. మొత్తంగా మిమ్మల్ని చూసినపుడు వెగటు పుట్టేంత అప్పు దొరికినట్టు అయింది.



చూడగా చూడగా యీ ప్రపంచమే ఒక పెద్ద ఋణవలయంగా తోస్తుంది. ఇచ్చి పుచ్చుకొనేవి యీ వలయంలో రెండేరెండు. మొదటిది అప్పు, రెండోది ప్రేమ. యీ అప్పారావు ఎన్నడూ మొదటిదాన్ని తప్ప మరి దేన్నీ ఎవడ్నీ బదులుగానైనా అడిగెరగడు. ప్రేమ కూడా అప్పు లాంటిదే! నిలవున్న కొద్దీ పెరిగి పెట్రేగిపోతుంది మరి. లేఖ రావడం ప్రేమకు సంబంధించినదైతే, లేక రావడం అప్పు సంబంధికం. ప్రేమలో అప్పులో లేని సౌలభ్యం వొహటుంది. అప్పు లేదనవచ్చు. కనుక మీరు

లేదనడానికి అప్పు కాదు. నా ప్రేమను కాదనేసి అప్పు ప్రాప్తమనోహరిగా మిగిలిపోవడం అరుణా! మీకు భావ్యం కాదు.

గంగాభాగీరధి మీ బామ్మగారిని ఒప్పించే బరువు భాధ్యతలు నేనే తీసుకుంటాను. మీరు సరే అంటే అరువు ముందుకు వేస్తాను. మన పెళ్ళి సందర్భంగా పదిమందికీ ఋణగ్రస్తుణ్ణి అయ్యే అవకాశం యిప్పించండి. ప్రస్తుతం కవరుకు స్టాంపులు అంటించలేదు. అది చెల్లించి స్వీకరించి నా లేఖను విముక్తం చేసుకోండి.

**(అప్పారావు లేఖని ఇంతటితో ఆపకపోతే యిది అప్పువైపు దారి తీసే ప్రమాదం వుంది)**

## *ది గ్రేట్ లౌలెటర్*

**గురజాడవారు సృష్టించిన 'గిరీశం' ముళ్ళపూడి వారి చేతిలో పునర్ యవ్వనాన్ని సంతరించుకున్నాడు. లెక్చర్లకు అలవాటు పడిన గిరీశం ప్రేమలేఖ ఇలా సాగుతుంది.**

మిస్ బుచ్చెమ్మ.

లెటర్ రాయమంటే - ఓ యిటీజ్ కంప్లీట్లీ ఔట్‌డేటెడ్. లౌ అండ్ ఇట్స్ నేచర్ మీద ఓ ఘంట లెక్చరిచ్చేద్దును గాని మన టెలుగూస్‌కి కొన్ని ఫార్మాలిటీస్ అఘోరించాయి కదా! పోతే వదినా! మీకిక్కడ వో విషయం



చెప్పాలి. ఎప్పుడూ యీ గిరీశం లోక కళ్యాణం కోసం అంటే వరల్డ్ మారేజ్ కోసమే కంకణం కట్టుకున్నాడుగాని సొంతానికి వో సారయినా కట్టుకున్నాడు కాదు మీరు డేరింగా - డార్లింగ్ అంటే యిహ పెళ్ళివిషయమంటారా దొరల ఫాయలాలో లాగించేద్దాం. అయితే ప్రేమను గురించి మీకిక్కడ నాలుగు ముక్కలు చెప్పకపోతే సందర్భం వదలి చెపాయించినట్టు అయిపోతుంది. మీరు కొసాకి చదివాక నచ్చకపోతే గుగ్గిలం వేసుకోండి. గిరీశం అక్షరం నిప్పుల్లో వేసినా ఘుమ ఘుమలాడుతుంది. చర్చిల్ మహాశయుడు చచ్చి ఏలోకాన వున్నాడో - 'నీ లెటర్స్ వుంటే లంక పువాకు బలాదూరోయ్' అనేవాడు. అసలీ ప్రేమలేఖలు డిక్టేషనుకి వొదగవుగాని లేకపోతే పూటకొహటి దంచెయ్యకపోయానా'. టెంథౌంజెండ్ బ్రెయిన్సు, ఇరవై వేల చెవులూ వున్న సభలలో లెక్చర్లివ్వడానికి నోరు తిరిగిన వాడికి ఆఫ్టాల్ వొక్కరు చదువుకునే వుత్తరం ముక్క రాయాలంటే డామిట్... చెడ్డ చిర్రెత్తుకొస్తుంది. సీమ దొరలకి సంతాప సందేశాలు రాసిపెడితే ఆ భాషా అదీ చూసి బట్టీయం పెట్టేవారు. బతికుండగానే అబిట్యురీలు రాయించుకుని చట్రాలు కట్టించుకున్న దొరలు యింకా బతికే వున్నారు. కావాలంటే సాక్షీకం యిప్పించేగల్ను. నా ప్రేమ వ్యవహారం, కచేరీ

వ్యవహారంతో జతచేసి మీ నాన్నతో మాట్లాడగలను. ఆయన మనసు మీ మనసులాగా మెత్తన కాదు చూశారూ. తొందరగా నాటుతుందని అనుకోను. బ్రదరిల్లా వెంకటేశం మన ప్రేమకు అంబరిల్లా లాంటివాడు. సిగార్స్‌కే కాపర్స్ కొరత వుండగా తపాలు ఖర్చులకు ప్రతిసారి ఠస్సా వెయ్యాల్సి వస్తోంది.

**(ఏమిటి నా లెటర్సన్నీ కచేరీ నుంచి వచ్చాయని మీ నాన్నకు యిచ్చావా? డామిట్ ప్రేమ అడ్డం తిరిగింది.)**

*లేఖాగోపాలం*

---

**ముళ్ళపూడివారి మరో విలక్షణమైన సృష్టి గోపాలం. మధ్య తరగతి ఐడియాలూ, ఆశలూ అతనిలో వుంటాయి. గోపాలాన్ని పెళ్ళి కాకముందే మనకు పరిచయం చేసి, తండ్రి అయ్యేదాకా చూపిస్తారు రచయిత.**

రాధా!

నిజంగానే నీకు వినిపించేంత దగ్గరగా వచ్చి 'ఏయ్! పిల్లా' అనేసి అప్పటిచూపుల్లో కలికితనాన్ని, కసురుకొనే గాజుల చప్పుళ్ళనీ జాగ్రత్తగా జేబులో వేసుకుని చక్కా వచ్చేద్దామన్పిస్తుంది. జేబు ఎప్పుడూ గుండెమీదే వుంటుంది.

కనుక జేబులో భావాలు అలాగ్గా గుండెల్లోకి చేరి పోతాయి.



చామనచాయ నీకు ఎంతగా నప్పిందో నాకు తెలుసు. సృష్టించిన భగవంతుడికి తెలుసు. చామంతులు, మరువపు రెమ్మలు కలిపికట్టిన చెండు అచ్చం మీ చాయలోనే వుంటుంది. నాకింకా బోలెడు రాయాలని వుంది. అంటే -"నువ్వు దూరంగా మలుపు తిరిగిన గోదారిలా వినిపించీ వినిపించని పిల్లంగ్రోవిలా, చిగురించిన మావి కొమ్మలా, కన్పించని పిల్ల గాలికి కదలాడే జాజిరెమ్మలా వుంటావనీ - నువ్వు నవ్వినప్పుడు కన్నుల్లోంచి జారిన చక్కదనం చెక్కిలిమీద నొక్కుల్లో చిక్కుకుంటోందనీ, జడ ప్రత్యూషచ్ఛాయలో సాగిలపడి నీ నీడ నీ మీదే పడ్డట్టు వుందనీ నీముఖం అందానికి నిర్వచనంలా వుంది స్మీ - కోవెలలో నీ వదనం చూడగానే హారతి, పువ్వులూ గుమ్మంలోనే ఎదురైనట్టు తోచిందనీ"- యిలా యింకెన్నో రాయాలని వుంది. కాని నువ్వు నన్ను పొగడుబోతు అనుకుంటావని ఆ ప్రయత్నం వాయిదా వేశాను.

నువ్వు కవిత్వంగా అనుకోపోతే - మొన్నటికి మొన్న మిరప్పండు రంగు చీరె కట్టుకొని నువ్వు పడవలో కొసంటా జరిగి కూర్చుంటే బొమ్మ

పొలాల పండక్కి అరటి దొన్నెలో వదలిన దివ్వెలాగున్నావు. బామ్మంటే జ్ఞాపకం వచ్చింది. - మా బామ్మ "ముక్కూ మొహం తెలిసిన పిల్లని చేసుకుంటే మంచిదని" మళ్ళీ మళ్ళీ చెబుతోంది. మరి ముక్కు మొహం తెలిసిన పిల్లలు మీరు తప్ప ఇంఖెవరూలేరు. కదండీ...

**(ఇందాకా రాశాక గోపాలం తెగ సిగ్గు పడిపోయాడు.)**

## *బుడుగు రాతలు*

**బుడుగు ఒక గడుగ్గాయి. ప్రపంచంలో ఈ సైజు పిల్లలకు ప్రతినిధి. పిల్లల్లో పెద్దగా, పెద్దల్లో పిల్లగా వుంటాడు. జట్కా తోలాలని, వింజను నడపాలని కుతూహలం. బుడుగుకి కూడా చిన్ని ప్రేమించే హృదయం వుంది.**




సీ గాన పెసూనాంబలుగారికు,

ఇది లౌ లెటరు రాస్తున్నాన్నమాట, బాబాయి ఇచ్చిరా అంటే రెండు జెళ్ళ సీతకి ఇచ్చానే అలాంటిదన్నమాట. బాబాయికి కూడా కుంచెం రాయటం వచ్చునుకో. నేను వచ్చినంత కాదనుకో, అయినా నేనేం చిన్న వాడినా! లేకపోతే చితకవాడినా!

నీ కసలేం రాదుకదా! నీకు బాహ్ రావటం కోసం కుంచెం కుంచెం రాస్తాను. లేపోతే బోలెడు ఇంకా చాలా రాసేయగలను.

లౌ లెటరు అంటే ప్రేమించుకోవడంట. బాబాయి చెప్పాడు. నాకు తెలియదు అనుకో.

బామ్మ రామకోటి రాస్తుంది ఏమీ తోచక, బాబాయి లౌ లెటరులు రాస్తాడు. బాబాయికి పని దొరకలేదుట కదా. ఇలా అని నాన్న అన్నాడు. అయినా పని దొరుకుతుందేమిటి? గోళీలు అయితే దొరుకుతాయి గాని.

బామ్మ బొత్తిగా మతి మరుపుమనిషి. అట్లాఅని బామ్మే అంటుంది. అంటే మనం ఓకులు బొత్తిగా పెడతామె అట్టా అన్నమాట. మర్చిపోకుండా రాసిన మాటే సాయంఖాలందాకా రాసుకుంటుంది. అందుకని రామకోటి అంటారు దాన్ని.

అంమ ఏమీ రాయదు. అంమకి, పాపం గుడింతాలు కూడా రావు. అందుకని రోజు నాన్న తలకి బొబ్బర్నూనె రాస్తుంది. నేను వద్దన్నా "ఊహు" వినదు. ప్రైవేటు చెప్పి అయినా రాస్తుంది. పాపం చదువు రాదుకాదా అందుకని నేను వూరుకుంటాను.

ప్రేమ గుడ్డిదని బాబాయి చెప్పాడు. బామ్మ కళ్ళజోడు నేను పెట్టుకునేప్పుడు తీసికెళ్ళి పోతానే అప్పుడు బామ్మ గుడ్డిది అయిపోతుంది

కదా అట్టాంటి దన్నమాట. మనం ప్రేమించుకొనకపోతే నారాయణ కొట్టు దారి కూడా గుడ్డి అవుతుంది.

బాబాయి కాయితాల మీద రాస్తాడనుకో! నేను పలకమీద గుండ్రంగా రాయాలిట. ప్రేమించుకునే వుత్తరాలు తీసుకోరుట. ప్రేమంటే అచ్చంగా యిచ్చెయడంట ఒరొరిగా కాదు. నిఝంగా అన్నమాట...

ఇహ ప్రైవేటు మాస్టరు వచ్చినా పలక ఉండదన్న మాట. నువ్వు అవకతవకగా రాసి నా పలక ఇచ్చేకూడదు సిన్మాలోలాగా త్యాగం యిచ్చేయడం అన్నమాట.

(పలక రెండువైపులా నిండిపోయిందోచ్!)

## *రాధమ్మ ప్రేమ లేఖ*

---

**మునిమాణిక్యం వారి కాంతానికి, ముళ్ళపూడివారి రాధకూ పొంతన లేదు. కాంతం వయస్సు మళ్ళిన జంటలో మధ్యతరగతి ఇల్లాలు అయితే, కాలేజి అమ్మాయిగా జీవితాన్ని ప్రారంభించి కొత్త కాపురంలోకి వచ్చిన పడుచుపిల్ల రాధ. దేన్నీ సీరియస్‌గా తీసుకున్నట్టు కన్పించక పోయినా అన్నింటిని పట్టించుకుంటుంది ఆ అమ్మాయి.**

గోపాలం పెళ్ళికి ముందు చేసిన అప్పులకు అవాల్తా పడనట్టే మొదట్లో అనిపించినా చివరకు ఏడాది తిరక్కుండా పంతం నెగ్గించి వెయ్యి

రూపాయలు గెల్చుకుని అప్పులు తీర్చేలా చేయలేదూ ఓ కథలో. రాధమ్మ పైకి అలావున్నా సంసారపక్షంగానే వుంటుంది పాపం.



గోపాలం గారికి.

రాధ నమస్కరించి వ్రాయుట-

మీరు రాసిన వుత్తరం అందింది. ఎన్నోసార్లు చదువుకోవాలనుకున్నాను... ఏమిటో తీరా చదవాలంటే మనసు మనసులో వుండదు.

ఆ మధ్య ధవళేశ్వరం నుంచి ఒక సంబంధం తెచ్చారు. ఆ అబ్బాయి అస్సలు మీలాగ లేడు. ఎర్రగా ప్యాంటు తొడుక్కున్న ప్రవరాఖ్యుడులా వున్నాడు. మీరు ఎక్కడ కనిపించినా 'ఈ నల్లబ్బాయిని ఎలా వరించావే' అంటూ మా స్నేహితురాళ్ళంతా తెగ వేళాకోళం చేస్తుంటే - ఎంత బావుంటుందో మాటల్లో చెప్పలేను.

ఎందుకైనా మంచిదని మొన్నంటే మొన్న మీ సంగతి మా మేనత్త చెవిని వేశాను. 'పిల్లాడు బావుంటాడా' అని నిన్నంటే నిన్నే జడవేస్తూ నిగ్గదీసినట్టు అడిగింది. నల్లగా వుంటాడని తలవంచుకు చెబితే - ఎదురుగా అద్దంలో నీ మొహం కనిపిస్తూనే వుందిలే పిల్లా' అని ఆవిడ

అంటే మరీ యిదిగా అన్పించింది. "మా నాన్నతో చెప్పమని, ఆ అబ్బాయిని తప్ప చేసుకోననీ" నిష్కర్షగా చెప్పేద్దామనుకున్నాను. మామయ్య కూడా నా కోసం సంబంధాలు తెగ వెదికేస్తున్నాడు. అచ్చం మీ లాంటి అబ్బాయి సంగతే అమ్మావాళ్ళకి చెబుతున్నాడు. అబ్బాయి సన్నగా, పొడుగ్గా, రివట్లాగా వుంటాట్ట! కాలేజీలో చదువుకుంటున్నాట్ట. ఇంటి పేరేమిటో గాని ఆ పిల్లాడు కూడా మీలాగే ప్లీడరుగారి అబ్బాయిట..."

**(అది గోపాలం సంబంధం అవునా కాదా అనేది పాఠకులకే వదిలేస్తున్నాం).**

## వచ్చే శతాబ్దపు తెలుగు కవితా రీతులు

## సాహితీ జోస్యం

భవిష్యత్ జీవితాన్ని గురిం చెప్పవచ్చిన జ్యోతిష్కుడు భూతకాల సంఘటనలను కొన్నింటిని చెప్పి మన మానసాలను ఆకట్టుకోవడం జరుగుతుంది. అలాగే సాహిత్యపరంగా ఆగతాన్ని వూహించడానికి ముందు గతాన్ని అవలోకనం చేయడం అవసరం. భాష సజీవమైంది. సమాజంలాగే సాహిత్యం పరిణామశీలి. వేయి సంవత్సరాల సాహిత్య పరిణామ క్రమాన్ని

బట్టి రాబోయే శతాబ్దిలో దాని నడక ఎలా వుంటుందో వూహించాలని ప్రయత్నం.

### *పురాణయుగం*

నన్నయ్యకు పూర్వమే తెలుగులో పల్లెపాటలు, శాసనాలు వున్నట్లు దాఖలాలు వున్నాయి. శాసనభాష కన్నడానికి చేరువలో వున్న ప్రాకృతభాష అని పరిశోధకులు తేల్చారు. సంస్కృత వాక్యాలతో నిండిన తెలుగు రచనలు 'మణి ప్రవాళములు' వెలిసినాయి.



11వ శతాబ్దిలో మహాభారతం ద్వారా తెలుగు భాషను నన్నయ్య ఆవిష్కరించాడు. అప్పటికి తెలుగులో ప్రామాణిక గ్రంథాలు లేనందున కావ్యరచనకు కావల్సిన విపుల భాషా సామాగ్రిని తానే నిర్మించుకుని శబ్దశాసనుడైనాడు. నన్నయ్య రచనలో మూడు వంతులు సంస్కృత ప్రాబల్యం కాగా, ఒక వంతు మాత్రమే తెలుగు. త్రయంలో ద్వితీయుడు, అద్వితీయుడైన తిక్కనలో ఈ నిష్పత్తి తారుమారైంది. నన్నయ్య గారి పద్మవ్యూహాన్ని తిక్కనగారు 'తమ్మిమొగ్గరం' చేశారు. వీరిద్దరి రీతుల్నీ

అనుసంధిస్తూ అక్షర సేతువుని నిర్మించాడు ఎర్రాప్రగడ. నన్నయ్య గారి కవితార్థశక్తి, తిక్కన గారి నాటకీయత, ఎర్రనగారి అనుసంధానయుక్తి ఇవన్నీ ఏకమై మహాభారతం ఆవిర్భవించింది.

తర్వాత శ్రీనాధయుగం ఆరంభమైంది. కవిత్వంలో ప్రౌఢత్వాన్ని చొప్పించాడు. బమ్మెరవారి భక్తిప్రదాన రచన భాగవతం పుట్టింది. చాటువులు, ఆశుకవిత్వం చోటు చేసుకున్నాయి ఈ యుగంలో.

## *ప్రబంధయుగం*

16వ శతాబ్దం - కృష్ణదేవరాయల యుగం. ఇదే ప్రబంధయుగం. పూర్వయుగానికి, ప్రబంధయుగానికి కొన్ని స్పష్టమైన భేదాలు కన్పిస్తాయి. అనువాద మార్గాలు పోయి కల్పిత కథా వృత్తాంతాలు గల స్వతంత్ర కావ్యాలు ఆవిర్భవించినాయి. ఉదాత్త ప్రకృతిగల నాయకులు, సీత ద్రౌపది లాంటి పతివ్రతా శిరోమణులు కన్పించరు. యీ యుగంలో ప్రబంధనాయకులు రసజ్ఞులు. నాయికలు ప్రేమైక జీవులు. వీరిలో కుల స్త్రీలేగాక వరూధిని వంటి గంధర్వ కామినులు, కలభాషిణి వంటి వారకాంతలు చిత్రింపబడినారు. పురాణాలలో వీర, శాంత రసాలకు ప్రాధాన్యత యివ్వగా ప్రబంధాలలో శృంగారం వర్ధిల్లింది. నాడు కథపై శ్రద్ధ చూపుతూ వర్ణనలను మితంగా చేశారు.

ఈ యుగంలో వర్ణనలకు ప్రాధాన్యత నిచ్చి తమ ప్రౌఢశైలిని కూడాప్రదర్శించారు. ప్రాచీనులు ధర్మప్రతిపాదన. నీతిబోధచేయగా ప్రబంధకవులు లౌకిక కావ్యదృష్టిని ప్రదర్శించి కావ్యానికి ఆనందమే ప్రధానమని భావించారు.

17, 18 శతాబ్దుల అనంతరం ప్రబంధయుగంగా పరిగణించబడింది. 17వ శతాబ్దిలో సంస్కృతములో నున్న వ్యాకరణగ్రంథం ఆంధ్ర శబ్ద చింతామణికి ఎలకూచి బాలసరస్వతి తెలుగు వివరణ యిచ్చారు. ఈ యుగంలో తెలుగు కవిత్వం మార్పులు లేక పాతపంథాలోనే నడిచింది. అయితే కావ్యాలు కోకొల్లలుగా వచ్చినై. ఈ కాలంలో ముద్దుపళని రచించిన రాధికా స్వాంతనం లోకోక్తులతో నిండి రచనలో కొంత వైవిధ్యాన్ని నింపుకున్నది. యక్షగానాలు తండోప తండాలుగా వచ్చినాయి. వీటిలో భావము, భాష దేశి యగుటచే జనసామాన్యం బాగా ఆదరించింది. ప్రబంధకవులు గేయ సాహిత్యాన్ని "ముదివిటులు, విధవ లంజెలు - పద కవితలు" అంటూ నిరసించడంవల్ల నలిగిపోయిన గేయ వాఙ్మయం తిరిగి ఈ యుగంలో వికసించసాగింది.

## భాషా పరిణామ క్రమం

క్రీస్తు శకం అయిదు నుండి 11వ శతాబ్దం దాకా పండిత సదస్సులకే పరిమితమైన కావ్యభాష వొకవైపు, సామాన్య ప్రజల వాడుకభాష

మరొకవైపు వర్ధిల్లినాయి. వాడుక భాషలో వచ్చిన మార్పులు కావ్యాల్లోకి ఎక్కలేదు గాని, శాసనాల్లో గోచరిస్తుంది మార్పు. అంతకు ముందున్న శ,ణ,లు - ల,న,లుగా మారినవి. వర్గ హల్లుల ముందు వచ్చే ఙ,ఞ,ణ,న,మ లను సున్నా వ్రాసే అలవాటు వచ్చింది. బహువచన ప్రత్యయం ముందుండే 'ళు' అలా 'ట' అయింది. 13వ శతాబ్దంలో కేతన కావ్యభాష దూరంగా వుండాలని సూచించాడు. కావ్యభాష మార్పులు చెంది వాడుక భాషకు మరింత దూరమైంది. 14వ శతాబ్దం నాటికి శరణములు - శరణాలుగా, కుంచములు కుంచాలుగా మార్పు చెందాయి. 16వ శతాబ్దపు శాసనాలలో వస్తారు, పొందుతారు, చూస్తాడు, వస్తాడు లాంటి ప్రయోగాలను మనం చూడవచ్చు.

వ్యవహారభాష జానపదాలకు, శాసనాలకు పరిమితమైంది. కావ్యసాహిత్యానికి కవిత్రయం వారిశైలి వొరవడిగా నిలిచింది. శతకాలు, కీర్తనలు, యక్షగానాలు మొదలైన వాటిలో వాడుకభాష చోటుచేసుకున్నది.

1855లో చిన్నయసూరి బాలవ్యాకరణం వారి ఇతర వచన రచనలు వచ్చినాయి. వచనరచనలు క్లిష్ట వ్యవహారికంలోనే సాగినాయి. తర్వాత గ్రాంధిక వ్యవహారికోద్యమాలు సాగటంతో తెలుగు వచన రచనలు కుంటుపడ్డాయి. 1930 తర్వాత గిడుగు పిడుగు వ్యావహారిక

భాషోద్యమాన్ని తీవ్రతరం చేయడంతో మనం తిరిగి వచన సాహిత్యంవైపు నడక సాగించాము. తాపీ ధర్మారావుగారు వ్యవహారిక భాషను పత్రిక (జనవాణి) కెక్కించిన ఘనత దక్కించుకున్నారు. వీరేశలింగం పంతులుగారు తెలుగు భాషలో వివిధ ప్రక్రియలను ఆవిష్కరించారు.

## కాల్పనిక వాదం

తెలుగు సాహిత్యంలో నవ్యత వీరేశలింగం, గురజాడలతో ప్రారంభమై, కాల్పనిక వాదం (Romanticism) రాయప్రోలు వారి ద్వారా వెలుగులోకి వచ్చింది. తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన పాశ్చాత్య కాల్పనిక వాదులు వర్డ్సువర్తు, కీట్స్, షెల్లీ, స్విన్‌బర్న్, ఎడ్గార్ అలెన్‌పో, కీట్స్, కాళిదాసులచే ప్రభావితుడైన రవీంద్రుని ఛాయలు, బంకింబాబు బెంగాలీ రచనల ప్రభావం కూడా తెలుగు కవిత్వంపై పడింది.

స్వాతంత్ర్యోద్యమం ఆరంభమైంది. తెలుగుకవులు తెలుగుజాతిని కీర్తిస్తూ కవితలల్లారు. ఈరచనలు ఉద్యమకాలానికే పరిమితమైనాయి. సామాజికంగా, రాజకీయంగా ఎన్నోమార్పులు వచ్చి కాల్పనికవాదం ఎబ్బెట్టుగా తోచసాగింది. ఊహాలోకంలో విహరింపచేస్తూ పలాయనవాదానికి ఇవి ప్రతీకలనే భావం కలగసాగింది. జీర్ణం చేసుకోలేకపోవడంతో వాస్తవవాదాన్ని కూడా తిరస్కరించారు.

1920లో గురజాడ ప్రచురించిన 'ముత్యాల సరాలు' తెలుగు సాహిత్యంలో వచ్చిన కొత్త పంథా. అబ్బూరి ఊహాగానంలో సాధు గీతికలు విన్పడ్డవి. 1920 ప్రాంతంలో నండూరివారి ఎంకి పుట్టింది.

"యెలుతు రంతా మేసి

యేరు నెమరేసింది" అంటూ సర్రియలిజాన్ని ఛాయామాత్రంగా తెలుగు వారికి పరిచయం చేశారు. ఎంకి తెలుగువారి ఆడపడుచుగా సముచిత స్థానం సంపాదించుకున్నది.

వాస్తవవాదం తర్వాత అభ్యుదయవాదం అంకురించింది. శిష్ట్లా ప్రయోగాలు ఈ ఉద్యమపు ప్రారంభ సంకేతాలు. శ్రీశ్రీ, నారాయణబాబు, జరుక్‌శాస్త్రి - పఠాభి మూలస్థంభాలు ఈ ఉద్యమానికి. ముద్దుకృష్ణ 'జ్వాల' కొంత వూపునిచ్చింది. పఠాభి పద్యాల నడుములు విరగగొట్టడమే కాదు, ఆంగ్ల పదాలను తెలుగైజ్ చేశాడు. నగర వర్ణనంలో దిగంబర కవిత్వాన్ని ఆనాడే పఠాభి ఆవిష్కరించాడు. శ్రీశ్రీ వచనకవిత, కొడవటిగంటి వచనరచన మార్క్సిజం వైపుకు నడిచాయి. ఆరుద్ర హంగామా చేసినా రంగుటద్దాలేవీ తగిలించుకోలేదు. "సాహిత్యం నియమ రహితమని అనన్య పరతంత్రమని" శాస్త్రకారుడు చెప్పిన అభిప్రాయం రుజువైంది. సైన్సులోలాగే నిత్య నూతన ప్రయోగాలు తెలుగు సాహిత్యంలో సాగినాయి.

తెలుగు కావ్యభాష వేయేళ్ళ తర్వాత సంపూర్ణంగా పరివర్తన చెంది ప్రజలభాష కావ్యంలోకి వచ్చింది. మిగతా వందల యేళ్ళలో రాని మార్పులు ఈ యాభై యేళ్ళలో వచ్చి కవి అభివ్యక్తి పరిధులను వూహించిన దానికంటే విస్తృతం చేసినాయి. కావ్య వస్తువు అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. పద్య రచనలో ఛందస్సు కవులకు సాయపడుతుంది. కాని, వచనకవితలో వ్యర్థపదాలకు తావు లేదు.

1955 తర్వాత శ్రామికుల కన్నా మధ్య తరగతి జనం ఎక్కువగా కన్పిస్తారు. సాహిత్యంలో ఎన్జీవోలు, నిరుద్యోగులు కావ్యనాయకులైనారు. సమాజ స్థితిగతులు కవితల్లో ప్రతిబింబించడం సహజం కదా! ఒక రకమైన రివిజనిజం ధోరణి కూడా వచ్చింది. తిలక్ 'పులి చంపిన లేడి నెత్తుర్ని పులుముకుంటె' ఆరుద్ర 'గంట స్తంభం చూపెట్టే కాలం తప్ప'న్నాడు. నారాయణబాబు ఫ్రాయిడ్‌ని మార్క్సుని కలబోసి చదవడం ప్రారంభించాడు. శ్రీశ్రీకి సర్రియలిజం సోకింది.

నరావతారం రామమోహనరావుగారు వొకచోట సాహిత్య సమీక్ష చేస్తూ - 'అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందం నీది' అని చెరబండరాజు మాతృదేశాన్ని స్తుతినింద చేశారు. తెలుగు కవిత ఒక 50 ఏళ్ళలో 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా' అన్న గీతం నుంచి దిగంబర కవితలో దాని యాంటీ థీసిస్ వరకు పయనించింది' అన్నారు. ఇది చాలా

సునిసితమైన సమీక్ష. అర్ధ శతాబ్ది ఆంధ్రసాహిత్య పరిణామక్రమాన్ని ఒక్క వాక్యంలో చెప్పడం జరిగింది.

కవుల భాషా ప్రయోగం మీద నేటి జీవిత విధానం తెస్తున్న మార్పులకు కొన్ని ఉదాహరణలు ఇచ్చారు శ్రీశ్రీ. టెలిగ్రామ్, వాణిజ్య ప్రకటన, వార్తా శీర్షిక వీటికి వ్యాకరణం ప్రధానం కాదు. క్లుప్తత , ఆప్తత, గుప్తత వీటికి ముఖ్యం. ఈ శైలి ఆధునిక కవితలలో కొన్ని చోట్ల కనిపిస్తుంది.

'గోదా శబరినది' అనే మాట గోదాబరి అయి, గోదావరి అయి కాలక్రమంలో 'గోదారి' అయింది. అంటే క్లుప్తతను నేటి ఆధునికుడు సమాదరిస్తున్నాడన్న మాట. తెలుగు కవితల్లో ఆంగ్లపదాలు విరివిగా వాడబడుతున్నాయి. ఆంగ్ల పదాలే కాదు, ఏ భాషా పదమైనా తేలిగ్గా అర్థమయ్యేది ప్రజల వాడుకలోది అయివుంటే చాలు. అంటే ఆనాటి 'మణి ప్రవాళాలు' మళ్ళీ వచ్చాయన్నమాట. కావ్యవస్తువు అంతర్జాతీయ పరిధికి ఎదిగింది. ప్రత్యేక వాదం విస్తృతమైంది. వ్యాకరణం పూర్తిగా దూరమైంది. సంధిని పాటించకుండా ప్రపంచ తెలుగు మహాసభలను జరుపుకుని తెలుగువాళ్ళు వ్యాకరణాన్ని సమాధి చేశారు.

మార్క్స్ తన తర్కభాషలో థీసిస్+ యాంటీ థీసిస్ = సింథిసిస్ అన్నాడు. ఆధునిక తెలుగు కవిత థీసిస్ నుంచి యాంటీ థీసిస్ దాకా ప్రస్తావించింది. కనుక మళ్ళీ ఎనాలసిస్ ప్రారంభం కావాల్సిన అవసరం ఉన్నదేమోననుకుంటాను.

రాబోయే శతాబ్దంలో యాంత్రికయుగం సంపూర్ణత్వాన్ని చేకొని కాలపు వేగం హెచ్చడం జరుగుతుంది. కనుక సుదీర్ఘ కవితలు చదివే ఓపిక, తీరిక గల పాఠకులు దొరకడం అసాధ్యమౌతుంది. నూతన శతాబ్దంలో దేశాలమధ్య గల దూరాలు ఇంకా తగ్గుతవి. అన్ని దేశాల సాహిత్యాలకు అంతర్జాతీయ స్థాయిలో పాఠకులు లభిస్తారు. అయితే అంతర్జాతీయ అవగాహనకు ఒక ప్రపంచ భాష తప్పనిసరి అవుతుంది.

1900 ప్రాంతంలో రష్యాలో డాక్టర్ జాయెస్‌హాన్ కనుగొన్న ఎస్పరాంటో ప్రపంచభాషగా విస్తరించలేదు. ఇంగ్లీషు మాతృభాషగా గల దేశవాసులు దీనిని అణగద్రొక్కారు. మొత్తం మీద ఇది విఫలమైంది.

ఏ రష్యా భాషలో కవితనో మనం సరాసరి అర్థంచేసుకోవాలి. ఈ అనువాదాలలో మూలంలోని విశేషాలు యధాతథంగా రాకపోవచ్చు. అందుకే నే నంటాను - అద్యతన భవిష్యత్తులో కవుల కోసం ప్రత్యేకమైన భాష ఆవిర్భవిస్తుందని. ఆ భాష సంకేత పదజాలంతో వుంటుంది.

అనుభవాలకు అనుభూతులకు కొన్ని సంకేతాలు వస్తాయి. అంటే ఆవేదన, ఆకలి, ఆనందం, భయం, ఉద్రేకం, ఉత్సాహం ఇలాంటి మానసికావస్థలను ఒక కోడ్ ద్వారా అభివ్యక్తపరచటానికి వీలుంటుంది. అన్ని దేశాలవారు కోడ్‌ని అనుసరిస్తారు. ఒక భారతీయుడు ఈ కోడ్ భాషలో కవితను వ్రాసి ఒక జర్మన్ పత్రికకు పంపడానికి వీలుంటుంది. ఆ పత్రికవారు ఆ కోడ్‌ను తమ భాషలోకి విశ్లేషించి గాని లేదా కోడ్ (బహుళ ప్రచారం పొందితే)ని యథాతథంగా గాని ప్రచురిస్తాయి. అలాగే ఏదేశపు ఏ భాషా పత్రికైనా పరిధి అంతర్జాతీయమైంది. కనుక కవితల్లో విశ్వమానవ స్పృహ వుండి తీరుతుంది.

పుస్తకాలలో, పత్రికలలో భావాన్ని అనుసరించి రంగులు మార్చి అక్షరాలను లేదా పంక్తులను ప్రచురించే ఆచారం రావచ్చు. వేదన అయితే నలుపులో, విప్లవమైతే ఎరుపులో, స్నేహమైతే తెలుపులో ఇలాగే.

ఆధునిక చిత్రకళలో చిత్రాలకు పేర్లు పెట్టడం మానుకున్నారు. కవితలకు శీర్షికలు వుండకపోవచ్చు. గుర్తింపు కోసం కవి పేరు, కవిత నెంబరు వుంటుంది.

అధివాస్తవికత పరాకాష్టకు వెళ్ళి అంబరం నుంచి (భాషా విషయకంగా) దిగంబరానికి దిగివచ్చిన తెలుగుకవిత తిరిగి భావనాపరంగా అంబరానికి యెగిరిపోయే ప్రమాదం లేకపోలేదు.

కవిత్వం వ్రాయడంకన్నా చదివి అర్థం చేసుకోవడం ఒక పెద్ద కళగా పరిణమించే సూచనలున్నవి. మినీకవితలు మినహా సుదీర్ఘ కవితలు రాకపోవచ్చు. ఇక నాయికా నాయకుల ప్రసక్తే లేదు. అప్పటికి సెక్స్ పట్ల వెగటు తోచి కవితల్లో అశ్లీలానికి ఆస్కారం వుండకపోవచ్చు.

యాంత్రిక జీవితంలో విసుగెత్తిన ప్రజానీకం పలాయనవాదాన్ని వరించి తిరిగి భజన కీర్తనలను, ఆధ్యాత్మిక రచనలను ఆహ్వానించవచ్చు. (హరేకృష్ణ సమాజాలు ఇలాంటివే దాదాపుగా)

## *కంప్యూటర్ కవితలు*

కంప్యూటర్లు ఆధునిక చిత్రాలను రచిస్తున్నట్లు వింటున్నాం. కంప్యూటర్ల చేత కవిత లల్లించడం అసాధ్యమేమీ కాబోదు. ప్రాచీన కాలంలోవలె వ్రాత గాళ్ళతో పనిలేకుండా డిక్టా ఫోనులు ఇప్పటికే వచ్చేసినాయి. కవి మేధస్సులోని భావాలను భవిష్యత్తులో కంప్యూటర్ సంకేతాల ద్వారా ప్రదర్శిస్తుంది. అనుభూతి, ఆలోచన, ఆవేశం గల కవి మెదడు దగ్గరగా కంప్యూటర్ యంత్రపరికరాన్ని అమరుస్తారు. కంప్యూటర్ పనిచేయడం ప్రారంభిస్తుంది. కవి పొందే అనుభూతిని బట్టి వెలువడే కవిత బాగోగులు ఆధారపడి వుంటుంది. దీనివల్ల కవి నిజాయితీ కూడా బయటపడుతుంది. ఇప్పటివలె ఎరువు తెచ్చుకున్న నినాదాలు, శుష్క ప్రియాలు కవి తన కవితలో చొప్పించడానికి వీలుపడదు. భావం

మనస్ఫూర్తిగా మెదడు లోతుల్లోంచి వస్తేనేగాని అది రికార్డు చెయ్యదు. 21వ శతాబ్దంలో ఇలాంటి పరికరం రావడానికి అవకాశం వుంది.

## కవిగా కొద్ది క్షణాలు

మనిషి కొన్ని ప్రత్యేక సందర్భాలలో మామూలప్పుడు చేయలేని గొప్పపనులను చేయగలుగుతాడు. ఇటీవల ఒక మహిళ కారు క్రిందపడిన తన పసిపిల్లను రక్షించాలనే ఆత్రుతతో ఆ కారును అమాంతం ఎత్తిందట. మామూలుగా ఇది ఆమెకు అసాధ్యమైన పని. కొన్ని పరిస్థితులలో ఇలాంటి బృహత్‌శక్తి ఆవిర్భవిస్తుందని శాస్త్రజ్ఞులు తేల్చారు. దీని ఆధారంగా ఒక 'పిల్'ని తయారు చేస్తున్నారు కూడా! ఆ 'పిల్'ని వేసుకున్నప్పుడు బృహత్‌శక్తి కలుగుతుందట కొద్దిసేపు.

అలాగే కవితను కవి కాని వాడు వ్రాయాలనుకున్నప్పుడు ఒక పిల్‌ని సేవించడం ద్వారా అది సాధ్యపడే అవకాశం రావచ్చు. హిప్నాటిజం ద్వారా వీణ అంటే తెలియని మామూలు ప్రేక్షకుని చేత కొద్దిసేపు మధురంగా వీణానాదం చేయించడం మనం చూస్తూనే వున్నాం. అలాగే ప్రత్యేక గుళిక ద్వారా ఒక మనిషిని కొద్దిసేపు కవిగా జీవింప చేయడం సాధ్యపడవచ్చు. ఆ కొంచెం సేపు ఆ మనిషి రచయితగా ఉత్తమ రచనను చేయకలుగుతాడు. సాహిత్యరంగంలో కావలసిన ప్రక్రియను బట్టి పిల్స్ మింగాల్సి వుంటుంది. కవిత, కథానిక వాటికి ఇలా వేర్వేరు ప్రక్రియలకు

గుళికలు! అచ్చం శ్రీశ్రీలాగే వ్రాయాలనుకుంటే ఆ బ్రాండ్ మాత్ర మింగాల్సి ఉంటుంది.

## నవలా సాహిత్యం

తెలుగు సాహిత్యంలోకి నూరుసంవత్సరాల క్రితం నవల ప్రవేశించింది. విరివిగా నవలలు వస్తున్నప్పటికి వర్తమానంలో చాలా మందికి పెద్దకథకూ నవలకూ తేడా తెలియదనడం నిర్వివాదంశం.

వచ్చే శతాబ్దంలో ప్లాట్ రైటరు ప్రత్యేకించి తయారౌతారు. అంటే వందల పేజీలు వ్రాసే బాధ్యత వీరు పెట్టుకోరు. కథాసారాన్ని కొద్ది వాక్యాలలో వ్రాస్తారు. కావల్సినవారు దానిని తీసుకొని భాష, శిల్పం మేళవించి సమగ్ర నవలగా రూపొందించాల్సి వుంటుంది. తీరిక వున్నవారు నవలను, తీరిక లేనివాళ్ళు ప్లాట్‌ను చదువుకుని ఆనందిస్తారు 'ప్లాట్' ప్రచురించబడగానే పాఠకుల అభిప్రాయాలు వెల్లడి అవుతాయి కదా! దానిని బట్టి నవలాకారుడు ప్లాట్స్‌ని ఎంపిక చేసుకుంటాడు. ఇప్పుడు నవలలపై గల అభిప్రాయాన్ని బట్టి సినిమా నిర్మాతలు ముందుకు వచ్చినట్టు.

లైట్ రీడింగ్ పట్ల ఆసక్తి పెరిగి జానపద కథలకు గిరాకీ పెరగడానికి అవకాశాలున్నాయి.

జపాన్‌లో ఇప్పటికే పాకెట్‌డైరీ సైజులో మినీ పత్రికలు అమలులో వున్నాయి. అమెరికాలో అక్షరాలు అదృశ్యమయ్యే పత్రికలు ప్రయోగదశలో వున్నాయి. కొద్ది గంటలు అనంతరం వార్తాపత్రికలపై గల అక్షరాలు వాటంతటవే చెరిగిపోతాయి తిరిగి ఆ కాగితాన్ని వుపయోగించవచ్చు. వచ్చే శతాబ్ది నాటికి సాంకేతికంగా రాగల పరిణామాలు అనూహ్యామైనవి.

పత్రికలు కేవలం వార్తాప్రసారం సాహిత్య సేవలకే పరిమితం కాకుండా చందాదారుల దైనందిక జీవితంలో భాగస్వా కాగలవు.

నిత్యకృత్యంలో చందాదారునికి ఎన్నో రకాలుగా తోడ్పడే స్థితికి వస్తాయి. ఇప్పుడే కొన్ని వాణిజ్య ప్రకటనల ద్వారా కొన్ని నిత్యావసర వస్తువులకు పత్రికలు దళారులుగా వ్యవహరిస్తున్నాయి. (ఫలానా పత్రికలో ప్రచురించిన కూపను కత్తిరించి పంపడం ద్వారా కొన్ని వస్తువులకు రిబేటు లభించడం లేదా ఉచితంగా లభించడం వంటివి చూస్తూన్నాం.) ఈ ధోరణి పెచ్చుపెరిగి ఏ వస్తువు కావాలన్నా పత్రిక ద్వారా పొందడానికి ముఖ్యంగా నగరవాసులకు సౌకర్యం ఏర్పడుతుంది. పత్రికా సంస్థలు చందాదారునికి గార్డియన్‌గా వ్యవహరించగల అవకాశం వుంది.

టెలివిజన్స్ విస్తృతమౌతాయి కనుక ముఖ్య సంఘటనలకు సంబంధించిన ఫోటోలను ప్రచురించే అవసరం తగ్గిపోతుంది. కొన్ని పత్రికలు త్రీడి ఫోటోలను ప్రవేశపెడతాయి.

పత్రికల్లో వార్తల కంటె వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రతికా స్వాతంత్ర్యం పెరిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వం గాని, ప్రైవేట్ సంస్థలు గాని ఏవైనా అన్యాయాలను, అక్రమాలను చేస్తే వాటిని బయటకు తీసే ప్రయత్నాలు పత్రికాపక్షంగా అధికం కాగలవు. ఒక రహస్య సమాచార శాఖలాగా పత్రికలు పని చేయడం ప్రారంభిస్తాయి. అలాంటి వైఖరి ప్రదర్శించే పత్రికలకు మాత్రమే ప్రజాదరణ లభిస్తుంది.

ప్రస్తుతం మహిళలకు, పిల్లలకు యువకులకు ప్రత్యేక పత్రికలున్నాయి. ఈ వర్గీకరణ విస్తరించి వయసులవారీగా వేర్వేరు పత్రికలు వస్తాయి. మధ్య వయస్కులకు, వృద్ధులకు, పిల్లలులేని వాళ్ళకు, అధికంగా పిల్లలున్నవాళ్ళకు, అవివాహితులకు ఇలా వేర్వేరుగా నిర్వహించబడవచ్చు - మైక్రో ఫిలిమ్ పేపరు రాగల సూచనలున్నాయి.

## *నవీనంలో నాటిక*

నిడివైన డైలాగులస్థానే కట్ డైలాగులు వినిపిస్తాయి, బరువైన సంఘటనలతో కూడిన నాటికలపట్ల విముఖత ఏర్పడవచ్చు. మానవ మనస్తత్వంపై విశ్లేషణాత్మకంగా రచించబడే నాటికలు అధికంగా వస్తాయి.

రంగస్థలాలు సాంకేతికంగా అభివృద్ధి చెందుతాయి. అంత గొప్ప పేరు వస్తుంది. ప్రేక్షకులస్థాయి పెరిగి అనవసరపు సంభాషణలను నిరాదరిస్తారు. సర్వే సర్వత్రా హాస్యరసం పట్ల విముఖత పెరిగి మానవ సమాజం ఒక

విధమైన సీరియస్‌నెస్‌ని ఆరాధించే స్థితికి వెడుతుంది. అదొక ఫ్యాషన్‌గా పరిణమించే అవకాశం వుంది.

ఏ సాహిత్యం ఎన్నాళ్ళు మనగలుగుతుందో, ఏ రచన యెన్నాళ్ళు జీవిస్తుందో అనేది ప్రజాభిరుచులే నిర్ణయిస్తాయి. ఏది ఏమైనా ఆర్నాల్డ్ అన్నట్లు "నిత్య పల్లవ శీలమైన సాహిత్యం ఎన్నటికీ మోడు వారదు."

# సినిమా సమీక్షలు

**ప్రముఖుల వచన శైలికి సంబంధించిన పేరడీలలో మరో అంశం చలన చిత్ర సమీక్ష 'పిచ్చి ప్రేమ' అనే సాంఘిక చిత్రాన్ని చూశాక కొందరు ప్రముఖులు వారి అభిప్రాయాలను ఎలా వెలిబుచ్చుతారో ఊహించి, అనుకరించడానికి ప్రయత్నించాను. సందర్భంతో అట్టే సంబంధం లేకపోయినా వారి వారి అభిరుచులు తప్పనిసరిగా వెల్లడి అవుతుంటాయి.**

## *విశ్వనాథ సత్యనారాయణీయం*

**విశ్వనాథవారు ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వ్యక్త పరుస్తారని అందరికీ తెలుసు. 'పిచ్చిప్రేమ' సినిమా చూపించి, తమ అమూల్య అభిప్రాయం తెల్పండని అడిగితే వారి సమీక్ష ఇలా సాగుతుంది-**



"శ్రమ పలు విధములు, నా వంటివానికి ఇట్టివి జూచుటయే శ్రమ. దానిని సమీక్షించుట మరియొక శ్రమ. వారు సగౌరవముగా 'పిచ్చిప్రేమ' యను సాంఘిక చిత్రమును జూపి, అభిప్రాయము అడుగ కాదనుటెట్లు?

జూచితినిగదా, ఆద్యంతమొక్క తీరుగ నడిచినది. ఇందు నాయిక మొదట నాతనిని సందేహించును. అతడు యనగా నాయకుడు. ఆమె ఖండిత. అతడేదియో బులిబుచ్చకములు జెప్పి రంజింప బ్రయత్నించును. ఆమె భీష్మించుకొనును. సన్నివేశములు క్రమముగా జూపుచు, సమయమెరిగి బాటలబాడించుచు, ఆటలనాడించుచు కథ నడిపించుట దర్శక దామోదరుని ప్రతిభయే యనవలెను. ప్రాచీన కాలమున తోలుబొమ్మలాట లుండెడివి. అచట నేపథ్యముగ గాయకులు స్వయముగా బాడుచుందురు. ఇచ్చట బాడిన దానిని బద్దీపై నిక్షేపించి మరల మరల వినిపింపజేతురు.

నాయకుడు గెంతుచు ఆహా... హా... యని యేమో పాడును. ఆ పాట కర్ణపేయముగా నున్నది. అతడట్లు పెర్రివానివలె ఏల గంతులు

వేయునో మనకు తెలియదు. బహుశః అది నటనయై యుండునని నేను యూహించితిని. నాయిక జిత్రముగ నుండును. ఆమె యందరివలె లేదు. పాదరక్షలతోనే బడకగది ప్రవేశించును. అట్లే పరుండును. నాయకుడు అభ్యంతరము దెల్పడు. అనురాగమనిన నట్లుండు గాబోలు ననుకొంటిని. హాస్యరసమును పోషించుటకు బ్రత్యేకముగ నొకడు గలడు. అతడప్పుడప్పుడు బ్రత్యక్షమై ప్రేక్షకులను నవ్వింపయత్నించును. కథతో యతనికి కొంత సంబంధము యుండును. 'పిచ్చి ప్రేమ' యను పేరు చిత్రమునకు బాగుగా యతికినది..."


**(ఇలా సాగే విశ్వనాథ వారి సమీక్ష చిత్రవిజయానికి దోహదం చేసే అవకాశం వున్నదా?)**

## సినిమా చ్ఛాస్త్రీయం

**ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు హనుమదింద్రగంటిగా కూడా ప్రసిద్ధులు, ఆయనది మాసిపోని నవ్యత. సాహితీస్రష్ట, అంతకు మించిన సాహితీ బంధువు. భావకవిత్వ తరానికి అభ్యుదయ తరానికి నడుమ ఆయన సేతువు. నవ్య సాహిత్య పరిషత్తు, దానికి సంబంధించిన వ్యక్తులు వారి అభిమాన విషయాలు. వారి శైలి ఇలా సాగుతుంది-**

'పిచ్చిప్రేమ' సినిమా చూడడం విశేషం కాదు గాని ఆ చిత్రాన్ని రాజమహేంద్రవరంలో చూడడం మాత్రం ఒక గొప్ప అనుభవమే! గోదావరీ

తీరాన గడిపిన సంవత్సరాలు నా జీవనయాత్రలో విలువకట్టలేని రసవదధ్యాయాలు కావడం వల్లనేమో, అంతటి అనుభూతి పొందాను. రవ్వంత గాలివీచినా అణువంత మబ్బు కదిలినా ఆనాటి స్మృతులన్నీ పన్నీటి జల్లులుగా మనసున కురుస్తాయి.



ఈ చిత్రంలో పాటలు విన్నాక నాకొకటి అనిపించింది. నాకు ఆత్మీయత, అనుబంధం వున్నవని చెప్పడం కాదు. అప్పట్లో నవ్యసాహిత్య పరిషత్తు, ఆ సందడి లేకపోతే ఇప్పటికీ వస్తున్న కొన్ని మంచి సినిమా పాటలు రావడానికి ఆస్కారం లేదు. ఈ చిత్రంలో వున్నది ప్రేమకథ కనుక వియోగం, విరహం తప్పనిసరి దినుసు. ఆ పాటలు మాటలు వింటుంటే మూడు దశాబ్దాల కాలంలో ఎంతమార్పు వచ్చిందీ- అని విస్తుపోయాను.

**"ఊరకే చలియించు ఈ రేయి వెన్నెలలు**
**విరహవీణా తరళ తరళ తంత్రీగతుల."**

ఆ పదాల కూర్పు, ఆ లయ మర్చిపోవడం ఎలా? మా బాపిబావ పాటల్లో నవ్యత వుండేది. రచన చేయడం ఒక ఎత్తు, వాటిని మధుర మధురంగా అందరివీ అందరూ పాడి పరవశింప చేయడం ఒక ఎత్తు. నేటి సినిమా పాటలతో అక్కడక్కడ నవ్యత, మెత్తని పదాల పోహాళింపు కనిపిస్తుంది.

నవ్య సాహిత్యానికి, లొల్లాయి పదాలకు పోలిక తేవడం కొందరికి ఆమోదయోగ్యంగా వుండక పోవచ్చు.

**"నవ్వి పోదురుగాక నా కేటి సిగ్గు**
**నా ఇచ్ఛయేకాక నాకేటి వెరపు."**

మా అన్నగారి మాట మా అందరికీ మకుటమే!

**(నవ్య సాహిత్య పరిషత్తు లేకుండా కలం కదలదు. మరి అంతే!)**

## *మల్లంపల్లి చరిత్ర సమీక్ష*

**చరిత్ర పరిశోధనే ఆహారంగా, నిద్రగా స్వీకరించి, చరిత్రగతులు దిద్దిన మల్లంపల్లి సోమశేఖర శర్మగారి సమీక్ష చరిత్రాత్మకంగానే వుంటుంది. శిలల భాషలు తెలుసు ఆయనకు. చాకిబండలనుకున్న వాటిని శాసనాలుగా చదివిన దిట్ట.**

'పిచ్చిప్రేమ' అనెడి ఛాయాచిత్రమును క్షుణ్ణముగా పరిశీలించినచో మనకనేక చారిత్రక అంశములు బయల్పడుననుట నిస్సందేహము.



ఇందలి ప్రదేశములు ఇప్పటి ఆంధ్రరాష్ట్రము (అనగా పూర్వపు త్రిలింగము) లోని భాగసరిహద్దు గ్రామ ప్రాంతములు.

చిత్రములో కథాగమనము ననుసరించి విఫల మనోరథయైన నాయిక నిర్జన ప్రదేశములో గల ఒక బావిలో దుమికి ఆత్మహత్యకు తలపడును. ఇక్కడ మనము సూక్ష్మముగా పరిశీలించవలసియున్నది. ఆ బావిచుట్టూ ప్రాకారమువలె శిలా నిర్మితమైన 'బొడ్డు' గలదు. దాని నిర్మాణక్రమమును బట్టి చూడగా అది బౌద్ధశిల్పమును ప్రతిబింబించుచున్నది. క్రీస్తుశకం 11వ శతాబ్దికి చెందిన గంగరాజయ్య (గంగన్న నామాంతరము) త్రవ్వించి యుండవచ్చునని కొందరు చారిత్రక పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు. అతని కుమారుడు దాహదాహ దూషణుడు. తండ్రి త్రవ్వించిన జలాశయములలో పూడికలు తీయించినట్టు ఒక తామ్ర శాసనము ద్వారా వెల్లడవుతున్నది. ప్రమోదూత నామ సంవత్సరము మాఘ శుద్ధ దశమి ఆదివారం నాటికి దాని నిర్మాణము పూర్తి అయినదనియు కొండవీటిలో లభించిన దానశాసనము స్పష్టపరచుచున్నది. గంగరాజయ్య ప్రపితామహుడైన బావికాచార్యులు వాస్తుశిల్పిగా ఆ కాలమున ప్రఖ్యాతి బడసినాడు. అతడు సింహాచలము, సత్రయాగ మొనరించినట్టు అగ్రహారముల దానమొనరించినట్లు సనదులు లభించినవి. అతడు క్రీస్తుశకం 1162 ప్రాంతములో జలనిధి కొలువున ఆస్థాన జ్యోతిష్కుడు. వెలనాటి బ్రాహ్మణుడు. ఇతనిది వసిష్ఠస గోత్రము. దీనికి సంబంధించిన పరిశోధన విపులముగ జరగవలసివున్నది-

**(ఇది చిత్ర సమీక్షా అంటే అంతే మరి - చరిత్ర విను. చెప్పనిది అడుగకు.)**

**అసలు సిసలు దేశాభిమానిగా, గాంధేయవాదిగా, ప్రతిపక్ష సభ్యునిగా ప్రజల మన్ననలు విశేషంగా పొందిన వావిలాల గోపాలకృష్ణయ్య గారికి అంకెలు, తేదీలు, అంచనాలు జిహ్వాగ్రాన వుంటాయి. తెలుగును అధికారభాషగా ప్రవేశపెట్టే ప్రణాళికలో వారి ప్రమేయం అమేయం. ఈ చిత్రం పై వారిచ్చే రివ్యూ (కాదంటే నివేదిక) ఎలా వుంటుందో అనే ఊహకు అక్షర రూపం-**

"1977-78 సంవత్సరపు బడ్జెట్ సమావేశముల నిమిత్తం హాజరు అయిన సందర్భంగా రాష్ట్ర రాజధానిలో 'పిచ్చిప్రేమ' అను చిత్రమును చూచియుంటిని. అప్పుడప్పుడే అనగా 1974 ఆర్ధిక సంవత్సరము చివర నుంచి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆర్థిక పరిస్థితియున్నూ, ప్రజల స్థితిగతులున్నూ, స్వల్పముగా మెరుగపడినట్లు కనబడుచున్నది. 1975 సంవత్సరాంతమున రాష్ట్ర అర్థగణాంక శాఖ వారు విడుదల చేసిన చిత్తు అంచనాల నివేదికను బట్టి తలసరి ఆదాయం 3 నుండి 5 శాతం మేరకు పెరిగినట్లు తెలియుచున్నది. ఇట్టి దశలో భారీ వ్యయంతో టాకీలను నిర్మించుట వాంఛనీయము కాదు. బీదాసాదా వినోదం కొరకు వ్యయపరచుటవలన ఇవి దేశ ఆర్థిక రంగానికి గొడ్డలిపెట్టు కాగలవని మనవి చేయుచున్నాను. ఒక్క గుంటూరు జిల్లాలోనే రోజు మూడులక్షల

నలభై రెండువేల పధ్నాలుగుమంది చలన చిత్రాలను చూచుచున్నారని ఒక అంచనా. వీరిలో అరవై శాతం స్త్రీలు కాగా పది శాతం పురుషులు. మిగతావారు బాలబాలికలు. ప్రేక్షకుల ద్వారా రాష్ట్రం మొత్తం మీద లెక్కలు కట్టినట్లయితే రోజువారీ వసూళ్ళు ముప్పదిలక్షల అరవై నాలుగు వేల అయిదు వందల నాలుగు రూపాయలదాకా వుంటుంది. ఈ మొత్తాలతో నేను లోగడ సూచించిన అత్యవసరం పథకాలు అనగా (అ) పిడుగురాళ్ళ మురుగు కాల్వ త్రవ్వకం, (ఆ) సత్తెనపల్లి దిగువున బ్రిడ్జి నిర్మాణం (ఇ) వరదవాగు పూడిక పథకం పూర్తియగుననిన్నీ సదరు సర్కారు వారికి తెలియజేయుచున్నాను.



ఈ చిత్రంలోని పాత్రలు తమ సంభాషణలలో ఆంగ్ల పదములను విరివిగా ఉపయోగించుట గమనార్హం. ఆంధ్రప్రదేశ్ గజెటు ప్రకటన ద్వారా తెలుగు భాషను ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా విధిగా వాడవలెనని నిర్దిష్టపరచి యున్నారు. తెలుగు భాషను తాలూకా స్థాయికి, ఫిర్కా మరియు గ్రామ స్థాయికి తీసుకు వెళ్ళడానికి ప్రభుత్వం, అధికార భాషా సంఘం కృషిచేయుచున్నవి. ఇట్టి దశలో మన చలన చిత్రాలలో ఆంగ్లభాష

నుపయోగించుట శోచనీయం, సెన్సారు నిబంధనావళిని ఆ మేరకు సవరించాలని కూడా మనవి చేయుచున్నాను. రాజ్యాంగంలోని 8వ నిబంధనావళిని అనుసరించియు. 9-4-77న 931 జి.ఎ.డి. ప్రభుత్వ తాఖీదు ననుసరించియు ఈ క్రింది సందర్భాలలో తెలుగు భాషను వాడవలెనని స్పష్టమగుచున్నది.

.......... ............. ................. ............

**(చిత్రం గురించి ఏమీ లేదంటున్నాం. అదే మరి చిత్రం!)**

## *ఎ-డిటో-రియల్*

---

**దినపత్రికల సంపాదకీయాలకు ఒక ప్రత్యేకమైన బాణీ వుంటుంది. ఏ అంశాన్ని అయినా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆలోచించి, దేశ సమస్యలకు ముడిపెట్టి చివరకు ఒక చిన్న సూచనలాంటి సందేశం ఇచ్చి ముగించడం జరుగుతూ వుంటుంది. భాషాపరమైన శైలిని కాకుండా భావపరంగా మాత్రమే అనుకరించాలని ఈప్రయత్నం. ఒక్కొక్క పత్రికకు ఒక్కొక్క శైలి, కొన్ని పట్టుబడి పదాలు వుంటాయి. అయితే ఇక్కడ జనరలైజ్ చేసి మాత్రమే చూపిస్తున్నాను-**

నేడు తెలుగు భాషలో విడుదల అవుతున్న చాలా చిత్రాలలో లోపాలు వుంటున్నట్టు అంగీకరించక తప్పదు. అయితే ఎంత కట్టుదిట్టంగా చిత్ర నిర్మాణ కార్యక్రమాన్ని రూపొందించినా, కొన్ని అవక తవకలు

వుండకపోవు. అయిన ప్పటికీ తగు శ్రద్ధ వహించడం చిత్ర నిర్మాణానికి సంబంధించిన వ్యక్తుల కనీసధర్మం.

ఇటీవల విడుదల అయిన 'పిచ్చిప్రేమ' సాంఘిక చిత్రం చూసినపుడు సాంకేతికపరంగా తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయి పెరిగిందని అనిపిస్తుంది. అయితే అందులోని అశ్లీల సన్నివేశాలు, అసభ్య పదజాలము ఎంతవరకు అవసరం?



ఒక వైపు అస్తవ్యస్తంగా వున్న దేశరాజకీయ పరిస్థితి, మరొక వైపు పెరిగిపోతున్న జనాభా, ఇంకోవైపు అదుపు తప్పిన శాంతి భద్రతలు - ఇన్ని సంక్షోభాలతో అయోమయంగా వున్న దశలో అశ్లీల సన్నివేశాలు గల చిత్రాలను విడుదల చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. నిన్న మొన్నటి వరకు స్కైలాబ్ ప్రపంచ పౌరుల నందరిని భయభ్రాంతులను చేసింది. ఇదే సమయంలో సాల్ట్ -2 ఒడంబడికలపై అగ్రరాజ్యాలవారు సంతకాలు చేయడం సంతోషించతగిన అంశం. అంతర్జాతీయ రంగాన్ని పరిశీలిస్తే అటు కరాచీలో, ఇటు కంబోడియాలో, నైఋతి ఆఫ్రికాలో కూడా అవాంఛనీయ పరిస్థితి నెలకొని వున్నది. పెట్రోలు, డీజెల్ వంటి ఇంధనాలకు పూర్తి కొరత ఏర్పడింది. అరబ్ దేశాల

వైఖరిలో మార్పు వచ్చినట్లు తోచదు. ఇటువంటి పరిస్థితిలో 'పిచ్చిప్రేమ' లాంటి సాంఘిక చిత్రాన్ని విడుదల చేయడం గర్హనీయం.

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. రైతులు ఇంతవరకు వ్యవసాయ పనులు ప్రారంభించలేదని చాలా జిల్లాల నుంచి అప్పుడే మాకు వార్తలు అందుతున్నాయి. అంతర్జాతీయ జాతీయ రాష్ట్ర సమస్యలను ప్రక్కకు నెట్టి ఒక మామూలు ప్రేమకథా చిత్రాన్ని వినోదం కోసం చూడడం దేశ శ్రేయస్సు దృష్ట్యా మంచిది కాదేమో!

దేశ కాలమాన పరిస్థితులను కూడా జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే సెన్సారు వారు చిత్రాల విడుదలకు అనుమతి ఇస్తే బాగుంటుంది.

## బాపుగారికి కవిసమ్రాట్ విశ్వనాథ అభినందన

**బాపు గారు రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు తీసుకుంటున్న సందర్భంగా తమ ఆశీస్సులు పంపమని విశ్వనాథ సత్యనారాయణ గారిని కోరితే వారు పంపే అభినందనలు లేదా అభిప్రాయం ఎలా వుంటుందో వూహిస్తే - ఆ వూహకి అందిన వివరం యిది:**



కొందరు తామ్రపత్రములిచ్చి సమ్మానించెదరు. ఒకడు సన్మాన పత్రముతో సరిపెట్టును. మరియొకడు శాలువా గప్పును. ఇది గుడ్డిలో మెల్ల. మరి కొందరు ధనమిచ్చి సత్కరించెదరు. ఇట్టి వారు యోగ్యులు. కనుక రాజాగారు యోగ్యులు. బిరుదములు, పొగడ్తలవలన బ్రాప్తించు బ్రయోజనమేమి? శూన్యము. అట్టివి యెన్నైనను ఒుక్కెడు కొర్రలు కాజాలవు. నాకు లౌక్యము తెలియదు. లోకసత్యము జెప్పుట నా మతము. ప్రతిభగలవారినిట్లు గౌరవించుట లోకశ్రేయ మగును.



ఇతన్ని బరామర్శింతము; ఇతడు యనగా బాపు. అది యతని కలము పేరు. ఇతడు చిత్రకారుడు కనుక కుంచె పేరు యనవలె. అతనికి అసలు పేరు యేమో వుండును. మనకు తెలియదు. కవి అక్షరములలో రచన సేయును. చిత్రకారుడనువాడు రేఖలతో, వర్ణములతో సేయును. ప్రయోజనము భావవ్యక్తీకరణ, రససిద్ధి. ఈతడు జిత్ర రచన యందేగాక చలనచిత్ర రంగమున దర్శకునిగా గూడ కొంత కీర్తి నార్జించినాడు. ఆ రంగమున కీర్తితోబాటు ధనము కూడా మిక్కిలిగా యార్జించవచ్చునని కొందరు

జెప్పగా వినియుంటిని. సినిమాలోకము గురించి బొత్తిగా నాకు తెలియదు. గూడవల్లి రామబ్రహ్మము ఇట్టివాటితో లోగడ కొంత పేరు ప్రఖ్యాతులు బడసినాడు. మేమిద్దరమూ ఒక ఊరివారమగుటచే నాకాపాటి తెలిసినది.



రమణయని వొకడున్నాడు, ముళ్ళపూడి వారు. ఇతని సహపాటి. వీరిద్దరూ మంచి స్నేహితులని నాకు తెలియును. స్నేహమనగానేమి? అది యొక అనుబంధము. అవగాహన దానికి ఆలంబన. రెండు జీవుల సమైక్య వేదన. జీవి యనగా ప్రాణి. అయినచో ప్రతి బ్రాణి స్నేహము చేయునా? చేయును. చేయదు - రాజేశ్వరరావని నాకు తెలిసి యొకడున్నాడు. కలకత్తాలో జంతు శాస్త్ర మభ్యసించి బ్రస్తుతము సర్కారులో కార్యదర్శిగా నున్నాడు - జంతుశాస్త్రము జదివిన వానికి కార్యదర్శి బదవి యిచ్చుట ఏమి? ఏమో- అతడందులకు అర్హుడని బైవారికి తోచివుండినది. అతనికి పక్షిశాస్త్రము గూడకొంత తెలియును. పక్షులలో మైత్రి స్వభావము మెండుయని అతడొక పర్యాయము చెప్పినాడు - అతని భార్య రూపసి. పేరు కల్యాణి. కల్యాణి యని యొక అశ్వజాతి గలదు. ఆ జాతి గుఱ్ఱము వేగమునకు బెట్టినది బేరు.

చూచితిరా ఈ వైచిత్రి? ఆమె సంగీతజ్ఞుని భార్య యగుచో మనకు కల్యాణిరాగము జ్ఞప్తికి వచ్చును. ఈతడు జంతుశాస్త్రవేత్త యగుటచే గుర్రము మనసున దోచినది. దీనిని స్ఫురణ అందుము. అదియొక మానసిక యవస్థ. అవస్థ యనగాస్థితి. అయినచో నిట్టి స్థితి... (అదండీ పరిస్థితి)

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 3-12-82)

# నారాయణ కల్పవృక్షమ్

**(విశ్వనాథ సత్యనారాయణగారు జీవించి వుండి ఆరుద్ర గారి షష్టిపూర్తి ఉత్సవానికి సందేశం పంపివుంటే ఇట్లా వుండవచ్చు...)**

భాగవతుల శంకరశాస్త్రి. ఇది కొందరికి తెలియును. కొందరికి తెలియదు. ఆరుద్ర. ఇది మిక్కిలి బ్రసిద్ధము. ఆరుద్ర యనునది యొక నక్షత్రము. పుష్య మాసములో వచ్చెడి ఆరుద్ర నక్షత్రము శైవులకు బర్వదినము. పరమేశ్వరుడు కైలాసము నుండి దిగి వచ్చునని వారి నమ్మిక. ఆ రోజు ద్వార దర్శనము చేయుదురు. కొందరు కొన్ని పేర్లు ధరించుటచే అవి ఖ్యాతి బడయును, కొందరు వాసికెక్కిన పేర్లు ధరించి ఖ్యాతి గడింతురు. మా ప్రాంతములో విశ్వనాథ నాగభూషణమని యొకడున్నాడు. వారి తాత ముత్తాతలు మెట్ట సేద్యములో దిట్టలు. వీనికి

అదికూడ అబ్బినది కాదు. జులాయిగా తిరుగుచుండెడివాడు. అయినను ఇంటిపేరుచే గొంత ప్రాచుర్యము పొందినాడు. ఫలానా నాగభూషణము మీ దాయాదియా అని పలువులు నన్ను ప్రశ్నించుచుండెడివారు. అతడు మా శాఖవాడు కూడ కాదని నేను నిజము చెప్పెడివాడను. కొందరికి యిట్టి వరములు ఆయాచితముగా లభించును.



ఆరుద్ర అభ్యుదయవాదినని చెప్పుకొనును. కాదనుటకు నావద్ద నిదర్శనములు లేవు. అయినచో అయివుండవచ్చును. కాకపోయినచో మాత్రము ప్రమాదమేమి? ఇతను గడ్డము పెంచును. ఆనాడు జులపాలు పెంచుటను భావకవులు ఆచారముజేసిరి. నేను ఏ వాదమునకూ జెందను. నా వాదము నాది. నచ్చినవారికి యది వేదము, లేని వారికి లేదు. వారికి జుత్తు బెంచుట అవశ్యకమని తోచినది. కవియైనవాడు మేధను బెంచుకొనుట ముఖ్యమని నాకు దోచును. ఏది ముఖ్యమో ప్రాజ్ఞులు గ్రహింతురు గాక!

త్వమేవాహమ్... అని యొకటి వ్రాసినాడు. సినీవాలి యని మరియొకటి వ్రాసినాడు. ఇవి సంస్కృత కావ్యములు గావు. పచ్చి ఆధునిక వచన కవితల కూర్పు. పచ్చియనిన జ్ఞాపకము వచ్చును. ఆరుద్ర పైలాపచ్చీసు యని కూడా ఒకటి రచించినాడు. ఈతడు

రైలుబండిని మానవ జీవితమునకు ముడిపెట్టి ఒక కవిత అల్లినాడు. అందు జీవుని వేదన కొంత స్ఫురించును. భావకతయునూ వున్నది. ఓ కూనలమ్మ యను మకుటములో బద్యములు గిలికినాడు. అవి మిక్కిలి చమత్కారముగా నుండును. అసలు చమత్కారమే యితని మతమని తోచును. ఒక చోట నేనతనికి గురుతుల్యుడనని బేర్కొన్నాడు. నా రచనలు గొన్నింటిని చదివి, యెట్లు వ్రాయకూడదో తెలిసికొంటినని చమత్కరించినాడు. ఏమైననేమి? ఆ 'ఎఱుక' యేదో నా వల్లనే కలిగినది కదా? అజ్ఞానము తొలగించిన వాడు గురువు, సముద్రమున అణిముత్తెములు ఉండును. నత్తగవ్వలును ఉండును. వారి వారి బ్రాప్తము ననుసరించియు, వారి వారి పూర్వజన్మ సుకృతమును బట్టియు అవియవి వారి వారికి లభించును అతని 'ఊహ' యట్లున్నది. అతని కదియే ప్రాప్తమని భావింతును.

ఆరుద్ర పరిశోధకుడు, అని కొందరు చెప్పగా వినియుంటిని. నాలుగు దశాబ్దములుగా చెన్నపట్టణములో నివాసము యుంటూ తెనుగు సాహిత్యము, తెనుగు జీవనము ఇత్యాది అంశములపై నితడు మిక్కిలిగా వ్యాసములు వెలువరించినాడు. జైనము గురించి ఇతనికి గొంత తెలియును.

ప్రస్తుతాంశము షష్ట్యబ్దిపూర్తి. ఆరువది సంవత్సరములు నిండుట యీ వేడుక అయినచో ఆరుద్రకు ఆరువది నిండినవా? లేదు... భాగవతుల శంకరశాస్త్రికి ఆరువది నిండియుండవచ్చును. ఆరుద్ర పుట్టినది తరువాత గదా ! మరి ఆరుద్రకు అరువది యెక్కడివి? కనుక యీ షష్ట్యబ్ది పూర్తి భాగవతుల శంకరశాస్త్రికే గాని ఆరుద్రకు కాదు, ఔను. ఇది యొక చమత్కారము.

**(ఆరుద్ర షష్టిపూర్తి సందర్భంగా ఇది ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసినది. తర్వాత ఉత్సవ నిర్వాహకులు అభినందన సంచిక వేస్తుంటే శ్రీరమణ పేరడీ వుండితీరాలి అని ఆరుద్ర గారే చెప్పారట. ఈ సావనీర్‌కి శ్రీ బి.ఎస్.ఆర్.కృష్ణ, బెజవాడ గోపాలరెడ్డి గారలు సంపాదకత్వం వహించారు.)**

## హైకూలూ,స్మయికూలూ

తెలుగు మాతృక: అజంతా

స్వేచ్ఛానువాదం: శ్రీరమణ

నా నిద్రని మరచెంబులో వడపోసి
గుప్పెడు అక్షరాల్ని పడేసి మూత పెట్టేశా
ప్రతి అక్షరం ఒక పిల్లకల
శ్రీ మద్గురు గురు తావళం పూస.

మో-కాళ్ళ పర్వతం పాకలేను

శ్రీనివాసా దిగిరారా నీకు పుణ్యముంటుంది

అడవిలో తుపాకీ 'బుల్లెట్ గుడ్లు' పెట్టింది.

వార్ గ్రూప్‌లు సమస్తం గ్రూప్ వార్‌లు

మూడో తరం దాటిపోయింది

సపిండీకరణానికి సరైన సమయం

ప్లాట్‌ఫారం మీద కపాలమోక్షాలు అవుతున్నాయి.

రాజకీయ శ్రీరాగంలో ధైవతం వేసుకోవచ్చు శిష్యా

ఈ భూగోళం గంగిగోవు

నా దేశం గంగడోలు

ఆవుపాలూ అనుభూతి పళ్ళూ

జరీ ఉత్తరీయాలూ కవిత్వాల కొలబద్దలు

హైకూలు స్మయికూలు

అందరూ క్యూలో నిలబడండి

వరసగా నరుక్కొస్తా-

**తాజాకలం అను అసలుసంగతి**

పోనీ,

ఓ పని చేద్దాం

చెట్లన్నిటికీ కులాల పేర్లు పెట్టుకుందాం

అప్పుడెలాగూ చచ్చినట్టు బతికించుకుంటాం.

(ఆంధ్రప్రభ దినపత్రిక 1994)

# మధురవాణి ఇంటర్వ్యూలు

'మిసిమి'లో పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు తెలుగు ప్రముఖులతో మధురవాణి ఊహాజనిత ఇంటర్వ్యూలు అద్భుతంగా ఊహించి రాశారు. తర్వాత అవి పుస్తక రూపంలో వచ్చాయి. ఆ పుస్తకాన్ని అదే పద్ధతిలో రివ్యూ చేస్తే సముచితంగా వుంటుందని పురాణంగారి పట్ల నాకు గల గౌరవాభిమానాలతో యీ ప్రయత్నం చేశాను.



పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు లూజు ప్యాంటు మీద 'గీర'ల బుష్ కోటు వేసుకుని, ముక్కు మీదికి జారిపోతున్న కళ్ళజోడుని పదే పదే ముంజేతుల్తో పైకి నెడుతూ - మధురవాణి ఇంటర్వ్యూలు పుస్తకం పరిశీలనగా చూస్తున్నారు. బాపు గీసిన మధురవాణి ముఖచిత్రం కదిలి నట్లనిపించింది. గాజుల గలగలలూ, కాళ్ళ గజ్జెల పట్టెడల గరగరలూ వినిపించాయి. పురాణం గారు తలెత్తి చూశారు. డెమ్మీ సైజు బొమ్మ ప్రాణం పోసుకుని లైఫ్ సైజులో నిలబడి వుంది.

మధురవాణి : (చేతులు జోడించి) నమస్కారం... మీకు థాంక్స్ ఎలా చెప్పుకోవాలో బోధపడడం లేదు.

పురాణం: (ఉలిక్కిపడి కళ్ళజోడు సర్దుకుని కాళ్ళు రెండూ కుర్చీలో పెట్టుకున్నారు)



మధుర : మా గురువుగారు కన్యాశుల్కంలో దొంగ రాస్కెల్స్ మధ్యన పడేసి నా చేత నానా రకాల నాటకాలూ ఆడించారు. మీరు నన్ను మహానుభావుల దగ్గిరసా తీసికెళ్ళి, వాళ్ళ ఒళ్ళో కూచోపెట్టి ఇంటర్వ్యూలు చేయించి నా జీవితాన్ని ధన్యం చేశారు. నాకు మళ్ళీ నూరేళ్ళ ఆయుష్షు పోశారు.

పురాణం : ఎంత మాట...? వాళ్ళందరికీ నువ్వంటే ఇష్టమే. పైగా వాళ్ళంతా అంతో యింతో సరసులే.

మధుర : నువ్వు పురాణం చేతిలో టాకింగ్ డాల్‌వి - నీ పెదాలు అడ్డు పెట్టుకుని వారే మాట్లాడేశారు. పురాణం మహా లావు పెంట్రిలాక్విస్టు అన్నారు గిరీశం గారు.

పురాణం : గిరీశం తెలుగువాడు. వంకలు వెదకడం వాడి ఊపిరి, కదిలింది మధురవాణి పెదాలు కాబట్టే ఇంటర్వ్యూలు రక్తికట్టాయి.

మధుర : ఏమైతేనేం లెండి? పూల వల్ల నారపీచు శిరోధార్యం అయినట్లు మీ చేత వల్ల విశ్వనాథ, జాషువా, నార్ల, బాపిరాజు, శ్రీశ్రీ, చలం,

పంతులుగారు ఇలాగ ఎంతో మంది మేధావులతో సన్నిహిత సంపర్కం ఏర్పడింది.

పురాణం : శివ శివా! సంపర్కం ఇక్కడ పడాల్సిన ముక్క కాదు. ఓవర్ డోసు. పరిచయం అంటే చాలు.

మధుర : డోసేజిలు మీకు తెలిసినంత నాకేమి ఎరుక? పొల్లుమాట అయితే పక్కన పెట్టండి.

పురాణం: నీతో యిదే పేచీ. నువ్వు వసంతసేనకి తక్కువ, చింతామణికి ఎక్కువ.



మధుర : ఔనౌను. వసంతసేన సంస్కృత సాని. నేను అచ్చ తెలుగు, పైగా వ్యావహారికం. దానికేం లెండి? మంచి టేస్టునీ, వ్యాపార సూత్రాలనీ, క్రియేటివిటీని బాగా మిక్స్ చేసి మంచి కాక్‌టైల్‌గా మీరు ఆంధ్రజ్యోతిలో సర్వ్ చేశారని గిరీశం గారు అనగా విన్నాను.

పురాణం : అంటే నేను రైటర్ని కాదనే ధ్వని వుందా?

మధుర : రామ రామ! మీ ఇల్లాలి ముచ్చట్లు యీ భూమ్మీద ఇల్లాలు వున్నంత కాలం వుంటుంది. (నవ్వి) మరి వీటిని 'పెలయాలి ముచ్చట్లు' అంటారేమో!

పురాణం: అది నా గొప్పకాదు. రాసిన వాడి గొప్ప. ప్రతి వాక్యం కోటబుల్ కోట్ అవడం సామాన్యమా? ఆ ఘనత గురజాడకీ, దరిమిలా శ్రీశ్రీకీ దక్కింది.

మధుర : మాటొచ్చింది కనక అడుగుతా. మీకు శ్రీశ్రీ , చాసో, రావిశాస్త్రి, కారా మాష్టార్లంటే ఇష్టంట. కొంచెం ఈస్టెడ్ ఇంటరెస్టు, చిటికెడు కాస్టు ఫీలింగూ...

పురాణం : డోంట్ బి సిల్లీ. యూ నాటీ గాళ్! రావి శాస్త్రి గారు మాత్రం ఓ సారి "నాకు కాస్ట్ ఫీలింగ్ లేదు గాని కొంచెం సబ్ కాస్ట్ ఫీలింగ్ వుందని" డిక్లేర్ చేశారు.

మధుర : ఈ ఇంటర్వ్యూలలో కృష్ణశాస్త్రిగారితో భేటీ లేకపోవడం వెలితిగా వుందని వారి శిష్యులు కురుమెళ్ళ వెంకట్రావుగారు చిన్నబుచ్చుకున్నారు.

పురాణం : ఆయన ఊర్వశికి తప్ప ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వరు.

మధుర : ఈ పుస్తకం 'వాక్సూచి' లో నార్లగారి నంబరు పది. ఆయనకి పదహారో నంబరు మేధావి అని అన్వర్ధనామధేయం వుందిటగా!



పురాణం : మరే... ఆ రోజుల్లో ఎమర్జెన్సీని ఖండిస్తూ తెలుగు మేధావులంతా ఇందిరాగాంధీకి ఓ 'వినతిపత్రం' సమర్పించారు. ఆ సంతకాల జాబితాలో నార్ల వారిది పదహారోది. అప్పట్నించి ఆయన అభిమానులు ఆ పేరుతో పిలుచుకుంటారు.

మధుర : ఎమర్జెన్సీలో అస్త్రసన్యాసం చేయకుండా ఆ మాత్రమైనా నిలబడింది మీరేనట! అండర్‌గ్రౌండ్ వాళ్ళకి ఆశ్రయం యివ్వడం, న్యూస్‌ప్రింట్లు సరఫరా చేయడం, చీకట్లో పాము, శివకాంతలాంటి ఎమర్జెన్సీ వ్యతిరేక రాతలు రాశారట, ఎంత ధైర్యం?

పురాణం: నీకు ఈ సీక్రెట్ ఇన్ఫర్మేషనిచ్చిన ఇన్ఫార్మరెవడు?

మధుర : హెడ్డు కానిస్టీపు... ఈ మధ్యనే చనిపోయిన నక్సలైటు నాయకుడు సాంబశివరావు మీకెంత సన్నిహితుడో కూడా చెప్పాడు. అందుకోండి నా రెడ్ శాల్యూట్! అయినా ఆ పీడకలలు ఇప్పుడెందుకు గాని, మీరు తెలుగువెలుగు చలం పుస్తకంలో పద్మవ్యూహంలో ఇరుక్కున్న అభిమన్యుడిలా చిక్కడి పోయారని విన్నాను!

పురాణం : చలం మీద ఆపాటి సమగ్ర రచన రాలేదు.

మధుర : మీరు క్రియేటివ్ జీనియస్సులే గాని చపలచిత్తులంటే కోప'గింజు'కోరుకదా?

పురాణం: కోపం దేనికి? నాది విశ్వనాథ స్కూలు.

మధుర : మీరీ ఇంటర్వ్యూల్లో ఘనత వహించిన వారి జీవితాలనీ, సాహిత్యాన్నీ వీక్‌నెస్సులీ్ని ప్లస్‌పాంట్స్‌నీ, ఇజాలనీ, నిజాలనీ ఆసుపత్రి ఫుటో (ఎక్స్ రే) తీశారని అన్నారు.

పురాణం : ఎవరు అంట...?



మధుర : మొన్న పబ్లిషర్సు కాంప్లిమెంటరీ కాపీలు, పంపితే వాళ్ళందరికీ యివ్వాలని వెళ్ళా. అందర్నీ కలిసి తలో ప్రతీ దాఖలు చేసుకున్నా. కాని జాషువా విషయంలో...

పురాణం: (కళ్ళజోడు పైకి లాగి) ఆఁ ... జాషువా విషయంలో...?

మధుర : ఒకరిద్దరు అన్నారు కదా- ఆయనకి జరిగినన్ని సన్మానాలు తెలుగు కవుల్లో ఎవరికీ జరగలేదు. నవ్యాంధ్ర మహారాష్ట్రానికి పీష్వా మా జాష్వా అన్నారట అమరేంద్ర. విశ్వనాథవారు సరస్వతీసాక్షాత్కారం పొందిన కవి అన్నారట. ఆయన పద్యాలు తెలుగువారి గొంతుల్లో తారాడాయి. పద్మభూషణుడైనాడు. గజారోహణలు,

గండపెండేరాలు అనుభవించారు. ముద్దుకృష్ణ వైతాళికులలో చేర్చకపోవడం వల్ల జాషువాకి అధిక మిక్కిలి కీర్తి వచ్చిందన్నారు. ఇంకో మాట కూడా అన్నారు. తాను పంచముడననే మాట పదేపదే గుర్తు చేసి బ్లాక్‌మెయిలింగ్ ధోరణి ధ్వనింపచేశారన్నారు.

పురాణం : ఎవడీ కూత కూసింది?

మధుర : వెంకటేశం.

పురాణం : అయితే ఖాతరు చెయ్యడం దేనికి? మిగతావాళ్ళ అభిప్రాయాలు ఏమిటి?



మధుర : నార్లగారు "... ఏడ్చి అతగాడికి విషయాలు పూర్తిగా తెలియవు- ఏకపక్షంగా రాసి ఏడ్చాడు" అన్నారు.

"జాగర్తగా వెదికితే అక్కడక్కడ కొన్ని యదార్థాలు వున్నా ఇది పుక్కిటి పురాణం... ఛీ!" అని తూస్కారంతో పుస్తకం తిరిగి యిచ్చేశారు విశ్వనాథ... "పురాణ మిత్యేవ న సాధు సర్వం" అన్నారు శ్రీశ్రీ.

గుడిపాటి వెంకటచలం గారు "అంతా ఈశ్వరాశీర్వాదం" అంటూ పుస్తకం అందుకుంటూ నా చెయ్యి పట్టుకున్నారు.

రావిశాస్త్రిగారు "ఇందులో కొన్ని ఎక్స్‌పార్టీ డిక్రీలున్నాయ్" అన్నారు. అడివి బాపిరాజుగారు పమిట నిండా కప్పుకు కూచుంటే మోడల్‌గా ఓ బొమ్మ వేసుకుంటానన్నారు. పారిపోయి వచ్చేశా.

పురాణం : ఎవరి ఓపీనియన్స్ వాళ్ళవి. పొగడ్తలో వున్న సుఖం విమర్శలో వుండునా?

మధుర : వుండదని భావము. అది సరే గాని, మిరియాల కషాయం పిచ్చిక మీద బ్రహ్మాస్త్రం కదా?



పురాణం : ఇది మరీ బావుంది . మూలిగే నక్క మీద తాటిపండని... అంత లావు శ్రీశ్రీ థీసిస్సుని పిచ్చుక అంటావా? తెలివి మీరావు సుమీ!

మధుర : నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష! మా ట్రూపులోంచి మునుపు ముళ్ళపూడి వెంకటరమణగారు గిరీశం గారిని చెన్నపట్నం తీసికెళ్ళి తెలుగుదనంతో లెక్చర్లిప్పించారు.

పురాణం: తెలుసు. గిరీశం గారి మాస్క్ తగిలించుకుని - ముఖ్యంగా సినిమా వాళ్ళని ఏకి, పరుపులూ, దిళ్ళూ కుట్టించుకున్నారు. క్రౌంచ మిథునంలో కిరాతుడు ఓపక్షిని కొట్టడం వల్ల - ఫస్ట్ విడో ఆఫ్ ది

యూనివర్స్ ఏర్పడి అది రామాయణానికి నాంది పలికిందని గిరీశంగారితో ముళ్ళపూడి అనిపించారు. విశ్వనాథ, ఉషశ్రీ వింటే సంతోషిస్తారు.

మధుర : వాకాటి పాండురంగారావు ఈ పుస్తకానికి మొదట్లో ఆంగ్లంలో రాసిన కాంపోజిషన్ చాలా బావుంది.

పురాణం : తప్పు కాంపోజిషన్. అనకూడదు. ఆవుమీద, కొబ్బరి చెట్ల మీద రాస్తే అది కాంపోజిషన్. దీన్ని పెన్ పాట్రేయట్ అంటే కవి యొక్క సమగ్ర రూపాన్ని అక్షరాల్లోకి దించడం.

మధుర : ఓహో! అయితే అదన్నమాట! (నవ్వి) ఈ బుక్కు మీరు భరాగో గారికి అంకితం ఇస్తే ఆయన తిరిగి అలపాటి రవీంద్రనాధ్ గారికి దత్తం చేశారు. చివరికి కృతిభర్త విషయంలో కూడా నా వృత్తిధర్మాన్ని వదల నిచ్చారు కాదు. మీరంతా మేధావులు.



పురాణం : అది మీ భరాగో పెద్ద మనసు. అపార్థం చేసుకోకు.

మధుర : ఇంత మంది మేధావుల సాహిత్యాన్నీ, జీవితాన్నీ క్షుణ్ణంగా స్టడీ చేసి... సహజమైన మీ హాస్య ధోరణిలో ఊహాజనిత సంభాషణలను చెండు కట్టారు. ఒక్కోసారి మీరు...

పురాణం : దాచడం దేనికీ? అనేదేదో అను!

మధుర : మీరు గిరీశం గారి కంటే అసాధ్యులు!(నవ్వుతుంది)

పురాణం : అంతటి లౌక్యమే వుంటే జీవితాంతం ఇంత రొష్టు పడతానా మధురవాణీ?

మధుర : అయితే మీరు సురేంద్రనాథ్ బానర్జీ అంతటి వారు !(జారిన కళ్ళజోడు పైకి నెడుతుంది)

ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 1-9-1997

# రైలుబండిలో వైతాళికులు



**నవయుగ వైతాళికులు అందరూ ఒకే చోట తారసపడడం చాలా అరుదైన సంఘటన. అందరూ కలసి రైలు ప్రయాణం చేయడం మరీ అపూర్వం. అట్లాంటి సంఘటనని వూహించి రాయటానికి ప్రయత్నించాను.**

**వారిపట్ల నాకు గల గౌరవాభిమానాలే దీనికి ప్రేరణ. పాఠకులు సహృదయంతో స్వీకరించ ప్రార్థన.**

రైలు బయలుదేరింది.

రైలు పెట్టి నవయుగ వైతాళికులతో కిటకిటలాడుతూంది.

విశ్వనాథ, కాటూరి, పింగళి, దేవులపల్లి, శ్రీశ్రీ, పిలకా, మొక్కపాటి, శివశంకరశాస్త్రి, జలసూత్రం... వీరందరితో రైలు బోగి కళకళలాడుతోంది.

రైలు మెల్లమెల్లగా వేగం అందుకుంటోంది. ఆంధ్ర సరస్వతి పల్లకిలో ఊరేగుతున్నట్టుంది. రైలు ఊగుతూ సాగుతోంది. తెలుగు పలుకు ఊయలలూగుతున్నట్టుంది. రైలు వేగం అందుకుంది. విజ్ఞాన సర్వస్వం పుటలు రెపరెపలాడినట్లయింది.

****

కిటికీ పక్కసీటులో దుడుకు మీసాలు, ఎర్రటి రూపం దిట్టమైన అంచున్న ఖద్దరు పంచె సిల్కు లాల్చీతో కాటూరివారు కూర్చున్నారు. పక్కన వెడల్పు మూతి వున్న సీసాలో చుట్టబెట్టిన పొగాకు కాడలు - సరిజోడుగా అగ్గిపెట్టి - సన్నగా, పొడుగ్గా సనాతనంగా తాళపత్ర గ్రంథంలా వున్న విశ్వనాథవారు ఎదురు సీటులో కూర్చుని కాటూరి వారిని శ్రద్ధగా గమనిస్తున్నారు.

ఆయన పొగాకు కాడ తీసి, పైనంగా పాయి చీల్చి, చుట్ట చుట్టే పనిలో త్రికరణ శుద్ధిగా లీనమైపోయారు.

"మీకు పాయలు తీయడమే వచ్చు... మా బాపిబావకి జడవేయడం కూడా వచ్చు..." కొంటెగా అని-



**రావోయి ! సిన్నవాడ**

**మావాడ**

**అడివోరి సిన్నవాడ**

**రావోయి సిన్నవాడ-**

అంటూ పాడడం ఆరంభించారు విశ్వనాథ.

పిలుపుపాట వింటూనే బాపిరాజుగారు అవతల వింగ్‌లోంచి వచ్చారు. కళహంస కదలి వచ్చినట్టు...

"ఇంతకీ నిర్వాహకులు సరసులేనా... ఓ శాలువా ముక్కయినా కప్పుతారంటారా..."- జనాంతికంగా అన్నారు విశ్వనాథ.

"ఏమో? దండల వరకూ శ్రీపాద హామీ పడ్డాడు కదా... వెళ్తోంది కాకినాడ కనుక లంకపొగాకు పుష్కలం... ఇక మిగతావంటారా... మన ప్రాప్తం- వారి దయ..."

చుట్టపొగలోంచి కాటూరి వారు వదలిన మాటలివి.

నొసలు కదిలించారు పింగళి లక్ష్మీకాంతం గారు. త్రాసుముల్లులా నొసటనున్న గీరునామం కదిలించి కొంచెం ఆవేశధోరణిలో "అయినా మనం వెళ్తోంది మంగపతి గారింట్లో పెళ్ళికి. వీరమ్మపెళ్ళిలోనే నారిగాడికి వొడక సోగని - ఈ పెళ్ళివంకన వారి నెత్తిన సాహితీసమితి యావత్తూ దిగిపోయి సర్వసభ్య సమావేశం పూర్తి చేసుకోవాలని గదా బయలుదేరాం – ఊరికే పెట్టే అమ్మ నీ మొగుడు బంతిన పెట్టమన్నట్టు... ఇంకా శాలువాలూ, సన్మానాలూ కూడానా..." అన్నారు పింగళి.

"నిర్వాహకులు సరసులేనా... అన్నాను. దానికంత కంఠశోష ఏల?" అన్నారు విశ్వనాథ, పింగళి వారిచ్చిన జవాబు తనకేనని గ్రహించి,

"కాకినాడ పౌరుల ఔదార్యాన్ని శంకించనక్కరలేదు. ప్రతిభకి వారెప్పుడూ పట్టం కడ్తారు. నేనెప్పుడూ అక్కడ నుంచి శాలువా లేకుండా రాలేదు మరి..." అప్పర్ బెర్త్ మీంచి దేవులపల్లివారి గళం పలికింది - కిందనే ఉన్న కాటూరివారి వైపు చుట్టకోసం చెయ్యి చాపుతూ అన్నారాయన.

"ప్రతిభ మాట ఎలా వున్నా- ప్రాంతీయాభిమానం కొంత అఘోరిస్తుంది కదా..."- విశ్వనాథ వారి విసురు.

గంభీర వాతావరణం ఆవరించింది. రైలు పెట్టెలో పరిస్థితి గ్రహించిన పిలకా గణపతి శాస్త్రి గారు - వున్నట్టుండి ఒక్కసారి కళ్ళు పెద్దవి చేసి బోలెడు ఆశ్చర్యం నటిస్తూ...

"ఆహా... ఏమి బిస... ఏమి బిస... ఆ యొక్క రాక్షసబొగ్గుతో ఇంతమందినీ లాక్కుని ఈ విధంగా ఛుకు...ఛుకు మని అలుపూ సొలుపూ లేకుండా పరుగెత్తడం వుంది చూశారూ... అరెరెరెరె... ఏ మాశ్చర్యం...?" అని అందరివైపు నోరు తెరిచి చూశారు.

అప్పుడే వస్తున్న జలసూత్రం రుక్మిణీ నాథ శాస్త్రి ఆశ్చర్య ప్రకరణమంతా విని-



"మనవాళ్ళు మామూలు తోటకూర తిని మహాకావ్యాలు రాసేస్తుండగా లేంది - బొగ్గుతో రైలు నడపడంలో ఆశ్చర్యం ఏముంది లెండి..." అన్నారు సౌమ్యంగా. ఉత్తరీయాలు వున్న వాళ్ళూ, లేని వాళ్ళూ కూడా ఒక్కసారి బుజాల మీద చేతులు వేసుకున్నారు.

తల్లావఝల శివశంకరస్వామి నీటుగా సింగిల్ సీటు మీద రైల్లో కూడా నేను సభాపతినే అన్నట్టు కూచున్నారు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్న భంగిమలో.



జల సూత్రం ఓ క్షణం ఆగి "రైలు పట్టాల్ని చూస్తుంటే మా సభాపతి గారి కవిత్వం జ్ఞాపకమొస్తుంది నాకు -అడ్డంగా వేసిన బద్దీలు నిక్కచ్చిగా కొలిచి తూచి వేసినట్టుంటే ఆయన పద్యపాదాల్లాగూ, క్రమంగా వుంటాయి. ప్రతి ఎనిమిదింటికీ దూరం తగ్గించి కాస్తంత దగ్గరగా నాలుగు బద్దీలుంటాయి. చూశారూ - సీసపద్యం కింద ఎత్తుగీతి లాగు - సమాసాల కంకరరాళ్ళు సరేసరి - అటూ ఇటూ కొలిచి కొట్టిన మార్జిన్లు లాగు ఇనుప కమ్మీలు... స్వామి వారి పద్యాలని తెచ్చి పొడుగ్గా పేర్చుకుంటూపోతే రైలు పట్టాలే సుమండీ..." అనేసి మెరుపులా మాయమైపోయారు.

"ఉపమ బేషుగ్గా వుంది..." అని ముక్తకంఠంతో అక్కడ వున్న వారందరికీ అనాలనిపించింది. కాని తమాయించుకున్నారు.

శివశంకరస్వామి వారు మాత్రం గొంతు పెగలనంతగా వుక్రోషించారు. వుపాయం తోచక వూరుకున్నారు.

అలక్ష్య లక్ష్య లక్షణంగా పైజమా పైచొక్కా వేసుకుని నామార్గం వేరన్నట్టు ఇవతల కక్ష్యలో కూచుని హారీన్ ఛట్టో చదువుకుంటున్న శ్రీశ్రీ

స్వామివారి వంక ఓ చూపు చూసి కళ్ళద్దాలు సవరించుకున్నారు. అంతా నిశ్శబ్దం. వాతావరణం దిగులుగా వుంది.

ఇంతలో ఏపిల్... ఏపిల్... పావలా అని గుక్క తిప్పుకోని కేకతో పళ్ళబ్బాయ్ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు.

ఆ సమయంలో పళ్ళబ్బాయ్ పెద్ద ఆసరా అయ్యాడు అందరికి - అప్పట్లో భావకవిత్వం బ్రేక్ త్రూ అయినట్టు-



"కొంటే బావుంటుంది" - అన్నాడు పింగళి.

"తింటే మరీ బావుంటుంది" అన్నారు కాటూరి.

"జంట కవిత్వం బానేవుంది... అయితే నేను కొనాల్సిందేనా..." అంటూ ఎంపిక చేసి పది పళ్ళు బేరం చేశారు విశ్వనాథ.

మిగిలితే మాత్రం నాకోటి ఇవ్వండి" అన్నారు గణపతిశాస్త్రి.

విశ్వనాథ వారు తలొకటి పంచి తనొకటి నోటికి తగిలించారు. పక్క క్యూలోంచి శ్రీశ్రీ బుసకొట్టిన శబ్దం చేసి "ఏపిల్ బూర్జువా వ్యవస్థకి ప్రతీక..." అన్నారు.

"అయితే మీరు జామిపళ్ళు తప్ప తినరా ఏమిటి? ఏప్ అంటే వానరము. ఏపిల్స్‌ని నేను హనుమత్ప్రసాదంగా తింటూ వుంటాను..." విశ్వనాథ ఏపిల్ నముల్తూ అన్నారు.

మరోసారి హుంకరించి ఛట్టోలోకి వెళ్ళిపోయారు శ్రీ శ్రీ.

ఉన్నట్టుండి కమ్మని అత్తరు వాసన గుప్పున తగిలింది. అందరూ ముక్కుపుటాలెగరేసి పైకి చూశారు.

అప్పర్ బెర్త్ మీద కూచున్న కృష్ణశాస్త్రి గారు అత్తరులో దూది తడిపి పైనంగా టిక్కెట్లకి రాస్తున్నారు - ఎంకిపాట హమ్ చేస్తూ.

అది గమనించిన విశ్వనాథ నవ్వు ఆపుకుని -"అన్నట్టు మన టిక్కెట్లెక్కడ?" - అన్నారు.

"రుక్మిణినాథం దగ్గర వుంటాయ్" అన్నారు కాటూరి వారు చాలా నిర్లక్ష్యంగా చుట్టనోటితో -

"ఉంటాయ్- అని వూహించడం కాదు - వున్నవారికి - అది ముఖ్యం- అడుగో రంకు మొగుడల్లే టిక్కెట్లవాడు రానే వస్తున్నాడు."

ఇంతలో టి.టి.ఇ. "టికెట్ సార్ టికెట్" అంటూ వచ్చాడు.

"మాటలోనే వచ్చారు... వెయ్యేళ్ళు... మా రుక్మిణినాథం దగ్గర వున్నాయి"

"ఆయనెక్కడ..."

"ఇప్పటిదాకా ఇక్కడే వున్నారండీ... ఇప్పుడే వస్తాడు..." శి.శ. స్వామి వారికి కోపం ఇంకా తగ్గలేదు.




అప్పర్ బెర్త్ మీద కూచున్న కృష్ణశాస్త్రి గారిని "సార్ మీరు దిగిరండి. టికెట్ ప్లీజ్..." అన్నాడు.

**"దిగిరాను దిగి రాను**

**దివి నుంచి భువికి**

**దింపి వేతురు గాక**

**నాకేటి వెరపు"-**

అన్నారు కృష్ణశాస్త్రి గంభీరంగా-

ఏమీ అర్థంగాని టిక్కెట్లవాడు "తమరెవరు? ఎక్కడికి వెళ్ళాలి" అన్నాడు టిక్కెట్ల కోసం చెయ్యి జాపి.

**"నా నివాసమ్ము తొలుత గంధర్వలోక**

**మధుర సుషమా సుధాగాన మంజువాటి**

**ఏ నొక వియోగ గీతిక."**

అనగా విని, కాలము వ్యర్థపుచ్చ నిచ్చగించక, టిక్కెట్లందుకొనుచు ఆ కవికి టి.టి.ఇ. నిట్లనియె:

"టికెట్ ప్లీజ్"

కృష్ణశాస్త్రి గారు చహల్‌తో లాల్చీ జేబులో చెయ్యిపెట్టి ఘుమ ఘుమ లాడుతున్న రెండు టిక్కెట్లని అందించారు. టి.టి.ఇ. ముక్కు లెగరేసి అదోలా ఆయన వంక ఓసారి చూసి -

"ఈ రెండో టిక్కెట్ ఎవరిది" అన్నాడు.

"నా ఊర్వశికి..."

"వేరీజ్ షీ...?"

"ఎదలోపలి యెదలో, సెమ్మదిగా, జీవిత రహస్యమార్గమ్ములలో"

..........



కింద నున్న కురుమెళ్ళ వెంకట్రావు గారు గురువుగారి హటం చూసి కంగారు పడ్తున్నారు. దిగిరండి అంటే దిగిరాను అంటున్నారు. ఆయనకి అంతా అయోమయంగా ఉంది.

**"సంధ్యావసాన**
**సమయమున నీప సాపద శాఖికాగ్ర**
**పత్ర కుటిలముల లోపల వసించు**
**ఇరుల గుసగుసల్ వానిలో నిపుడునపుడు..."**

టి.టి.ఇ. అయోమయంలో పడి "అయ్యా ఏమిటి వారసేది" అని కురుమెళ్ళ వారిని అడిగారు.



**"... ఏదియొ అపూర్వ మధుర**
**రక్తి స్ఫురియించుగాని అర్థమ్ము కాని**
**భావగీతమ్ములవి..."-**

అని కురుమెళ్ళవారు సమర్థించి చెప్పారు.
ఆ రెండో టిక్కెట్టు నా కోసం తీసుకున్నారని కూడా నచ్చ చెప్పారు. పొయిట్రీ వదిలేసి లెఖ్ఖ సరిపెట్టుకున్నాడు టి.టి.ఇ.

"... కాదు.. కాదు... ఇతనికి కాదు... ఇది నా ఊర్వశికే

**నిదురలో స్వప్నాల కదలికే బరువైన**
**కలలెల్ల కనులిచ్చి కాల్చు నా గతియేమి!"**

అని దేవులపల్లి వాదిస్తే-

"అయ్యా- మధ్యలో దింపేస్తే నా గతి ఏమిటో ఆలోచించండి" ప్రాథేయ పూర్వకంగా వారించారు వెంకట్రావుగారు.

టిక్కెట్లవాడు ఇదంతా గమనించి దేవులపల్లి వంక జాలిగా చూసి వూరుకున్నాడు.

విశ్వనాథకి చెయ్యి జాపి-

"టికెట్ సార్..."

"లేదు"

"లేదా... ఇందాక ఎక్కడో వుందన్నారు?"

**"ఔను. అంటాను.**
**అల నన్నయకులేదు తిక్కనకు లేదు..."**

"వాళ్ల సంగతి సర్లెండి. మీ సంగతి చెప్పండి- పైగా మీరెవరో పెద్దమనిషిలా వున్నారు..."

వి.స.గారు వాని వంక విసవిసా చూసి

**"నన్నునెఱుగరో తెలుగునాట మీరు**
**విశ్వనాథ కులాంబోధి విధుని బహు వి**
**చిత్ర చిత్ర ధ్వని బహువిచ్ఛిత్తి మన్మ**
**హాకృతి ప్రణేత సత్యనారాయణ కవి"-**

అని కంఠమెత్తి పాడారు.

"పద గుంఫన మమోఘము..." అని వ్యాఖ్యానించారెవరో- బహుశా కాటూరి వారే కావచ్చు.

టి.టి.ఇ. అందుకేమీ రియాక్ట్ కాలేదు.

'పక్కన నిలబడండి అన్నట్టు సైగచేసి కాటూరి వారిని సమీపించాడు.

కాటూరి వారు మౌనంగా పింగళి వారిని చూపించారు.

"ఇదేం పద్ధతిగా లేదు. ఎంత జంటకవులమైనా, జవాబు కలిసే చెప్పాలా ఏమిటి? ఈ క్లిష్ట సమయంలో నా మీద భారం మోపకండి... మీరే చెప్పండి ఆ సంజాయిషీ ఏదో..." చుట్ట తియ్యకుండా. "ఉహు... ఉహు..." అనడం తప్ప కాటూరి వారి జవాబు లేదు.

టి.టి.ఇ.కి ఇదేదో ఓ ముఠా అనీ, టికెట్ లేని ట్రావెలర్స్ అనీ అర్థమైపోయింది-

అసలే లాలిత్యం - ఆపైన భయం - బాపిబావ మెలికలు తిరిగి పోతున్నారు- పక్కన నిలబడి.

"టిక్కెట్ ప్లీజ్..." అనగానే బాపిరాజుగారు నీటి చిమ్మెన ఒక్కతూరి పైకెగసినట్టు ఇట్లు ఆరంభించిరి-



"బెజవాడ నుంచి కాకినాడ పోర్టు స్టేషనుకు టిక్కెట్టు కొని యుంటిని. నేను రూపాయి నాణెము ఇవ్వగా టిక్కెట్టుయున్నూ మూడణాలన్నర తిరిగి ఇచ్చినాడు. అతడిచ్చిన టిక్కెట్టు రెండంగుళముల ముప్పీసము పొడవు, అంగుళము బైన ఆరువీసముల వెడల్పూ, రెండు నూళ్ళ మందమునూ, అరతులము బరువున్నూ కలిగి యుండెను. దానిపై ఏడు అంకెయు, దానికి ముందు రెండు సున్న వున్నవి. మొదటి అంకె అయిదు తదుపరి నాలుగు వున్నది. తెలుపు పసుపు కలిసేత వర్ణములో కుడి అంచు పై భాగమున నల్లని చార కలిగియుండెను. చీనా దేశములో జలవర్ణ చిత్రములను ఇదే కొలతలు గల ఫలకముపై చిత్రించు నాచారము కలదు. ఇట్టి వానిని మినియేచరు చిత్రకళ అని వ్యవహరింతురు..."

"మహాప్రభో నన్ను వదిలెయ్యండి" అని గావుకేక పెట్టి టి.టి.ఇ. అవతలి వైపుకి నిష్క్రమించినాడు.

"నీ శైలికి గొంత శక్తియున్నది"- అని విశ్వనాథ బాపిబావని అభినందించిరి.



"రేపు సాహితీ సమితి సమావేశంలో - మన సభ్యులకు రైళ్ళలో, బస్సులో, లాంచీలో, రేవు పడవలో టిక్కెట్ కొనే అగత్యం వుండరాదని ఒక తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపజేసి, వాటి నకళ్ళు తీసి సర్కారు వారికి సమర్పిస్తాను..." సభాపతి హోదాలో హుకుం జారీ చేశారు శివశంకరస్వామి.

"రేపటి సంగతి సరే... ఇప్పటి మాటేమిటి?"

"అసలింతకీ మన రుక్మిణీనాథం ఏమైపోయినట్టు..."

టి.టి.ఇ. వచ్చే స్టేషన్‌లో దిగిపోవాలని నిష్కర్షగా చెప్పేశాడు.

అంతా గందరగోళంగా వుంది - కవులలో కలకలం.

"కర్మఫలము అట్లున్నపుడు ఒక యూరి కరణము మరియొక ఊరి కాపు కాక తప్పదు. మనము రుక్మిణీనాథమును నమ్మితిమి. మనిషి మనిషిని నమ్మును, లేనిచో మానుని నమ్మునా? నమ్మడు. నమ్మక మనగానేమి? అది యొక మానసిక ప్రవృత్తి. నమ్మకము పేరు. విశ్వాసము పేరు. సమాజము - అనగా మనుషుల గుంపు. ఇందు కొందరు అంజనీ బుత్రులు కొందరు ఆషాడభూతులు. అతడు నమ్మిన బంటు. ఈతడు కాదు. అది మనకు తొలుత తెలియునా? తెలియును. తెలియదు. ఇది యొక చమత్కారము..."

"చస్తుంటే సంధ్యమంత్రమని- నడుమ మీ మధ్యాక్కరలా..." అని పింగళివారు వారించారు.

ఈ సందడిని చీల్చుకుంటూ ఓ కంచు కంఠం విన్పించింది-

**"పతితులార!**
**భ్రష్టులార!**
**దగాపడిన తమ్ములార!**
**ఏడవకండేడవకండి!**
**వచ్చేశాయ్, విచ్చేశాయ్,**
**జగన్నాథ**
**జగన్నాథ**
**జగన్నాథ రథచక్రాల్**
**వచ్చేశాయ్, విచ్చేశాయ్..."**



అని శ్రీశ్రీ కంఠం, రైలు పెట్టి మార్మోగింది.

అంతా బిక్కు బిక్కుమంటూ నిశ్శబ్దంగా చూస్తున్నారు.

"ఏమిటయ్యా - మా టికట్లుగాని నీ జేబులో వున్నాయా? అంతలా భరోసా యిస్తున్నావ్" అని సూటిగా అడిగారు విశ్వనాథ.

"ఇతరేతర కారణాలవల్ల నేనేమీ చెప్పదల్చుకోలేదు" ముక్తసరిగా అన్నారు శ్రీశ్రీ-

టి.టి.ఇ. మాత్రం గేటు వైపు జారుకున్న గణపతిశాస్త్రి గారిని నిలదీశాడు.

టిక్కెట్ కోసం చెయ్యి జాపగానే - టిక్కట్లవాడి అరచెయ్యి సాగదీసి నవ్వబోతూ "అరెరె... వండర్ ఫుల్... ఇది చెయ్యి కాదు. అయ్యా తమరు నమ్మాలి - నేను తిరిగొచ్చేప్పటికి మీరిక్కడ వుండరు... ఆ రేఖ మహాత్యం అలాంటిది" గణపతిశాస్త్రిగారి జ్యోతిష లౌక్యానికి టి.టి.ఇ. పడిపోయాడు. కొంచెం సిగ్గుపడి చెయ్యి వినయంగా అందించాడు. శాస్త్రిగారు ఏకధాటిన వున్నవీ లేనివీ చెప్పి టిక్కెట్ గండం తప్పుకున్నారు.

శ్రీశ్రీ వంతు వచ్చింది. టిక్కెట్ లేదు. పైగా అందరికీ భరోసా ఇవ్వడం కూడాను. ఇదంతా గమనించి-

"ఎవరు మీరు" అన్నాడు టి.వాడు



**"భూతాన్ని**
**యజ్ఞోపవీతాన్ని**
**వైప్లవ్య గీతాన్ని నేను"**

"కవిత్వంలో దేనికి? తెలుగులో చెప్పరాదుటయ్యా" అన్నారెవరో.

"నేను శ్రీశ్రీని. ఈ శతాబ్దం నాది"

"కావచ్చు. కాని ఈ రైలు శ్రీ సర్కారు వారిది" అన్నాడు టి.టి.ఇ.

"మొన్నటి దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపింది. ఇప్పుడు దాన్ని నేను నడుపుతున్నాను..."

"అవచ్చు. కాని ఈ రైళ్ళని ఇండియన్ రైల్వేస్ వారు నడుపుతున్నారు"

**"ఔను నిజం, ఔను సుమా నీవన్నది నిజం నిజం"**

అనేసి శ్రీశ్రీ సీటుమీద కూచుని, నిట్టూర్చి మళ్ళీ హారీభట్టో లోకి వెళ్ళిపోయారు.



తనంతట తానే ఎదురు పడి "నేనేమోనూ... సారీ. ఐ యామ్ మిస్టర్ నరసింహశాస్త్రి మొక్కపాటి ఆఫ్ మొగల్తూర్- ఆథర్ ఆఫ్ బారిష్టర్ పార్వతీశం ది గ్రేట్..." అని టి.టి.ఇ.కి ఘట్టిగా షేక్ హ్యాండిచ్చి పరిచయం చేసుకున్నారు.

"తర్వాణి అన్నం, ఆవకాయ, మంచినీళ్ళు, మర చెంబు పంటి కిందకి వుంటాయని మామిడి తాండ్ర, జంతికలూ తెచ్చుకున్నాను. బట్ టికెట్ ఫర్గాటెన్..."

టిక్కెట్లవాడు వుదాసీనంగా విని, రైలు ఆగే స్టేషన్ కోసం చూస్తున్నాడు- ఓ నిర్ణయానికి వచ్చేసి.

కొందరు వినయం ప్రదర్శిస్తూ నిలబడ్డారు.

కొందరు 'కానున్నది కాక మానునా' యని కూర్చున్నారు.

కాటూరివారు చుట్ట కాల్చడం మానలేదు.

"చుట్ట పారెయ్యండి. బొత్తిగా లౌక్యం తెలీదు..." అని గుసగుసలు విన్పిస్తున్నాయి.

కృష్ణశాస్త్రిగారి అత్తరు పరిమళం తగ్గలేదు.

కురుమెళ్ళవారు స్తిమితపడ్డారు. సభాపతి ఈ విధంగానైనా రుక్మిణీ నాథానికి శాస్తి జరుగుతుందని లోలోపల తృప్తి పడుతుండగా- రైలు ఆగింది-




శ్రీశ్రీ చేత 'రుక్కాయ్' అని పిలవబడే రుక్మిణీనాథం రొప్పుతూ రోస్తూ రావడం కన్పించింది.

అందరికీ జ్యోతిర్దర్శనం అయినంత సంతోషమైంది.

"కొంప ముంచావు కదయ్యా..." అన్నారంతా ముక్త కంఠంతో.

"ముంచేవాడినైతే అసలు రాకే పోదును కదా..." అన్నారాయన.

"ఇంతకీ టిక్కెట్లెక్కడా..."

"నోట మాట రావడం లేదు. కొంచెం స్తిమిత పడనీండి"

జలసూత్రం వెనకాల, తరుముకు వస్తున్నట్టు - ఎర్రరంగు సేలం పట్టుపంచె, పైన నిండుగా వుత్తరీయం కప్పుకుని ఓ నిండైన విగ్రహం కదలి వస్తూంది. ఆయన చేతిలో వెండి చెంబు - అందులో దర్భతో కట్టిన కూర్చ... మధ్య మధ్య మనిషి తగిలినపుడల్లా ఆగి, చెంబులోంచి కూర్చోదకం నెత్తిన జల్లుకు ముందుకు సాగుతున్నారు. కాలుతూన్న ప్లాట్‌ఫాం మీద కాళ్ళకి చెప్పులు కూడా లేవేమో మరీవేగంగా నడుస్తున్నారు.



"ఏమోయ్... సఖుడా! కుశలమా?" అన్నారాయన కవులు అందర్నీ వుద్దేశించి.

"తమరా మహాశయా..." అన్నారంతా. ఆయన రాయప్రోలు సుబ్బారావుగారు. అమలిన శృంగార చక్రవర్తి!

"కాళ్ళకి జోళ్ళు తగిలించుకోకూడదూ..." అన్నారు కాటూరి వారు.

**".... ఈ అనంత భూతలిని మన భూమి వంటి చల్లని భూమి లేదు. ఏదేశమేగినా, ఎందుకాలిడినా..."**

అన్నారాయన గాంభీర్యంగా

"ఈ జీవుని వేదన ఈ జీవిది..." అని విశ్వనాథ ప్రకాశంగా నిట్టూర్చారు.

జలసూత్రంవారి రొప్పు తగ్గింది. అందరూ ఆయన వంక గుచ్చి గుచ్చి ముద్దాయిని చూసినట్టు చూస్తున్నారు.

"అమలిన శృంగారానికి ఆడవాళ్ళ పెట్టి దేనికి..." అప్పర్ బెర్త్ మీంచి కృష్ణశాస్త్రి ప్రశ్న.

"స్త్రీ లేక శృంగారము వుండదు కదా" నా అమలిన శృంగారం ఆడవాళ్ళ పెట్టిలోనే సాధ్యమోయి సఖుడా" అని రాయప్రోలు వారి జవాబు.

"పైగా క్షణ క్షణం ఈ నెత్తిన నీళ్ళు జల్లుకోడం... మీద పడ్డాయని కో పాసెంజెర్లతో ఘర్షణలూ - సర్ది చెప్పి తీసుకొచ్చేసరికి నా తలప్రాణం తోకకి వచ్చింది... మరో పులి మీద పుట్ర. ఆడవాళ్ళ పెట్టెలో గుడిపాటి వెంకటాచలం నన్ను ముట్టుకున్నాడు స్నానం చేయాలంటూ వీరు నన్ను తింటున్నారు..." ఘాటుగా నిట్టూర్చారు జలసూత్రం.

"సర్లే- టిక్కెట్లివ్వండి..."

"నా దగ్గర అన్నీ లేవు- కొన్నే వున్నాయి."

"అదేమిటయ్యా - అన్నీ నీ దగ్గరేగా వుంట..."

"నిజమే. అది వేరే కథ. గుడిపాటి వెంకటాచలం మొదట్లోనే మనతో చీలిపోయి ఇంకో లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కాడు కదా! ఆ బోగీలో నిలబడి అయిదారు స్టేషన్లదాకా వుమెన్స్ లిబ్ మీద వుపన్యాసం యిచ్చాడు..."

"ఆ తర్వాత..." అడిగారెవరో ఆత్రంగా.

"తర్వాత... ఏదో స్టేషన్‌లో అయిదారు మంది స్త్రీ ప్యాసింజర్లతో దిగిపోయాడు. ఇప్పుడు నా దగ్గర టిక్కెట్లలో అయిదు షార్టు..." అని కథ ముగించారు రుక్మిణీనాథం.

"మరీ ఆశ్చర్యం... పైగా అయిదారుగురినా... అమ్మో?" అని ఆశ్చర్యంతో మునిగిపోయారు పిలకా గణపతిశాస్త్రిగారు. రాయప్రోలువారు అందరిమీదా కూర్చోదకం చల్లారు. కూతవేసి రైలు బయలుదేరింది - వైతాళికులతో.

(ఆంధ్రజ్యోతి వారపత్రికలో 1979 లో ప్రచురించబడింది. 1994 అక్టోబరులో 'ఆహ్వానం' మాసపత్రికలో పునర్ముద్రించబడింది.)

# స్వపరిచయం అను బయోడేటా

పుట్టిందీ- పెరిగిందీ మహాకవి శ్రీశ్రీ పుట్టిన చోటుకు దక్షిణ దిశగా సరిగ్గా 158 కిలో మీటర్ల దూరాన-

దివిసీమ తుఫాను వచ్చిన రోజుకి వారం ముందు మా పెద్దబ్బాయి మూడో పుట్టిన రోజు. వాడు పుట్టేటప్పటికి నా వయస్సు ఇరవై నాలుగు. బ్రహ్మానంద రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన మూడో సంవత్సరంలో



ఎస్సెల్సీ ప్యాస్ అయ్యాను. పెళ్ళి అయిన కొత్తలో రాసిన ఉత్తరాలు చదివి ముగ్ధురాలై -"ఏవండీ ప్రతి అడ్డమైన వాళ్ళూ పత్రికలకి రాస్తున్నారు కదా- మీరు మాత్రం ఎందుకు రాయకూడదూ? పైగా మీ దస్తూరి ముత్యాలకోవలా వుంటుంది కూడాను" అని శ్రీమతి రాచి రంపాన పెడుతుంటే అప్పట్నుంచీ అవిశ్రాంతంగా అవీ యివీ అని లేకుండా అది యిదీ అని లేకుండా రాస్తూ వస్తున్నాను.

నా మనసు అంచుల్లో, గుండెపొరల్లో మానవత పుష్కలంగా వుందని మిత్రులు అంటుంటారు. ఎందుకేనా మంచిది ఇ.సి.జి. తీయించుకోమన్నారు.

నా రచనల ద్వారా యీ సమాజంలో ఒక్కరిసైనా మార్చగలిగితే - ఒక్కరిసైనా కంటతడి పెట్టించకలిగితే - ఒక్కరిసైనా నవ్వించగలిగి నా లక్ష్యం నెరవేరినట్లే! అంతవరకు నిరంతరం... ఇంతే!

(దీనికి బదులుగా నేను మారాననీ, నేను కంటతడి పెట్టాననీ, నేను నవ్వాననీ వందలాది వుత్తరాలు ఆ స్వ- పరిచయస్థుడికి అందాయి)

-రచయిత

జ్యోతి మాసపత్రిక ప్రమోద- ఉగాది సంచిక

**బయోడేటాలో కొందరు మరీ బడాయిగా రాస్తూంటారు-కొందరు పజిల్స్ లాగా. అందులో పెద్ద తిరకాసులు దేనికో మనకి తెలియదు. ఆ బాపతులకిది పేరడీ-**



